టారిఫ్‌లతో జిడిపికి ప్రమాదమే

- వృద్ధి 0.6 శాతం వరకు తగ్గొచ్చు
- దీర్ఘకాలం కొనసాగితే మరింత కష్టమే
- సిఇఎ అనంత నాగేశ్వరన్ వెల్లడి

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 39 | విజయవాడ, మంగళవారం 9 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 9 September 2025 | Rs

ఆసియాకప్ సంగ్రామం నేటి నుంచే..

- తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో హాంకాంగ్ ఢీ



8



భగ్గుమన్న నేపాల్ !

ఖాట్మండు సహా పలు ప్రధాన నగరాల్లో చెలరేగిన నిరసనలు

పోలీసు కాల్పుల్లో 19మంది మృతి, వందలాదిమందికి గాయాలు

సోషల్ మీడియా నిషేధంపై ఆందోళనలు, ఎత్తివేసిన ప్రభుత్వం

హోం మంత్రి రమేష్ లేఖక్ రాజీనామా

ఖాట్మండు : నేపాల్ భగ్గుమంది. రాజధాని ఖాట్మండు సహా పలు ప్రధాన నగరాల్లో సోమవారం నిరసనలు, ఆందోళనలు, హింస చెలరేగింది. ఆందోళనకారులను చెదరగొట్టడానికి పోలీసుల పలు రౌండ్లు జరిపిన కాల్పులు, హింసాకాండలో ఇప్పటివరకు 19మంది మరణించారని, వందలాది మంది గాయపడ్డారని నేపాల్ వార్తా పత్రికలు వెల్లడించాయి. పలు ప్రధాన నగరాల్లో కర్ఫ్యూ విధించారు. దేశవ్యాప్తంగా పలుచోట్ల భద్రతా బలగాలతో వేలాదిమంది ఆందోళనకారులు ఘర్షణలకు దిగారు. నేపాల్ ప్రభుత్వ అవినీతి ఆరోపణలపైనా, ఇటీవల ప్రభుత్వం సోషల్ మీడియాపై విధించిన నిషేధానికి వ్యతిరేకంగా రాజధాని ఖాట్మండులోని పార్లమెంటు వెలుపల జనరేషన్ - జెడ్ ఆందోళనకారులు నిరసనలకు దిగారు. ఖాట్మండుతో పాటూ పోఖ్రా, బుత్వాల్, భైరవా, భరత్‌పూర్, ఇటాహరి, దామక్ సహా పలు ప్రధాన నగరాల్లో వీధుల్లోకి వచ్చిన యువత ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోషల్ మీడియాపై నిషేధం విధించడమంటే భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేయడమేనని విమర్శించారు. పౌరులపై నిఘా పెంచడమేనన్నారు. ప్రజల ఆందోళనకు ప్రభుత్వం తలొగ్గింది. సోషల్ మీడియాపై నిషేధం ఎత్తివేస్తున్నట్లు సమాచార శాఖ మంత్రి పృధ్వి సుబ్బగురుంగ్ సోమవారం అర్ధరాత్రి ప్రకటించారు.

కర్ఫ్యూను కూడా లెక్కచేయక...

సాయంత్రం 3.30గంట నుండి కర్ఫ్యూ విధించినా దాన్నేమాత్రమూ లెక్క చేయకుండా ఆందోళనలు సాగాయి. నిరసనకారులు పార్లమెంటు గేటును ధ్వంసం చేసి, ఆవరణలోకి చొచ్చుకుపోవడంతో పోలీసులు పలుమార్లు కాల్పులు జరిపారు. జల ఫిరంగులను, బాష్పవాయు గోళాలను, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. పలుచోట్ల భద్రతా బలగాలతో ఆందోళనకారులు ఘర్షణ కూడా మిగతా 7లో

నేటి నుంచి ఇఎపిసెట్ తుది దశ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్ తుది దశ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి కార్యదర్శి టి కృష్ణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్, నగదు చెల్లింపు ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆప్షన్ల నమోదు 9 నుంచి 12వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆప్షన్లు మార్చుకునే అవకాశం 13వ తేదీ ఉంటుందన్నారు. సీట్ల కేటాయింపు 15వ తేదీ ప్రకటిస్తామని, అదేరోజు తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీలోపు కళాశాలల్లో రిపోర్టు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

11 నుంచి ఫార్మా తొలిదశ కౌన్సిలింగ్

ఫార్మా అడ్మిషన్ల కౌన్సెలింగ్ ఈ నెల 11 నుంచి ప్రారంభం కానుందనిఉన్నత విద్యామండలి కార్యదర్శి టికృష్ణమూర్తి తెలిపారు. విద్యార్థుల ప్రవేశాలకు రిజిస్ట్రేషన్, నగదు చెల్లింపు ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ఉంటుందన్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 12 నుంచి 17వ తేదీ వరకు, ఆప్షన్ల ఎంపిక 13 నుంచి 18వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆప్షన్ల మార్పు 19న, 21న సీట్ల కేటాయింపు, తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. 23వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలన్నారు. రెండో దశ కౌన్సెలింగ్ 24 నుంచి ప్రారంభం కానుందని వెల్లడించారు. 24, 25వ తేదీల్లో ఆప్షన్ల ఎంపిక, 26న ఆప్షన్లు మార్చుకోవచ్చునని తెలిపారు. 28న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. అక్టోబరు 6 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 8వ తేదీ వరకు కళాశాలల్లో రిపోర్టు చేసే అవకాశం ఉందని వెల్లడించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు

- మోడీ పాలనలో పెరిగిన రైతుల ఆత్మహత్యలు
- కేంద్ర నిధులకు ఆశపడే యూరియా కొరత
- చంద్రబాబు, జగన్ బిజెపి తొత్తులే
- బహిరంగ సభలో ఎఐఎడబ్ల్యుయు అధ్యక్షులు కె.విజయరాఘవన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి



బహిరంగ సభలో మాట్లాడుతున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్

కేంద్రంలోని బిజెపి సర్కారు అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు జరగనున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు కడపలో సోమవారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా తొలుత కడపలోని హరితా హోటల్ నుంచి కోటిరెడ్డి సర్కిల్, ఎన్‌టిఆర్ సర్కిల్, ఏడు రోడ్ల కూడలి మీదుగా పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ భూపంపిణీ, ఉపాధి హామీ, జిల్లా సమగ్రాభివృద్ధిపై వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్ అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా హాజరై కె.విజయ రాఘవన్ మాట్లాడారు. ప్రధాని మోడీ పాలనలో దేశంలో పేదరికం పెరిగిందన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, మత ఉద్రిక్తలు రెచ్చగొట్టాలని చూస్తున్నారని, కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని వివరించారు. మోడీ పదేళ్ల పాలనలో అదాని సంపద రూ.10 లక్షల కోట్లు, అంబాని ఆస్తులు 350 రెట్లు పెరిగాయని తెలిపారు. భూ సంస్కరణలను వెనక్కినెట్టి దళితుల, గిరిజనుల, పేదల భూములను కార్పొరేట్లకు కట్టబడుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. దేశంలో గ్రామీణ నిరు ద్యోగం పెరుగుతోందని వివరించారు. 55 ఏళ్లుగా భూ సంస్కరణలు అమలు చేసి భూమిలేని పేదలకు భూ పంపిణీ చేసి దేశంలోనే కేరళ రాష్ట్రం మోడల్‌గా నిలిచిం దన్నారు. ఉత్తరాది బిజెపి రాష్ట్రాల్లోని బ్రాహ్మణుల కంటే కేరళలోని దళితులు మెరుగైన జీవన ప్రమాణాలను కలిగి ఉన్నారని తెలిపారు. మతతత్వ బిజెపిని టిడిపి, జనసేన బలపరుస్తుండడం ఆందోళనక రమన్నారు. సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కార్మికులు, పేదలు ఐక్యంగా పోరాడాలని పిలుపు నిచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో చంద్రబాబు, జగన్ బిజెపికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ దేశంలో మోడీ మోడల్, చంద్రబాబు మోడల్, కేరళ మోడల్ ఉన్నాయన్నారు. వ్యవసాయ కార్మికులు, దళితులు, గిరిజనులు, గ్రామీణులకు ఏవి సరిపోతాయోననే అంశంపై చర్చ నడుస్తోందని తెలిపారు. నీతి ఆయోగ్ లెక్కల ప్రకారమే గుజరాత్‌లో 18 శాతం పేదరికం ఉందని, కేరళలో ఒక్క శాతమూ లేదని చెబుతోందన్నారు. దీన్నిబట్టి మోడీ మోడల్ నిరుద్యోగాన్ని పెంచుతున్నట్లు తేలిందని వివరించారు. కేరళలో మహిళా కార్మికులకు రూ.1,000 చొప్పున వేతనం ఇస్తున్నారన్నారు. ఎపి, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రభుత్వ భూములను పేదలకు మిగతా 7లో

ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు

ఉల్లి పంటను కొనుగోలు చేయండి • సమీక్షలో సిఎం ఆదేశం • సమావేశం నుండే కేంద్రమంత్రికి ఫోన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెంలో ఆనారోగ్యం, కాఫీ పంటకు తెగులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతులకు యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.. ఈ సమావేశం నుండే కేంద్ర మంత్రి జెపి నడ్డాతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. కాకినాడ తీరానికి రానున్న నౌకలో ఏడు రేక్‌ల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని సిఎం కోరగా, కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇదే విషయాన్ని అధికారులకు చెప్పిన సిఎం.. దీంతో రాష్ట్రానికి అదనంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లయ్యిందని పేర్కొన్నారు. ఈ అంశంపై కొందరు రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న యత్నాలను నిలువరించాలని సూచించారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ఇచ్చే ప్రోత్సాహకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు. అనంతరం ఉల్లిపంటపై మాట్లాడిన సిఎం ఉల్లి క్వింటాకు రూ.1,200కు తక్కువ కాకుండా చూడాలని ఆదేశించారు. ఎవరైనా ఆ ధర కంటే తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనాల మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లతోపాటు మార్కెట్‌కు తరలించాలని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటనపై సిఎం ఆరా తీశారు. పంటను కనీసం మార్కెట్‌కు తేకుండానే పురుగు మందు తాగినట్లు డ్రామా ఆడిన వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని అధికారులు సిఎంకు తెలిపారు. అరకు కాఫీ పంటకు సోకిన తెగులుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఎం అన్నారు. తెగులు సోకిన 60 ఎకరాల్లో పంట తొలగించామని, మరో 20 ఎకరాల్లో తొలగిస్తున్నామని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. తురకపాలెంలో ఆరోగ్య సమస్యలపైనా అధికారులకు సూచనలు ఇచ్చారు. వ్యాధికి మూలం ఎక్కడుందన్న అంశాన్ని గుర్తించాలన్నారు.

పౌర సేవల్లో సంతృప్త స్థాయికి ప్రాధాన్యత

ప్రభుత్వ విభాగాలు అందించే వివిధ పౌర సేవల్లో సంతృప్త స్థాయిపై ఇక ప్రతివారం సమీక్షిస్తానని సిఎం స్పష్టం చేశారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసి, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలు అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటాని తెలిపారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాల వల్ల సంతృప్త స్థాయిపై ప్రభావం పడుతుందన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మూగబాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖలో దారుణం చోటుచేసుకుంది. సీతమ్మధారకు చెందిన 11 సంవత్సరాల మూగ బాలికపై ఇద్దరు బాలురు అత్యాచారానికి ఒడిగట్టారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం... సీతమ్మధారలోని కొండప్రాంతంలో బిలాల్ కాలనీ ఉంది. ఆ కాలనీకి చెందిన మూగ బాలిక బయట తిరుగుతుండగా 16 ఏళ్ల ఇద్దరు బాలురు ఆమెను మాయమాటలతో నిర్మానుష్యంగా ఉండే కొండపైకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక ఏడుస్తూ వచ్చి జరిగిన ఘటనను తల్లిదండ్రులకు వివరించింది. దీంతో, బాలిక తల్లిదండ్రులు 112 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. ద్వారక పోలీసులు సోమవారం ఇద్దరు మైనరు నిందితులను అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. నిందితులపై 140/2025, యుఎస్ 70 (2), బిఎన్‌ఎస్ సెక్షన్లు 5 (జి), 5 (ఎం) ఆర్‌డబ్ల్యు-6, పోక్సో చట్టం-2012 కింద కేసులు నమోదు చేశామని పోలీసు కమిషనర్ తెలిపారు.

12వ గుర్తింపు పత్రంగా ఆధార్‌ను ఆమోదించాల్సిందే

- ఎస్ఐఆర్ ప్రక్రియపై ఇసికి స్పష్టంచేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో ఆధార్‌ను 12వ గుర్తింపు కార్డుగా ఆమోదించాల్సిందేనని ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. రుజువు కోసం ఇప్పటికే ఇసి 11 పత్రాలను ఆమోదించింది. వాటికి అదనంగా 12 పత్రంగా ఆధార్ చేరింది. దీన్ని పౌరసత్వానికి ఒక ధ్రువీకరణ పత్రంగా పరిగణించడానికి వీల్లేదని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. అవసరమైన పక్షంలో ఆధార్ కార్డు సరైనదేనా? కాదా? అని తనిఖీలు చేయవచ్చని పేర్కొంది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ... ఆధార్‌ను గుర్తింపు పత్రంగా ఆమోదించాలని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఎన్నికల కమిషన్ అలా వ్యవహరించ లేదని, కాబట్టి ఈ చర్య సుప్రీంకోర్టు ఆదేశాల ఉల్లంఘన కిందకే వస్తుందని అన్నారు. పైగా ఆధార్ కార్డును ఆమోదించినందుకు గానూ పోలింగ్ కేంద్రం స్థాయి అధికారి (బిఎల్ఓ)కు షోకాజ్ నోటీసు జారీచేసిన విషయాన్ని సిబల్ గుర్తు చేశారు. ఆధార్‌ను ఆమోదించాలంటూ ఇసి ఇంకా తన అధికారులకు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొన్నారు. ఇసి తరపున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది మాట్లాడుతూ, ఓటర్ల జాబితా కోసం పౌరసత్వాన్ని పరిశీలించే అధికారం ఇసికి వుందని వాదించారు. ఆధార్‌ను పౌరసత్వం రుజువుగా ఆమోదించలేమని చెప్పారు. అయినా రాష్ట్రంలోని 7.24 కోట్లమంది ఓటర్లలో 99.6శాతం మంది ఇప్పటికే అవసరమైన పత్రాలను అందజేశారని తెలిపారు. ముసాయిదాలో తొలగించిన వారి పేర్లను అనుమతించడానికి ఆధార్ అనుమతించామని, పెద్దసంఖ్యలో ఓటర్లు తొలగించబడినప్పటికీ ఏ ఒక్కరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు. "ఆధార్ విషయంలో చట్టం చాలా స్పష్టంగా వుంది. అధికారిక పత్రాల్లో ఆధార్ ఒకటి. మీరు (ఇసి) దాన్ని తీసుకోవాలి, అవసరమైతే పరిశీలించాలి." అని జస్టిస్ కాంత్ స్పష్టం చేశారు. ఆధార్ కార్డు సరైనదా? కాదా? అని తేల్చుకోవడంపై కమిషన్ వ్యక్తంచేసిన ఆందోళనలను గుర్తిస్తూ జస్టిస్ కాంత్, కచ్చితంగా ఇసి దాన్ని నిర్ధారించుకోవచ్చునన్నారు. ఈ దేశ పౌరులెవరో వారు కచ్చితంగా ఓటు వేయవచ్చు, ఫోర్జరీ పత్రాల ప్రాతిపదికన పౌరసత్వం వుందని చెప్పుకునేవారు ఎప్పటికీ ఓటు వేయలేరని స్పష్టంచేశారు. ప్రజాప్రాతినిధ్య మిగతా 7లో

సీనియర్ ఐఎఎస్‌ల బదిలీ

- గవర్నరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంత్‌రామ్
- టిటిడి ఇఒగా అనిల్ కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఎఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సోమవారం జిఓ ఆర్‌టి నెంబరు 1643ని విడుదల చేసింది. గవర్నరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా అనంత్‌రామ్‌ను నియమించింది. ఇప్పటి వరకు అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎం హరి జవహర్‌లాల్‌ను రెవెన్యూ (ఎండోమెంట్స్) ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న వాడరేవు వినయ్‌చంద్‌ను అదనపు బాధ్యతల నుంచి ప్రభుత్వం రిలీవ్ చేసింది. దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న అనిల్ కుమార్ సింఘాల్‌ను టిటిడి ఇఒగా నియమించింది. సింఘాల్ గతంలోనూ ఒక దఫా టిటిడి ఇఒగా పని చేశారు. ఇప్పటి వరకు టిటిడి ఇఒగా ఉన్న జె శ్యామల రావు సాధారణ పరిపాలనాశాఖ (పొలిటికల్) ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు అక్కడ ఉన్న ముఖేష్‌కుమార్ మీనా రెవెన్యూ (ఎక్సైజ్) డిపార్టుమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులయ్యారు. మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఎమ్‌టి కృష్ణబాబు రవాణా, రోడ్ అండ్ బిల్డింగ్స్ చీఫ్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సివిల్ సప్లై కమిషనరు సౌరబ్‌గౌర్‌కు మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ డిపార్టుమెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న ఎన్ యువరాజ్‌ను రిలీవ్ చేశారు. ఎపి భవన్ రెసిడెంట్ కమిషనరుగా ప్రవీణ్‌కుమార్, మైనార్టీ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ శ్రీధర్, అటవీ, పర్యావరణశాఖ కార్యదర్శిగా కాంతిలాల్ దండేను ప్రభుత్వం నియమించింది. పనితీరు ఆధారంగా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల బదిలీలు కూడా నేడో, రేపో ఉండొచ్చని తెలుస్తోంది. బదిలీల్లో ముఖ్యంగా పథకాల అమలు, ఫిర్యాదుల పరి ష్కారం, పనితీరు, వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని కీలక పోస్టుల్లో నియమించేలా సిఎంఒ జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం.

నేడో, రేపో ఐపిఎస్‌ల బదిలీలు

ఐపిఎస్‌ల బదిలీలు నేడో, రేపో భారీగా ఉంటాయని సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ పలువురు పోలీస్ ఉన్నతాధికారులు గత పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ ప్రక్షాళనలో కూటమి మార్కు ఉండేలా ఐపిఎస్‌ల పోస్టింగులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

ఫ్రాన్స్‌లో కుప్పకూలిన ప్రభుత్వం

- విశ్వాస పరీక్షలో ఓడిన ప్రధాని బేరౌ



పారిస్ : ఫ్రాన్స్‌లో మరోసారి ప్రభుత్వం కుప్పకూలింది. సోమవారం జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధానమంత్రి ఫ్రాన్స్యోయిస్ బేరౌ దారుణంగా ఓడిపోయారు. బేరౌకు వ్యతిరేకంగా 364 ఓట్లు రాగా, అనుకూలంగా 194 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రధానమంత్రిగా నియమితులైన ఎనిమిది నెలలకే బేరౌ గద్దె దిగకతప్పలేదు. మంగళవారం ఉదయం అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు బేరౌ తన రాజీనామా లేఖను సమర్పించనున్నారు. విశ్వాస పరీక్షలో బేరౌ ఓటమిని అధ్యక్షులు మాక్రాన్‌కు భారీ రాజకీయ ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. గత రెండేళ్లలో మాక్రాన్ నియమించిన ప్రధాని విశ్వాస పరీక్షలో ఓటమి పాలవడం ఇది మూడోసారి. బేరౌకు ముందు గత డిసెంబరులో మిచెల్ బార్నియర్ విశ్వాస పరీక్షలో ఓటమి పాలయ్యారు. ఫ్రాన్స్ చరిత్రలోనే అతి తక్కువగా మూడు నెలలే పదవిలో ఉన్నా ప్రధానిగా మిచెల్ రికార్డులకెక్కారు. గతేడాది సెప్టెంబర్‌లో గాబ్రియల్ అట్టల్ విశ్వాస పరీక్షలో ఓడిపోయారు.

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఓటింగ్‌కు బిఆర్ఎస్, బిజెడి దూరం
- ఇండియా ఫోరం అభ్యర్థికి ఎంఐఎం మద్దతు
- టిడిపి, వైసిపిల మద్దతు ఎన్‌డిఎకే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి



సిపి రాధాకృష్ణన్

మరికొన్ని గంటల్లో జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. జగదీప్ ధన్‌ఖర్ జులై 21న అకస్మాత్తుగా చేసిన రాజీనామాతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్‌డిఎ అభ్యర్థి, మహారాష్ట్ర ప్రస్తుత గవర్నరు సిపి రాధాకృష్ణన్, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి బరిలో నిలిచారు. రహస్య బ్యాలెట్ పద్ధతిన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్ హౌస్‌లోని వసుధ రూమ్ నెంబర్ ఎఫ్ 101లో పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీలో ఉన్న లోకసభ, రాజ్యసభ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం ఎన్నికల ఫలితాలు వెలువరించనున్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల వైఖరి ఈ ఎన్నికలలో చర్చనీయాంశమైంది. విభజన నష్టాలను పూడ్చుకోవడంతో పాటు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, పోలవరం నిర్వాసితులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి స్పష్టమైన హామీ పొందడానికి ఈ ఎన్నికలు అవకాశం ఇచ్చినప్పటికీ రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షపార్టీలు ఆ అవకాశాన్ని వదులుకున్నాయి. తెలుగుదేశం, వైసిపిలు పోటీపడి ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతిచ్చిన తీరు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా ఇచ్చిన తీర్పులను ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రస్తావించడం, ఆయనపై వ్యక్తిగత ఆరోపణలకు దిగడంకూడా దేశవ్యాప్తంగా పలువురి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆత్మప్రభోదనుసారం ఓటు వేయాలని కోరుతున్నారు. తాజాగా ఇండియా ఫోరం అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి ఎంఐఎం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసీ ఎక్స్‌లో పోస్టు చేశారు.రహస్య బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ జరుగుతుండటంతో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యులకు విప్ జారీ చేసే అవకాశం లేకపోవడం గమనార్హం. ఎన్నికల ప్రక్రియ గురించి తమ సభ్యులకు వివరించేందుకు ఎన్‌డిఎ, ప్రతిపక్ష పార్టీలు వేర్వేరుగా సభ్యులతో సమావేశాలు నిర్వహించి, మాక్ పోలింగ్ కూడా నిర్వహించాయి. ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ తరపున రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఢిల్లీకి చేరుకుని తమ పార్టీ ఎంపిలతో సమావేశమైనారు. మరోవైపు పార్లమెంట్‌లోని సెంట్రల్ హాల్‌లో సోమవారం ఇండియా ఫోరమ్ పార్టీల సభ్యులకు సీనియర్ నేతలు ఎన్నికల ప్రక్రియ గురించి వివరించారు. ఎస్‌పి సీనియర్ మిగతా 7లో


మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

తురకపాలెంలో మట్టి నమూనాల సేకరణ

- కొనసాగుతున్న వైద్య పరీక్షలు ఒకరికి మెలియాయిడోసిస్ నిర్ధారణ : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా తురకపాలెంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ రీసెర్చ్ కొలాబరేషన్‌తో ఉన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీబయో ఏస్థటిక్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ మట్టి నమునాలను సేకరించింది. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో మొత్తం ఎనిమిది నమునాలను సేకరించింది. మట్టిలో బర్కోల్డేరియా సూడోమల్లి బ్యాక్టీరియా ఉందా? లేదా? అనేది నిర్ధారించనుంది. గ్రామంలో వైద్యారోగ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం పది బృందాలు 80 రక్త నమునాలను సేకరించాయి. గ్రామానికి చెందిన 300 మందికిపైగా వలస వెళ్లినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారికి సంబంధించి దాదాపుగా శాంపిల్స్ సేకరణ పూర్తి అయ్యిందని చెప్పారు. వరుసగా మూడోరోజు కూడా ప్రజలకు ఆహారం, నీటి సరఫరా చేశారు. గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిలో ఆరుగురిని జిజిహెచ్‌కు తరలించారు. వారికి సీరం పరీక్షలు చేయగా, నివేదికలు రావాల్సి ఉంది. ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒకరికి మెలియాయిడోసిస్ నిర్ధారణ అయినట్లు డిఎంహెచ్ఒ తెలిపారు.


ట్యాంక్‌పై ఫోమ్ జల్లుతున్న హెలికాప్టర్

అదుపులోకి రాని మంటలు

- హెలికాప్టర్ సాయంతో ఈస్ట్ ఇండియా కంపెనీలో ట్యాంక్‌పై ఫోమ్ పిచికారి

ప్రజాశక్తి -ములగాడ (విశాఖపట్నం)

ఈస్ట్ ఇండియా పెట్రోలియం కెమికల్స్ (ఇపిఎల్) కంపెనీలోని కెమికల్ ట్యాంక్‌పై పిడుగుపడి వ్యాపించిన మంటలను అదుపు చేసేందుకు సోమవారం నేవల్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టింది. హెలికాప్టర్ సాయంతో ట్యాంక్‌పై ఫోమ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఇథనాల్ ట్యాంక్‌పై పిడుగుపడి మంటలు వ్యాపించిన సంగతి తెలిసిందే. 30 అగ్నిమాపక శకటాలు సుమారు ఎనిమిది గంటల పాటు శ్రమించినా మంటలు అదుపులోకి రాలేదు. దీంతో భారత నౌకాదళానికి చెందిన సికింగ్ హెలికాప్టర్ ద్వారా ఫైర్ బకెట్‌తో మంటలను ఆర్పేందుకు చర్యలు చేపట్టారు. ఇథనాల్ ట్యాంకులో సుమారు 18 వేల లీటర్ల ఇంధనం నిలువ ఉంటుందని, అది పూర్తిస్థాయిలో మండే వరకూ మంటలు ఇదే మాదిరిగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - డోన్ (నంద్యాల)


శ్యాంసుందర్ (ఫైల్)

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా డోన్‌లో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..అనంతపురం జిల్లా యాడికి పట్టణానికి చెందిన రమేష్, సావిత్రి దంపతులకు ఇద్దరు కుమారులు శ్యాంసుందర్ (15), సిద్ధార్థ ఉన్నారు. డోన్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శ్యాంసుందర్ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. బిసి హాస్టల్లో ఉంటే ప్రతిరోజూ కాలేజీకి వెళ్లేవారు. హాస్టల్లో ఉండలేనని ఇటీవల తన పెద్దనాన్నకి ఫోన్ చేసి శ్యాంసుందర్ చెప్పారు. స్నేహితులతో కలవలేకపోవడంతో ఒంటరిగా ఉండేవారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం బాత్‌రూమ్‌కు వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో తోటి విద్యార్థులు బలవంతంగా తలుపు తెరిచారు. ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న శ్యాంసుందర్‌ను గమనించి వెంటనే హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తురకపాలెం మరణాలపై న్యాయవిచారణ

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం
- ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా తురకపాలెంలో సంభవించిన అసాధారణ మరణాలపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు బాబూరావు మాట్లాడుతూ... తురకపాలెంలో అసాధారణ మరణాలు సంభవిస్తున్నప్పటికీ వైద్యారోగ్యశాఖ, పంచాయతీగానీ పట్టించుకోలేదన్నారు. మీడియాలో వార్తలు వచ్చిన పది రోజుల తరువాత మంత్రులు పర్యటించారని, ఇది ప్రభుత్వ వ్యవస్థల లోపాన్ని తెలియజేస్తోందని వివరించారు. నీటి వ్యాపారాన్ని అరికట్టి, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని కోరారు. అసాధారణ మరణాలపై స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారం రోజుల్లోగా పరిహారం విడుదల చేయని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ... తురకపాలెంలో గత రెండు నెలల క్రితం వరకు క్వారీ నుంచి వచ్చే మురుగు నీటిని శుద్ధి చేసి సరఫరా చేసే వారని గ్రామస్తులు చెబుతున్నారని, ఆ నీటిని పరీక్షలకు పంపించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కాలుష్యాన్ని వెలువరిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నేతాజి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యన్. భావన్నారాయణ, సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

15 రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే

రాష్ట్ర వ్యాప్త నిరసనలు

- జిఎస్‌డబ్ల్యుఎస్ డైరెక్టర్‌కు ముందస్తు లేఖ అందించిన ఐక్యవేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలశాఖ ఉద్యోగుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమాలు చేపడతామని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక వెల్లడించింది. ఈ మేరకు జెఎసి ఐక్యవేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎమ్‌డి జాని పాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, కన్వీనరు షేక్ అబ్దుల్ రజాక్, కో ఛైర్మన్లు బుత్తల అంకమ్మరావు, డి మధులత, ఎస్ మహాలక్ష్మి, జాన్ క్రిస్టోఫర్ నేతృత్వంలో ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు సోమవారం నిరసన కార్యక్రమాల నోటీస్ అందజేశారు. అంతకముందు ప్రభుత్వం దృష్టికి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తీసుకెళ్లారు.

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతిసారీ ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం, క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురికావడంతో పాటు ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లుతుందనే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఇంటింటికీ తిరిగే పనుల నుంచి విముక్తి కల్పించాలని, ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని, నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, అన్ని విభాగాల వారీ ప్రమోషన్స్ ఛానెల్స్ ఏర్పాటుతోపాటు జిల్లాల వారీ సీనియారిటీ జాబితా విడుదల చేయాలని డైరెక్టర్‌కు ఐక్యవేదిక నేతలు విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగే ప్రత్యేక విధి విధానాలు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. విద్యార్హతల ఆధారంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించేలా అవకాశాలు కల్పించాలని నేతలు విజ్ఞప్తి చేశారు.

డైరెక్టర్‌కు నోటీస్ అందజేత

సచివాలయ ఉద్యోగుల సమస్యలతోపాటు ప్రమోషన్ ఛానెల్‌ను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో అక్టోబరు ఒకటి నుంచి ఉద్యమంలోకి వెళ్లాల్సి వస్తోందంటూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఛైర్మన్ మధుబాబు బూరాడ, కార్యదర్శి బి జగదీష్ కలిసి గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టర్‌కు లేఖ అందించారు.

వలంటీర్ల విధులు చేయించడం ఎంతవరకు సబబు : ఆర్లయ్య

వలంటీర్ల విధులను కూడా తమతో చేయించడం ఎంత వరకు సబబు అని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్లయ్య, గోవిందరావు పేర్కొన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని రోజురోజుకూ దిగజారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్‌పై విద్యార్థి దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటి ప్రొఫెసర్‌పై విద్యార్థి దాడి చేసిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ట్రిపుల్ ఐటి డైరెక్టర్ అమరేంద్రకుమార్, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... విజయనగరం జిల్లా కొత్తవలస మండలం వడ్డిగూడేనికి చెందిన మజ్జి వినయ్ పురుషోత్తం నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఎంటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. సోమవారం సెకండ్ సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యేందుకు పరీక్షా హాలుకు వెళ్లారు. అటెండెన్స్ తక్కువ ఉండడంతో పురుషోత్తంను ప్రొఫెసర్ గోపాలరాజు అనుమతించలేదు. హెచ్ఒడి నుంచి అనుమతి తెచ్చుకోవాలని విద్యార్థికి సూచించారు. కొద్దిసేపటి తర్వాత హెచ్ఒడి అనుమతినిచ్చారని చెప్పి పరీక్ష హాలులోకి పురుషోత్తం వెళ్లిపోయారు. దీనిపై హెచ్ఒడికి గోపాలరాజు ఫోన్ చేశారు. పురుషోత్తం తన వద్దకే రాలేదని, ఎటువంటి అనుమతీ ఇవ్వలేదని హెచ్ఒడి చెప్పారు. పరీక్ష హాలు నుంచి విద్యార్థిని బయటకు పంపేందుకు సెక్యూరిటీ సిబ్బందిని పిలిచే ప్రయత్నం చేయగా ఒక్కసారిగా గోపాలరాజుపై చాకుతో విద్యార్థి దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గోపాలరాజు భుజం, వీపుపైనా గాయాలయ్యాయి. తోటి విద్యార్థులు అప్రమత్తమై పురుషోత్తంను నిర్బంధించి, గోపాలరాజును హుటాహుటినా ఆస్పత్రికి తరలించారు. ప్రొఫెసర్‌పై దాడికి పాల్పడిన పురుషోత్తంను అరెస్టు చేసినట్లు నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ తెలిపారు.

ఆర్ఎస్ స్ఫూర్తితో ప్రజాపోరాటాలు

- ప్రథమ వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం


ఆర్ఎస్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి బలరాం

ప్రజాశక్తి- యలమంచిలి (పశ్చిమగోదావరి జిల్లా)

సిపిఎం సీనియర్ నేత, మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) స్ఫూర్తితో ప్రజాపోరాటాలు సాగించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో ఆర్ఎస్ ప్రథమ వర్ధంతి సభ సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత అమరవీరుల స్మారక స్థూపంపై జెండాను సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం ఆవిష్కరించగా, ఆర్ఎస్ చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బలరాం మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు లాభాలను చేకూరుస్తూ పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. రైతాంగ సమస్యలను పక్కన పెట్టడంతోపాటు వ్యవసాయ కార్మికులకు ఆసరాగా ఉంటున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తోందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాల కారణంగానే 11 సీట్లకు పరిమితమయ్యారని, అవే విధానాలను ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. విద్యుత్తు ఛార్జీలు పెంచబోమని అధికారంలోకి రాకముందు చెప్పి, గత ప్రభుత్వం కంటే ఛార్జీలను అధికంగా పెంచుతూ ప్రమాదకరమైన స్మార్ట్ మీటర్లను ముందుకు తీసుకురావడం దారుణమని తెలిపారు. సమస్యలపై భవిష్యత్తులో సిపిఎం నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

మంతెన సీతారాం మాట్లాడుతూ సోషలిజం ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నేత కేతా సూర్యారావు, ఆచంట మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, ఐద్వా జిల్లా నేత పొగాకు పూర్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లికి కనీస మద్దతు ధర రూ.3 వేలు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉల్లికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3 వేలు అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కర్నూలు జిల్లా, సి బెళగల్‌లో ఆత్మహత్యాయత్నం చేసిన ఉల్లి రైతులు వెంకట నాయుడు, కృష్ణపై పెట్టిన పోలీసు కేసులను తక్షణమే ఎత్తివేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతియేటా కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం రైతులను ఆదుకుంటామని ప్రకటనలు చేయడం మినహా ఉల్లి రైతులను ఆదుకునేందుకు నిర్దిష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదన్నారు. ఉల్లి ధరలు పూర్తిగా పతనమై క్వింటా రూ.500 మాత్రమే కర్నూలు మార్కెట్‌లో రైతులకు లభిస్తుందని తెలిపారు. మార్కెట్ యార్డ్‌లో ఉల్లి వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు తగ్గించి రైతులను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన మార్కెట్ అధికారులు ఉల్లి ఆఫర్లపై ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.1,200 ప్రకటించిందని, ఈ ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నారు. ఉల్లి పంటకు ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చవుతుందని తెలిపారు. ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్ల లోపు ఉల్లి దిగుబడి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులను ఏమాత్రం ఆదుకునే పరిస్థితి లేదని తెలిపారు. దీంతో ఆందోళన చెందిన రైతులు ఆత్మహత్యాయత్నం చేస్తే వారి సమస్యలను పరిష్కరించలేని ప్రభుత్వం.. రైతులపై ఆత్మహత్య కేసులు పెట్టడం దారుణమన్నారు. తక్షణమే ఉల్లి రైతులపై పెట్టిన ఆత్మహత్యాయత్నం కేసులను రద్దు చేయాలని, ఉల్లికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ.3 వేలు ప్రకటించి అమలు చేయాలని, వ్యాపారుల సిండికేట్ల నుంచి రైతులను కాపాడాలని, రైతులను మోసం చేస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బైండోవర్ కేసు తక్షణమే తొలగించాలి : ఎపి రైతు సంఘం

సిఐటియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్‌పై పెట్టిన బైండోవర్ కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోని కోడూరు, చిట్వేలు, పెనుగులూరు, ఓబులవారిపల్లె తదితర మండలాల్లో రైతులు విస్తారంగా సాగుచేసిన బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా వ్యాపారులు, మధ్యదళారులు రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల రోజులుగా రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్‌పై రైల్వేకోడూరు పోలీసులు బైండోవర్ కేసు పెట్టారని పేర్కొన్నారు. పోలీసుల దుశ్చర్యను ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. బొప్పాయి రైతులకు న్యాయం చేయాలని, వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరడం చంద్రశేఖర్ చేసిన నేరంగా పోలీసులు భావిస్తున్నారని వెల్లడించారు. చంద్రశేఖర్‌పై బైండోవర్ కేసు నమోదు చేయడాన్ని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ప్రభుత్వం చంద్రశేఖర్‌పై బైండోవర్ కేసును తొలగించాలని, బొప్పాయి రైతులకు న్యాయమైన ధర చెల్లించాలని కోరారు. కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ కిలోకు రూ.9 ధర అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారని తెలిపారు. మధ్య దళారులు, ఢిల్లీ వ్యాపారులపై సెక్షన్ 420 కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కఠిన చర్యలొద్దు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి-అమరావతి

మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోరాదని సోమవారం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులను ఆదేశించి విచారణను ఈ నెల 11కు వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటన సమయంలో తమ విధులకు నల్లపురెడ్డి ఆటంకం కలిగించారని పేర్కొంటూ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య చేసిన ఫిర్యాదు ఆధారంగా దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ నల్లపురెడ్డి వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఆయనపై ఏవిధమైన కఠిన చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది.

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దక్షిణ ఒడిశా - ఉత్తరాంధ్ర తీరాలకు ఆనుకుని వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. దీని ప్రభావంతో రేపు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాలు, భారీ హోర్డింగ్‌ల వద్ద ఉండరాదని సూచించారు.

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించి యూరియా లభ్యతపై రైతులకు నమ్మకాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. సచివాలయం నుంచి ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ను సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగానే ఉందని, దానిని సక్రమంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే భూసారం దెబ్బతింటుందన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొందరు రైతులు రబీ కోసం ఇప్పుడే ఎరువులు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రబీ పంట కోసం ముందస్తుగానే ఎరువులు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో క్రిమినల్ తరహాలో ఆలోచిస్తూ కొందరు ఎరువుల లభ్యత ఉండదన్న అభద్రతా భావాన్ని రైతులకు కల్పిస్తున్నారని, దీనిని నియంత్రించాలని స్పష్టం చేశారు. సీజన్‌లో సాగునీరు ముందుగానే ఇవ్వడం వల్ల పంటల సాగు కూడా ఎక్కువ చేశారని పేర్కొన్నారు. వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, టమోటా, చీని ఉత్పత్తి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, దీనికి స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలని సూచించారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ 'డెక్కన్' ఫార్మా ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని డెక్కన్ రెమెడీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలో ఈ నెల ఐదున ఇథనాల్ వాయువు పీల్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిన సీనియర్ కెమిస్ట్ ఎం.పోలినాయుడు (41) సోమవారం తెల్లవారుజామున మరణించారు. ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల ఐదవ తేదీ సాయంత్రం సెంట్రిక్ ట్యూబ్ మిషన్ వద్ద పోలినాయుడు పనిచేస్తుండగా ఇథనాల్ వాయువు పీల్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. సెంట్రీ క్యూబ్ మిషన్ నుంచి పౌడర్‌ను వేరుచేసే సమయంలో ఇథనాల్ వెపర్స్ తగిలి ఈ ఘటన చోటు చేసుకుందని ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. దీనిపై కంపెనీకి నోటీసులు ఇచ్చి, కేసు నమోదుచేసి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.కోటి పరిహారం చెల్లించాలి : సిఐటియు

సమగ్ర విచారణ జరపాలని, కార్మిక కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరిశ్రమలో కార్మికుడు అస్వస్థతకు గురైన రియాక్టర్ ప్రాంతాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... యాజమాన్యం నిర్లక్ష్యం, భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఒక నిండు ప్రాణం బలైందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలో భద్రత ఆడిట్ నిర్వహించాలని, యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

రూ.60 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

శేషాచలం అటవీ పరిధిలోని అలిపిరి-చెర్లోపల్లి మార్గంలో కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 36 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ఆరుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. లగేజి వ్యాను, కారుతో సహా ఓ టూవీలర్‌ను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం... టాస్క్‌ఫోర్సు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం, అటవీ సిబ్బంది చైతన్య, కిషోర్‌లతో కలిసి అలిపిరి నుంచి చెర్లోపల్లి వైపుగా కూంబింగ్ చేపట్టారు. అరవింద్ ఐ ఆస్పత్రి సమీపంలో అటవీప్రాంతంలో కొన్ని వాహనాలు కనిపించగా వాటి దగ్గరకు వెళ్లడంతో, కొంతమంది వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వారిని వెంబడించి ఆరుగురిని పట్టుకున్నారు. వాహనాలను తనిఖీ చేయగా 27 ఎర్రచందనం దుంగలు లభించాయి. పరిసరాల్లో మరో 9, మొత్తం 36 దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.60 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. పట్టుబడిన స్మగ్లర్లను విచారించగా వారిలో ముగ్గురు కర్ణాటకలోని కట్టిగేనా హళ్లి, మరో ముగ్గురు అన్నమయ్య, చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన వారుగా గుర్తించామని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్ సిఐ సురేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


స్మార్ట్ పే ఫోన్ ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

గురుకులాల్లో స్మార్ట్‌పే ఫోన్లు

- పెనుకొండ ఎంజెపి స్కూల్లో ప్రారంభించిన మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ (సత్యసాయి)

రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో స్మార్ట్ పే ఫోన్లను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని మహాత్మ జ్యోతిబా పూలే (ఎంజెపి) స్కూల్లో స్మార్ట్ పే ఫోన్లను ప్రభుత్వ చీఫ్ విప్ జివి ఆంజనేయులతో కలిసి సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఉన్న 110 ఎంజెపి స్కూల్లో 700 స్మార్ట్ పే ఫోన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ప్రతి రోజూ మాట్లాడే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఒక్కో గురుకుల పాఠశాలలో ఆరు చొప్పున పే ఫోన్లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి విద్యార్థికీ స్మార్ట్ కార్డు అందజేస్తామని, ఆ కార్డులో తల్లిదండ్రులు సూచించిన నాలుగు నంబర్లు పొందుపరుస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్మార్ట్ పే ఫోన్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగారాజు, నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

బకాయి ఫీజులు చెల్లించకుంటే మూసేస్తాం

- ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుంటే కళాశాలలను నిరవధికంగా మూసేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ హెచ్చరించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి రాజ్‌కుమార్ చౌదరి సోమవారం లేఖ రాశారు. ఈ నిరవధిక సమ్మెకు బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న 1,380 డిగ్రీ కళాశాలల్లో 4.5 లక్షల మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో చదువుతున్నారని పేర్కొన్నారు. 2023-24, 2024-25 విద్యాసంవత్సరాల ఫీజులు పెండింగ్ పెట్టడం వల్ల కాలేజీలపై భారం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుల బాధలు ఎక్కువ కావడంతో కళాశాలలను నడిపే పరిస్థితి తమకు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకొచ్చామని తెలిపారు. 16 నెలల్లో కేవలం ఒక విడత ఫీజులు మాత్రమే డిగ్రీ కళాశాలలకు అందాయని పేర్కొన్నారు. కళాశాలలకు శాస్త్రీయంగా ఫీజులు నిర్ధారించాలని కోరారు. ఫీజుల నిర్ణయం ఎపిహెచ్ఇఆర్ఎంసి నుంచి మినహాయించి యూనివర్సిటీల పరిధిలో జరపాలని కోరారు. ఐదేళ్ల నుంచి ఉన్నత విద్యకు రాష్ట్రంలో సరైన తోడ్పాటు లేకపోయినా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో తాము ఎంతో కృషి చేశామని తెలిపారు.

సమాచార కమిషన్ విచారణ ప్రత్యక్ష ప్రసారం

- ప్రారంభించిన గవర్నరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర సమాచార కమిషన్ విచారణ ప్రత్యక్ష ప్రసారాన్ని గవర్నరు అబ్దుల్ నజీర్ సోమవారం ప్రారంభించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నరు మాట్లాడుతూ.. రాష్ట్ర సమాచార కమిషన్ విచారణ ప్రత్యక్ష ప్రసారం కమిషన్ పనితీరు మరింత పారదర్శకంగా నిర్వహించడానికి చాలా పయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషన్ కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రధాన సమాచార కమిషనరు హీరాలాల్ సమారియా, న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ రాష్ట్ర సమన్వయకర్త, శాస్త్రవేత్త ఆర్‌కె పాఠక్, గవర్నరు ఇఒ కార్యదర్శి ఎం హరి జవహర్‌లాల్ పాల్గొన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ ఆర్ మహబూబ్ బాషా వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

హెచ్‌సిఎల్ టెక్ స్వతంత్ర డైరెక్టర్‌గా అమితాబ్ కాంత్



న్యూఢిల్లీ : ప్రముఖ టెక్ కంపెనీ హెచ్‌సిఎల్ టెక్ తమ బోర్డులోకి కొత్తగా నీతి అయోగ్ మాజీ సిఇఒ అమితాబ్ కాంత్‌ను తీసుకున్నట్లు ప్రకటించింది. ఐదేళ్ల కాలపరిమితితో సెప్టెంబర్ 2030 వరకు స్వతంత్ర డైరెక్టర్‌గా ఆయన తమ కంపెనీలో కొనసాగుతారని వెల్లడించింది. అమితాబ్ నియామకానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపిందని సోమవారం రెగ్యులేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది.

గిరిజనుల భూమి జోలికొస్తే ఖబడ్దార్

- 'హైడ్రో' ఒప్పందాలు రద్దు చేయాల్సిందే
- నవయుగ కంపెనీ దిష్టిబొమ్మ దగ్ధం చేసిన ఆదివాసులు


నవయుగ కంపెనీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న ఆదివాసీలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కార్పొరేట్ కంపెనీలైన అదాని, నవయుగలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆదివాసీలు సోమవారం పెద్ద ఎత్తున ఉద్యమించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లోతేరు పంచాయతీ తొరడంవలస నుండి లోతేరు పంచాయతీ కేంద్రం వరకు ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు. గిరిజనుల భూమి, అడవి జోలికొస్తే ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. ఆదివాసీ చట్టాలు, హక్కులు ఉల్లంఘించి అడవిని, భూములను, గ్రామాలను జలసమాధి చేయొద్దని డిమాండ్ చేశారు. నవయుగ కంపెనీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ కో-కన్వీనర్ కిల్లో నోబో అధ్యక్షతన లోతేరులో నిర్వహించిన సభలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గుజ్జెలిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం చేసుకోవడం దారుణమన్నారు. ఆదివాసీ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తోన్నా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ఈ ప్రాజెక్టును 1,400 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం నుండి 2,400 మెగావాట్లకు పెంచడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గ్రామసభ తీర్మానం, అనుమతులు లేకుండా చట్టవిరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా ముందుకు వెళ్తుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. గుజ్జెలిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఎగువ డ్యామ్ నిర్మిస్తే అల్లూరి జిల్లాలోని అనంతగిరి, అరకులోయ, హుకుంపేట మండలాల్లో 16 పంచాయతీల పరిధిలోని 150 గ్రామాలు, 50 వేల మంది ఆదివాసులు, పది వేల ఎకరాల జిరాయితీ, అటవీ భూములు జలసమాధి అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మన్యం పార్వతీపురం జిల్లా పాచిపెంట మండలంలోనూ పలు గ్రామాలు మునిగిపోతాయని, సుమారు వెయ్యి కుటుంబాలకు చెందిన ఐదు వేల మంది ఆదివాసులు నిర్వాసితులవుతారని తెలిపారు. హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆదివాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ ప్రభుత్వాధికారులు పోలీసు బందోబస్తుతో గ్రామాల్లో తిరిగి ఆదివాసుల్లో భయాందోళన సృష్టిస్తున్నారన్నారు. పెదకోట, చిట్టంవలస, గుజ్జెలి పేర్లతో 4,700 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం అనుమతి ఇస్తూ ఇచ్చిన జిఒ 51ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు టి.కృష్ణారావు, మండల నాయకులు బుజ్జిబాబు, రామారావు, కిల్లో బుజ్జిబాబు, పోరాట కమిటీ కన్వీనర్ కొర్రా స్వామి, గుబ్బాయి శ్రీరాములు, పెసా కమిటీ సభ్యులు కిల్లో రామన్న, భీమ, మోహన్, నర్సింగ్, ఎంపిటిసి మాజీ సభ్యులు మోహన్, మాజీ సర్పంచ్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్ నిషాంత్ కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కె ఉమామహేశ్వరరావు, హమాలీ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు

దసరాలోపు హమాలీలకు ఎరియర్స్

- ఎపిఎస్‌బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఎస్‌బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీలకు ఆగస్టు నెల ఎరియర్స్ దసరా పండగలోపు ఇప్పించే విధంగా మద్యం కంపెనీ యజమానులకు సూచనలు ఇవ్వాలని కమిషనర్ నిషాంత్ కుమార్‌ను ఎంపిబిసిఎల్ అండ్ ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎక్సైజ్ కార్యాలయంలో కమిషనర్ నిషాంత్ కుమార్, జిఎం అనసూయ దేవి, జిసిఎం చరణ్ కుమార్‌ను సోమవారం కలిశారు. ఎపి ఎస్‌బిసిఎల్ అండ్ ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీల దిగుమతి కూలి రేట్లు పెంపుదలకు సహకరించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, ఇతర రాష్ట్ర కమిటీ నాయకులు అధికారులతో మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో డిపోలకు సంబంధించి హమాలీ సంఘాలతో ముందుగా జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని, ఇప్పటికే పని చేస్తున్న పాత డిపో హమాలీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ.. ఎరియర్స్ చెల్లించే విధంగా యాజమాన్యాలకు సూచిస్తామని, హమాలీల డిమాండ్ల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. శాఖా పరంగా జిరో బ్యాలెన్స్ ఖాతాలను తెరిచి ప్రమాద బీమాతో పాటు ఆరోగ్య బీమా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వి సుబ్బారెడ్డి, ఎం మదన్ మోహన్, సంఘం ఉపాధ్యక్షులు ఎన్ ప్రసాదరావు, రాముడు, సుబ్బారాయుడు, మల్లికార్జున, సీతారాములు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామానికి ఏమైంది?

- 2 నెలల వ్యవధిలో ఏడుగురు మృతి
- భయం గుప్పిట్లో గ్రామస్తులు

ప్రజాశక్తి - గజపతినగరం

ఆ గ్రామానికి ఏమైందో ఏమో కానీ రెండు నెలల వ్యవధిలో ఏడుగురు మృతి చెందారు. దీంతో, ఏమైందో ఏమో అని భయంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమని జీవిస్తున్నారు. విజయనగరం జిల్లా గజపతినగరం మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని మరుపల్లి గ్రామంలో ఇదంతా జరుగుతోంది. రెండు నెలలుగా మరుపల్లిలో వరుస మరణాలు సంభవిస్తున్నాయి. గ్రామానికి చెందిన సారికి రాము (47) జ్వరం వచ్చిన రెండు రోజుల్లో ఆస్పత్రికి వెళ్లేసరికి ప్లేట్‌లెట్స్ పడిపోయి కొద్ది రోజులకే మరణించారు. మరికొన్ని రోజుల వ్యవధిలోనే అదే గ్రామానికి చెందిన కునుకు సత్యవతి (47) శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతూ ఆస్పత్రిలో చేరిన కొద్ది రోజులకే మరణించారు. అంతు చిక్కని కారణాలతో మామిడి సత్యవతి (41), రొంగలి లక్ష్మీనాయుడు (60), గెద్ద జయలక్ష్మి (43), పురుడు అప్పలస్వామి (70), గెద్ద పరదేశి (39) మృతిచెందారు. ఇందులో పరదేశి విశాఖపట్నంలోని బీచ్‌లో స్నానం చేస్తూ బయటకు వచ్చి శ్వాస సంబంధిత సమస్యతో మరణించాడు.


గ్రామంలో ఇంటింటి ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

వరుస మరణాల కారణంగా గ్రామంలో చిన్నా, పెద్ద అనే తేడా లేకుండా ఎవరిని పలకరించినా వారి ముఖాల్లో భయమే కనిపిస్తోంది. ఏదో కీడు కారణంగా వరుసగా మరణాలు సంభవిస్తున్నాయనే మూఢనమ్మకాల భయం గ్రామస్తులను వెంటాడుతోంది. గ్రామస్తుల్లో భయాన్ని పోగొట్టేలా పిహెచ్‌సి వైద్యాధికారులు సాయికృష్ణారెడ్డి, అనూజరాయ్.. గత రెండు రోజులుగా ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. రక్త పరీక్షలు నిర్వహించారు. జ్వరాల సర్వే చేపట్టారు. ఎలాంటి అనారోగ్య సమస్య ఉన్నా జల్లెడ పడుతూ వారికి ఆరోగ్య సూచనలతో పాటు మందులను అందజేస్తున్నారు. ఆది, సోమవారాల్లో నాలుగు బృందాలుగా 438 మందిని సర్వే చేశారు. సోమవారం మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలపై గ్రామంలో సర్వే చేయగా, నాలుగు వైరల్ జ్వరాలు నమోదయ్యాయి.

నెల రోజులుగా ప్రతిరోజూ వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వే చేపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇటీవలే తాము ఇచ్చిన సమాచారం మేరకు జిల్లా వైద్యాధికారి జీవనరాణి గ్రామంలో పర్యటించి పలు సూచనలు చేశారని తెలిపారు. గ్రామస్తులు ఎవరూ భయపడొద్దని సూచించారు.

సిపిఎస్ ఉద్యోగులకు డిఎ ఎరియర్స్ విడుదల

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న కొంతమంది ఉద్యోగులకు పాత కరువు భత్యం బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు చాలాకాలంలో కరువు భత్యం బకాయిలు పేరుకుపోయాయి.

దాదాపు ఐదు వందల మంది వరకు ఈ స్కీమ్ పరిధిలో సచివాలయంలో పనిచేస్తున్నారు. తమ బకాయిల చెల్లింపులపై వారు గతంలోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, తక్షణ చెల్లింపులు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ చెల్లింపులు లేకపోవడంతో కోర్టు ధిక్కరణ కింద వారు మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే సోమవారం వారికి బకాయి ఉన్న కరువు భత్యంలో కొంత చెల్లింపులు జరిగాయి.


అన్నదాతలపై వైసిపిది మొసలి కన్నీరు

- మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అన్నదాతలపై వైసిపిది మొసలి కన్నీరు అని గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారధి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వం 15 నెలల పాలనలో ప్రజాసంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని చెప్పారు. ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, వైసిపి తప్పుడు ప్రచారానికి తెరలేపిందని విమర్శించారు. ప్రజల్లో ఆందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం మాజీ సిఎం వైఎస్ జగన్ దిగజారుడు తనానికి నిదర్శమని విమర్శించారు. యూరియా కొరత అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు క్యూలో నిలబడాల్సిన పరిస్థితి తీసుకొచ్చింది వైసిపినే అని, దాదాపు 1,500 టన్నులు బ్లాక్ మార్కెట్‌లో అమ్మేశారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని వైసిపి కుట్ర చేస్తోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. మద్యం కుంభకోణం కేసులో బెయిల్‌పై విడుదలైన వారిని స్వాగతించడానికి అంత ఆర్భాటం చేస్తారా? అని ప్రశ్నించారు. మాజీ ఐఎఎస్ అధికారులు ధనంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డితో వైసిపికి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. విజయవాడ నగరంలో సెక్షన్ 30 అమల్లో ఉంటే వైసిపి కార్యకర్తలు గుమికూడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు.

మెడికల్ కాలేజీల స్థాపన, చేసిన వ్యయంపై బహిరంగ చర్చకు రావాలని టిడిపి కార్యాలయం కార్యదర్శి అశోక్ బాబు.. జగన్‌కు సవాల్ విసిరారు. చంద్రబాబు హయాంలోనే వైద్యరంగం అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.


మాట్లాడుతున్న షర్మిల

క్వింటాలు ఉల్లికి రూ.2400 ఇవ్వాలి

- ఉల్లి రైతులపై వెంటనే సిఎం దృష్టి పెట్టాలి
- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

క్వింటాలు ఉల్లికి రూ.2400 గిట్టుబాటు ధర వెంటనే ఇవ్వాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె కర్నూలు మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ ఉల్లి రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.80 వేల నుంచి 1.20 లక్షల వరకు పెట్టుబడి అవుతోందని, మార్కెట్‌లో క్వింటాలుకు రూ.600 కూడా ఇవ్వడం లేదన్నారు. ఉల్లికి మద్దతు ధర లేక ఇద్దరు రైతులు ఆత్మహత్యా హత్యాయత్నానికి పాల్పడితే వారిని వైసిపి రైతులని రాజకీయం పులిమి కేసులు పెట్టారని విమర్శించారు. ఉల్లి రైతుల మీద సిఎం దృష్టి పెట్టాలని కోరారు. రైతుల కోసం అవసరమైతే నిరాహార దీక్షకైనా సిద్ధమని తెలిపారు. తన కుమారుడు అవసరం వచ్చినప్పుడు రాజకీయాల్లోకి వస్తారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా షర్మిల చెప్పారు. షర్మిల వెంట మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు, తదితరులు ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ప్రజాశక్తి- ముప్పాళ్ల (పల్నాడు జిల్లా)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాదల గ్రామానికి చెందిన రైతు యర్రంశెట్టి కోటేశ్వరరావు (47) తన రెండెకరాల సొంత పొలంతో పాటు మరో 13 ఎకరాలు కౌలుకు తీసుకున్నారు. ఇందులో మిర్చి, పత్తి పంటలు సాగు చేసేవారు. ఆశించిన మేర ధరలు లేకపోవడంతో గతేడాది భారీగా నష్టపోయారు. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీతో కలిపి సుమారు రూ. 25 లక్షలు అప్పులయ్యాయి. అప్పులు తీరే దారిలేకపోవడంతో తన పశువుల పాకలో సోమవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏ చిన్న కష్టమొచ్చినా డోలీ మోతే

ప్రజాశక్తి- కొమరాడ

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న గిరిజనుల కష్టాలను పట్టించుకొనే నాధుడు కరువయ్యారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు మాట పక్కన పెడితే కనీసం గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సదుపాయాలు లేకపోవడంతో డోలీ మోతలు తప్పడం లేదు. ఏ చిన్న కష్టం వచ్చినా గిరిజనులు తమ గ్రామాల నుంచి ఆస్పత్రులకు రావాలంటే డోలీ మోతలే శరణ్యం అవుతున్నాయి.

కొమరాడ మండలం పాలెం పంచాయతీ కుస్తూరు గ్రామానికి చెందిన తాడంగి సురేష్ మూడు రోజులుగా జ్వరం బారిన పడి ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం రాత్రి బాగా జ్వరం రావడంతో పాటు కాళ్లు, చేతులు పొంగిపోవడంతో పరిస్థితి విషమించిందని కుటుంబ సభ్యులు గ్రహించి ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం సురేష్ సోదరులు చిన్నారావు, పెద్దమ్మ రాములమ్మ, పిన్ని పెంటమ్మతో పాటు ఆ గ్రామానికి చెందిన పలువురి సహకారంతో కుస్తూరు గ్రామం నుంచి కొండ దిగువ పూజారిగూడ గ్రామ సమీపానికి డోలీతో మోసుకొచ్చారు. అక్కడి నుండి ఆటో అద్దెకు తీసుకొని కురుపాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఐసిలో ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మొదటిరోజు జ్వరం వచ్చిన వెంటనే రహదారి సదుపాయం ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించేవారమని, ఆ సదుపాయం లేక తగ్గిపోతుందని మూడు రోజులు ఎదురు చూశామని కుటుంబ సభ్యులు చెప్పారు. గ్రామానికి రహదారి సదుపాయం లేకపోవడంతో వైద్యులు కూడా సక్రమంగా వచ్చి వైద్య సేవలందించే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి రహదారి సౌకర్యం కల్పించి ప్రజల ప్రాణాలు కాపాడాలని గిరిజనులు కోరుతున్నారు.


డోలీలో రోగిని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తెళ్ల రామయ్య

ఆక్వా రైతుల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

భారతదేశానికి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరుస్తున్న ఆక్వా రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం వల్ల రైతాంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నట్లు పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆక్వా రైతులు ఐక్యంగా ఉద్యమిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని రైతు సంఘం నేతలు అన్నారు. 'రొయ్యల ఎగుమతులపై అమెరికా ఆంక్షలు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత -ప్రత్యామ్నాయ మార్గాలు' అనే అంశంపై ఒంగోలు ఎల్‌బిజి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుందేరు రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తెళ్ళ రామయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు చొరవ చూపి గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గర్భిణులు, బాలలకు పౌష్టికాహారంగా సబ్సిడీ ధరలకు అందించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆక్వా రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 11న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రితో రాయబారం నడపనున్నట్లు తెలిపారు. 16, 17 తేదీల్లో కేంద్ర మంత్రితో చర్చించనున్నట్లు తెలిపారు. 11న విజయవాడకు ఆక్వా రైతులు తరలిరావాలని కోరారు. రామయ్య మాట్లాడుతూ... అమెరికా ఆంక్షల వల్ల రొయ్యల ఎగుమతి నిలిచిపోయిందని, కొనుగోలు లేక రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంతిబాబు, రొయ్యల రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో హింసా ప్రవృత్తిని ఉపేక్షించం

ప్రొఫెసర్‌పై దాడిని ఖండించిన లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో: నూజివీడు ఆర్‌జియుకెటి ప్రొఫెసర్ గోపాలరాజుపై విద్యార్థి వినయ్ పురుషోత్తం దాడిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు వినయ్‌ను ప్రాక్టికల్ పరీక్షలకు గోపాలరాజు అనుమతించలేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గురువులది కీలక స్థానమని, విద్యార్థి జీవితాన్ని పాడు చేయాలని ఏ అధ్యాపకుడు భావించరని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమి, హింసా ప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

అన్నామలైను కలిసిన లోకేష్

మంత్రి నారా లోకేష్ సోమవారం తమిళనాడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర బిజెపి నాయకులు అన్నామలైను కలిశారు. రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు.


ధర్నాలో నినదిస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసితుల ధర్నా

- సర్వీస్ రోడ్డు సదుపాయం కల్పించాలని ఆందోళన

ప్రజాశక్తి - చింతలపూడి (ఏలూరు)

తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి టు ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్ చేసిన మోసాలను నిరసిస్తూ ఏలూరు జిల్లా చింతలపూడి మండలం శెట్టివారిగూడెంలో రైతులు జాతీయ రహదారిపై సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... రెండు గ్రామాలు కలిపే రహదారిని, సుమారు 800 ఎకరాల్లోని పంట భూముల్లోకి వెళ్లేందుకు గ్రావెల్ మెటల్ రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన కెవిఎం సంస్థ మాట తప్పిందని, తక్షణం ఆ సంస్థ ప్రతినిధులు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్డు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమన్నారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, తమ పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల అండర్ పాస్‌లు తగినంత ఎత్తు, వెడల్పుతో నిర్మించకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల ప్రతి గ్రామ పరిధిలో సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు, భూసేకరణ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మారావు, ఆది జగన్మోహన్‌రావు, వేణు, అంజిబాబు తదితర రైతులు పాల్గొన్నారు.



టివిఎస్ నుంచి కొత్త ఎన్‌టార్క్ 150 విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టివిఎస్ మోటార్ భారత మార్కెట్లోకి తన కొత్త టివిఎస్ ఎన్‌టార్క్ 150 మోడల్‌ను విడుదల చేసింది. సోమవారం ఈ స్కూటర్‌ను టివిఎస్ గ్రూపు బ్రాండ్ మేనేజర్ రాజ్ బిస్వాస్, ఎపి, టిజి సేల్స్ జనరల్ మేనేజర్ కెంద్రజ్ జోషి, టిజి ఏరియా మేనేజర్ విశాల్ విక్రమ్ సింగ్ ఆవిష్కరించారు. ఈ స్కూటర్ కేవలం 6.3 సెకన్లలోనే 0-60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనుందని వారు తెలిపారు. ఎబిఎస్, ట్రాక్షన్ కంట్రోల్‌తో మెరుగైన భద్రత, నియంత్రణను కలిగి ఉంటుందని, సిగ్నేచర్ మల్టీ పాయింట్ ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, ఫ్రంట్ కాంబినేషన్ ల్యాంప్‌లు, కనెక్టెడ్ ఫీచర్లతో అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.1,19,000గా నిర్ణయించామని చెప్పారు. అయితే ఎంత మైలేజీ ఇచ్చేది ఆ కంపెనీ ప్రతినిధులు వెల్లడించలేదు.

లగ్జరీ కార్లు చౌక

జిఎస్‌టి తగ్గింపు ప్రభావం

న్యూఢిల్లీ : ధనవంతులు భారీగా లాభపడేలా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల్లో చేసిన మార్పులతో లగ్జరీ కార్ల ధరలు భారీగా తగ్గనున్నాయి. ఆడి, లెక్సస్, బిఎండబ్ల్యు, టొయాటా లాంటి లగ్జరీ కార్ల కంపెనీలు తమ కార్ల ధరలను సమీక్షించినట్లు వెల్లడించాయి. మరోవైపు జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్, కియా, హ్యుందాయ్, రెనాల్ట్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ కంపెనీలు ధరలను తగ్గించినట్లు.. జిఎస్‌టి ఫలాలను వినియోగదారులకు చేరవేస్తోన్నట్లు ప్రకటించాయి. కొత్త రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని తెలిపాయి.

ఆడి కార్లపై రూ.7.8 లక్షల వరకు తగ్గింపు

జర్మనీ లగ్జరీ కార్ల తయారీ సంస్థ ఆడి తమ కార్ల మోడళ్లను బట్టి రూ.2.6 లక్షల నుంచి రూ.7.8 లక్షల వరకు తగ్గింపు ఉంటుందని వెల్లడించింది. కొత్త ధరల ప్రకారం.. క్యూ3 ప్రారంభ ధరను రూ.46.13 లక్షల నుంచి రూ.43.07 లక్షలకు తగ్గించి టాప్‌ఎండ్ మోడల్ ఎస్‌యువి క్యూ8 ధరను రూ.1.18 కోట్ల నుంచి రూ.1.1 కోట్లకు తగ్గించింది.

లెక్సస్ ఇండియా కోత..

లగ్జరీ కార్ల కంపెనీ లెక్సస్ ఇండియా తమ మోడళ్లపై రూ.1.47 లక్షల నుంచి రూ.20.80 లక్షల వరకు తగ్గింపును అందిస్తున్నట్లు తెలిపింది. ఈ పండుగ సీజన్ ప్రారంభంలో వస్తున్న ఈ రేటు తగ్గింపు ప్రయోజనం... ఆనందాన్ని అందిస్తుందని ఆ కంపెనీ అధ్యక్షుడు హికారు ఇకేయుచి పేర్కొన్నారు.

ఇతర కంపెనీలు కూడా..

హ్యుందాయ్ కంపెనీ తన కార్లపై రూ.2.4 లక్షల మేర తగ్గించినట్లు పేర్కొంది. టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలపై రూ.4.65 లక్షల వరకు, టాటా కార్లపై రూ.1.55 లక్షల వరకు తగ్గింపును ప్రకటించింది. నిస్సాన్ మోటార్ ఇండియా రూ.1 లక్ష వరకు, ఎంఅండ్ఎం రూ.1.56 లక్షల వరకు, రెనాల్ట్ ఇండియా రూ.96,395 వరకు తగ్గింపు ఇస్తున్నట్లు వేరువేరుగా ప్రకటించాయి. ప్రీమియం కార్ల కంపెనీ టొయాటా తమ వాహనాలపై రూ.3.49 లక్షల వరకు కోత పెడుతున్నట్లు పేర్కొంది. లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు పలు మోడళ్లపై రూ.8.9 లక్షల వరకు తగ్గింపు ఇస్తున్నట్లు వెల్లడించింది. కియా ఇండియా తమ కార్లపై రూ.4.48 లక్షల వరకు, జెఎస్‌డబ్ల్యు మోటార్ ఇండియా తమ వివిధ వేరియంట్లపై రూ.54,000 నుంచి రూ.3.04 లక్షల మేర తగ్గిస్తున్నట్లు తెలిపింది.

సంపాదకీయం

అమానుషం!

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సహా విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోరుతూ శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన 'చలో విజయవాడ' ఆందోళనపై పోలీసుల దమనకాండ ప్రభుత్వ అసహనానికి ప్రతిరూపం. తమ గోడు వెళ్లబోసుకొనేందుకు ర్యాలీ, ధర్నా నిర్వహించిన విద్యార్థులు, విద్యాశాఖ మంత్రి చెంతకు శాంతియుతంగా కదలగా ఖాకీలు తమ క్రౌర్యం ప్రదర్శించారు. దొరికినవారిని దొరికినట్లు పిడిగుద్దులు గుద్దుతూ బలవంతంగా పోలీస్ వ్యాన్లలోకి విసిరేశారు. విద్యార్థినులని సైతం చూడకుండా దాడి చేసి చున్నీలు లాగుతూ రోడ్డుపై ఈడ్చిపారేసి కొందరైతే చున్నీలను మెడ చుట్టూ బిగించి దౌర్జన్యానికి ఒడిగట్టారు. పోలీసుల అమానుషానికి పదుల సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు సొమ్మసిల్లి పడిపోయారు. 200 మంది అక్రమ అరెస్ట్‌కు గురయ్యారు. ఒక విద్యార్థిని చెయ్యి విరిగింది. ఏడుగురు తీవ్రంగా గాయపడి ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థుల ఆందోళన ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందేమీ కాదు. అధికారంలోకి వచ్చేందుకు టిడిపి కూటమి విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఏడాదిన్నరైనా అమలు కాలేదు, అమలు చేయమని అడుగుతున్నారు. మండలాలు, జిల్లా స్థాయిల్లో ఆందోళనలు నిర్వహించి మొరపెట్టుకున్నా ప్రభుత్వంలో చలనం రాకపోవడంతో 'విజయవాడ చలో'కు ఉపక్రమించగా వారి మాట కనీసం ఆలకించకుండా నిర్బంధంతో గొంతు నొక్కడం ప్రభుత్వ కర్కశానికి నిదర్శనం. దీన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలి.

రెండు మూడేళ్లుగా ఉన్నత విద్య, వృత్తి విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్ల వరకు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయనందున ప్రైవేటు కాలేజీలు పిల్లలపైనా, వారి తల్లిదండ్రులపైనా తీవ్ర ఒత్తిడి చేస్తున్నాయి. సర్టిఫికెట్లు ఇవ్వకుండా బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతున్నాయి. హాల్ టిక్కెట్లు తొక్కిపట్టి పరీక్షలు రాయనీయకుండా అడ్డుకుంటున్నాయి. బకాయిలు విడుదల చేయాలని విద్యార్థులు కోరడం ప్రభుత్వం దృష్టిలో నేరమైపోయింది. సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న ఎస్‌టి, ఎస్‌సి, బిసి, పేద పిల్లలకు పెరిగిన ధరలకనుగుణంగా మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచమనడం పెద్ద దోషంగా కనిపించింది. శిథిలావస్థకు చేరిన హాస్టళ్ల దుస్థితిని మార్చమనడం ఘోరంగా తోచింది. ఎన్నికల హామీ మేరకు పి.జి. విద్యార్థులకు ఫీజురీయింబర్స్ అడగటం దుర్మార్గంగా కనిపించింది. ఈ సమస్యలను పరిష్కరించకుండా సామాజిక న్యాయం, సంక్షేమం, బడుగు బలహీన వర్గాల ఉద్ధరణ మాటల వల్లింపు ఆయా తరగతులను వంచించడమే.

రాష్ట్రాన్ని విజ్ఞానవంతంగా, నైపుణ్యవంతంగా తీర్చిదిద్దుతామని స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌లో టిడిపి కూటమి ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. కేంద్ర బిజెపి సర్కారు రుద్దిన నూతన విద్యా విధానాన్ని వైసిపి ప్రభుత్వం పుణికిపుచ్చుకున్నందున వేల స్కూళ్ల విలీనం మాటున మూతబడ్డాయి. కూటమి సర్కారు వాటిని తెరిపించలేదు సరికదా బిజెపి విధానాన్ని స్వాగతిస్తోంది. వేలాది ఏకోపాధ్యాయ స్కూళ్లు, కనీస వసతుల్లేని వేలాది బడులు కొనసాగుతున్నాయి. ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ స్కూళ్లల్లో గతేడాది కంటే మూడు లక్షల చేరికలు తగ్గాయి. నాలుగు వేల పైచిలుకు స్కూళ్లల్లో కొత్తగా ఒక్కరూ చేరలేదు. సర్కారీ స్కూళ్లల్లో 2021-22లో 45 లక్షల మంది ఉండగా ఇప్పుడా సంఖ్య 29 లక్షలకు తగ్గిపోయింది. ఇదే సమయంలో ప్రైవేటు స్కూళ్లల్లో 20 లక్షల నుంచి 38 లక్షలకు విద్యార్థులు పెరిగారు. ఈ ధోరణి ప్రైవేటు, కార్పొరేట్ పెరుగుదలను సూచిస్తుంది. అమ్మఒడి, తల్లికి వందనం, పిల్లలకు కిట్స్, మోడల్ స్కూల్స్... ఇవేవీ ప్రభుత్వ స్కూళ్లను నిలబెట్టలేకపోతున్నాయి. విద్యార్థుల డ్రాపవుట్స్‌ను కట్టడిచేయలేకపోతున్నాయి. 1998 డిఎస్‌సి క్వాలిఫై అభ్యర్థులు పోస్టింగ్‌లకై ఎదురు చూస్తున్నారు. 2023 బ్యాచ్ టీచర్లు ఒపిఎస్ కోసం పోరాడుతున్నారు. మెగా డిఎస్‌సి ప్రక్రియ అడుగడుగునా అనుమానాలతో సాగుతోంది. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు, యాప్‌ల గోల, ఒపిఎస్ అలాగే ఉన్నాయి. ఈ సమస్యలను ప్రభుత్వం నానబెట్టి అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలను ఆశించడం అత్యాసే కాగలదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సహా విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై తక్షణం స్పందించడం ప్రభుత్వ గురుతర బాధ్యత.

సందర్భం



పుట్టుక నీది.
చావు నీది.
బతుకంతా దేశానిది.
- కాళోజీ,
జననం: 9.9.1914
మరణం: 13.11.2002

ట్రంప్ సుంకాల ఉగ్రవాదం- గుణపాఠాలు

ప్రభాత్ పట్నాయక్

తన దేశీయ ఉత్పత్తిదారులను విదేశాల నుండి దిగుమతయ్యే సరుకుల తాకిడి నుండి కాపాడుకునే ఉద్దేశంతో ఏ దేశమైనా దిగుమతి సుంకాలను విధిస్తుందని మనకి ఆర్థికశాస్త్రం పాఠ్యపుస్తకాలు చెప్తాయి. డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల వెనుక అంతకన్నా పెద్ద లక్ష్యమే ఉంది. ఇతర దేశాలు తన చిత్తానికి లొంగి పడివుండేట్టు చేయడానికి అది ఒక సైనిక జోక్యం వంటి చర్య. లేదా అంతర్గత సైనిక తిరుగుబాటును ప్రోత్సహించే చర్య వంటిది. లేదా ఒక ఉగ్రవాద దాడి లాంటిది. ఉదాహరణకు, ఇప్పుడు భారతీయ దుస్తుల మీద 50 శాతం అదనపు సుంకాన్ని విధించడం అక్కడ అమెరికాలో ఉన్న వస్త్ర ఉత్పత్తిదారులను (అటువంటి వారెవరూ లేరక్కడ) రక్షించుకోవడం కోసం కాదు. కేవలం భారతదేశం ట్రంప్ చెప్పినట్టు పడి వుండేలా చేయడానికే.

అందువల్లే ట్రంప్ ప్రకటించిన సుంకాల పెంపులో అన్ని అవకతవకలు కనిపిస్తున్నాయి. ఇండియా మీద ట్రంప్ 50 శాతం సుంకాన్ని అదనంగా విధించడం అనేది మనం రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందువల్ల అని అంటున్నాడు. కాని మనకన్నా రష్యా నుండి ఇంధనాన్ని ఎక్కువగా కొనుగోలు చేస్తున్న దేశం చైనా. కాని ఆ చైనా మీద సుంకాల పెంపు 50 శాతం కన్నా తక్కువగానే ఉంది. ఏమిటి ఈ తేడాకి కారణం? ఇండియా మీద పెత్తనం చేయడం తేలిక అని, చైనాతో వ్యవహారం అంత తేలిక కాదని ట్రంప్ భావిస్తున్నాడు. అమెరికన్ ప్రయోజనాలను దెబ్బ తీసేలా చైనా ప్రతీకార చర్యలకు పూనుకోగలదు. ఉదాహరణకు చైనా తలుచుకుంటే, అమెరికాకు అరుదైన ఖనిజాల ఎగుమతులను వెంటనే నిలిపివేయగలదు. ఇంత వరకూ అటువంటి ప్రతీకార చర్యల గురించి మన దేశం మాత్రం ఏమీ మాట్లాడడం లేదు. కాని మనతోబాటు 50 శాతం సుంకాల పెంపును ఎదుర్కొంటున్న బ్రెజిల్ మాత్రం అమెరికా మీద ప్రతీకార చర్యలకు శ్రీకారం చుట్టింది.

బ్రెజిల్ సరుకుల మీద 50 శాతం సుంకాన్ని విధించడానికి ట్రంప్ చూపుతున్న కారణం మరీ వికారం తెప్పించేదిగా ఉంది. గతంలో బ్రెజిల్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించిన నయా ఫాసిస్టు జైర్ బోల్సనారో ఈ మారు ఎన్నికల్లో ఓడిపోయాడు. అతడి అధికార దుర్వినియోగం మీద ఇప్పటి ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. కాని బోల్సనారోను సగౌరవంగా, ఏ విచారణా లేకుండా విడిచిపెట్టేయాలని ట్రంప్ కోరుతున్నాడు. ఇది మరో దేశపు న్యాయ వ్యవస్థ పనితీరులో అవాంఛనీయమైన తీరులో జోక్యం చేసుకోవడమే. కాని ఆ కారణం వల్లే తాను 50 శాతం సుంకాన్ని అదనంగా బ్రెజిల్ మీద విధిస్తున్నట్టు ట్రంప్ ప్రకటించాడు. ఐతే ట్రంప్ పొగరుమోతుతనానికి ఇదొక్కటే కారణం కాదు. కేవలం బ్రెజిల్ మీద, ఇండియా మీద మాత్రమే 50 శాతం సుంకాన్ని అదనంగా విధించడం వెనుక మరో ప్రధాన కారణం ఉంది. అమెరికన్ సామ్రాజ్యవాదపు పెత్తనానికి వ్యతిరేకంగా మూడవ ప్రపంచ దేశాలు ఐక్యం కాకుండా చూసేందుకే ఆ మూడవ ప్రపంచ దేశాలలో రెండు అతి పెద్ద దేశాలైన బ్రెజిల్, ఇండియా లను ట్రంప్ భయపెట్టడానికి తయారయ్యాడు.

ఇలా సుంకాల విధింపును ఒక ఆయుధంగా ఉపయోగించడం అనేది సామ్రాజ్యవాదపు వినూత్నమైన ఎత్తుగడ. వలస పాలన నుండి బైట పడ్డ తర్వాత మూడవ ప్రపంచ దేశాలలో ఎక్కువ దేశాలు తమ తమ ఆర్థిక వ్యవస్థలను ప్రభుత్వ నియంత్రణ లో నిర్వహించాయి. స్వావలంబనను బలపరచడం, దేశీయ మార్కెట్‌ను విస్తరించడం, దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని, సాంకేతిక సామర్థ్యాన్ని పెంచుకోవడం కోసం ప్రభుత్వ రంగాన్ని ప్రధానంగా పెంపొందించడం వంటి చర్యలు చేపట్టాయి. ఈ ఆర్థిక వ్యూహాన్ని సామ్రాజ్యవాదం మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ ఆ వ్యూహాన్ని దెబ్బ తీయడానికి నిరంతరాయంగా పోరాడుతూనే వుంది. ఆ పోరాటంలో భాగంగా సాగించిన సైద్ధాంతిక ప్రచారం 'తూర్పు ఆసియా పులుల' పురోగతి గురించి హోరెత్తించింది. తూర్పు ఆసియాలోని హాంగ్‌కాంగ్, సింగపూర్, తైవాన్, దక్షిణ కొరియా దేశాలు నాలుగూ బ్రహ్మాండంగా అభివృద్ధి సాధించాయని సామ్రాజ్యవాదులు వాటిని ఆకాశానికెత్తారు. ఆ దేశాల పురోగతిని చూపించి తక్కిన మూడవ ప్రపంచ దేశాలన్నీ తమ 'ముడుచుకు పోయే' విధానాలకి స్వస్తి చెప్పి ఆసియా పులుల "చొచ్చుకుపోయే అభివృద్ధి వ్యూహం' చేపట్టాలని ప్రపంచబ్యాంక్ బాగా ప్రచారం చేసింది. అటువంటి వ్యూహాన్ని గనుక అనుసరిస్తే అన్ని దేశాలూ ఆ నాలుగు దేశాల మాదిరిగానే, అదే జిడిపి వృద్ధిరేటును, అదే ఎగుమతుల వృద్ధిరేటును సాధించగలుగుతాయంటూ జరిగిన ప్రచారంలో ఏ విధమైన నిజాయితీ మేథోపరంగా మనకి కనిపించదు.

> **గాజాలో ఏకంగా ఒక జాతినే నిర్మూలించే దుర్మార్గాన్ని బలపరచడానికి ఏ మాత్రమూ వెరపు లేని ఈ సామ్రాజ్యవాదం ఇండియా వంటి మూడవ ప్రపంచ దేశంలో ఒక కరువును సృష్టించడానికి ఎందుకు వెనకాడుతుంది? తాను ఆదేశించిన విధంగా నడుచుకోకపోతే ఆహార ధాన్యాలను పంపేది లేదన్న వైఖరి తీసుకుంటే చాలు, మన దేశంలో కరువు ఏర్పడి జనాలు ఆకలి చావుల బారిన పడతారు.**



> **వెనక్కి మళ్లడం అని అనుకోరాదు. ఆర్థిక వ్యవస్థమీద ప్రభుత్వ నియంత్రణ పాత కాలంలో లాగే ఇప్పుడు కూడా అవసరమే. ఐతే ఆర్థిక వ్యూహం మాత్రం ప్రధానంగా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసుకోవడం మీద దృష్టి పెట్టాలి. అంటే వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేయాలి (ఇది జరగాలంటే భూ సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి). శ్రామిక ప్రజల ఆదాయాలు పెరిగేలా ఆదాయాల అసమానతలను తగ్గించాలి. ప్రభుత్వం సంక్షేమ చర్యలకోసం కేటాయింపులు బాగా పెంచాలి.**

మొత్తంగా చూసినప్పుడు ప్రపంచ మార్కెట్ ఏ రేటున వృద్ధి చెందుతుందో, దానిని బట్టి అన్ని దేశాల ఎగుమతుల వృద్ధిరేటూ ఆధారపడి వుంటుంది. ప్రపంచ మార్కెట్ వృద్ధి పరిమితంగా ఉన్నప్పుడు కొన్ని దేశాల ఎగుమతుల్లో వృద్ధి కనిపించినా, ఆమేరకు తక్కిన దేశాల ఎగుమతులు తగ్గిపోతాయి. కాని ఈ వాదనను సామ్రాజ్యవాద పండితులు కొట్టిపారేశారు. ప్రపంచ మార్కెట్‌తో పోల్చినప్పుడు ప్రతీ మూడవ ప్రపంచ దేశమూ ఆసియా పులుల మాదిరిగానే చిన్న దేశమేనని, తాను ఎంత సాధ్యపడితే అంత ఎగుమతి చేసుకోగలుగుతుందని వారు దబాయించారు.

ఈ వాద ప్రతివాదాలు మొదట్లో సామ్రాజ్యవాదులకు అనుకూలంగా పరిణమించాయి. దానికి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది చైనా ఎగుమతుల్లో సాధించిన పురోగతి. వాస్తవానికి చైనా పూర్తిగా విభిన్నమైన సామాజిక-ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతూ, తనదైన ప్రత్యేకమైన అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. కాని ఆ సంగతిని పక్కనబెట్టి, చైనా కూడా తాము చెప్పిన 'చొచ్చుకుపోయే అభివృద్ధి వ్యూహం' తోటే విజయాలు సాధిస్తోందని సామ్రాజ్యవాదులు ప్రచారం చేసుకున్నారు. ఇక రెండవ కారణం: సామ్రాజ్యవాద దేశాలు తమ దేశాల్లోని పారిశ్రామిక కార్యకలాపాలను మూడవ ప్రపంచ దేశాలలోకి తరలించడానికి సిద్ధం కావడం. ఆ విధంగా తరలించడం వలన పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలకు, వెనుకబడిన దేశాలకు నడుమ ఉన్న అగాధం పూడుకు పోతుందని సామ్రాజ్యవాదం ప్రచారం చేసుకుంది. అంటే, తమ దేశాల నుండి పరిశ్రమలు బైటకు తరలిపోయిన ఫలితంగా ఆ సామ్రాజ్యవాద దేశాల్లో నిరుద్యోగం పెరుగుతూన్నా పట్టించుకోకుండా సామ్రాజ్యవాదులు చేతులు ముడుచుకుని కూర్చుంటారు అని మనమంతా భావించాలన్నమాట!

ఐతే ఎన్ని వాదనలు జరిగినా. అవన్నీ అంతిమంగా ప్రభుత్వాలు తమ దేశాల ఆర్థిక వ్యవస్థలను నియంత్రించకుండా విడిచిపెట్టాలన్న విధా నానికి అనుకూలం గా మొగ్గు చూపాయి. ఆ మూడవ ప్రపంచ దేశాలలోని పాలక బడా బూర్జువా వర్గ ప్రయోజ నాలను నెరవేర్చు కోడానికి పూనుకోవడమే ఈ మొగ్గు వెనుక ఉన్న భౌతిక కారణం. తాము ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి అవకాశాలు ఉన్నాయని ఆ వర్గాలు భావించాయి. దానితోబాటు తమ బిడ్డలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు తరలిపోయి అక్కడ స్థిరపడడం మొదలుపెట్టడంతో పట్టణాల్లోని ఉన్నత మధ్య తరగతి ప్రజలు కూడా ఈ వ్యూహానికి అనుకూలతను ప్రదర్శించారు. తమ ప్రయోజనాలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలతో ఎక్కువగా ముడిపడి వున్నాయని, దేశీయంగా ఉన్న రైతాంగంతోగాని, కార్మికులతోగాని తమకేమీ పని లేదని ఈ ఉన్నత మధ్య తరగతి ప్రజలు భావించసాగారు. ఈ లోపు చమురు రంగంలో హఠాత్తుగా ధరలు పెరిగి, దాని ఫలితంగా విదేశీ వ్యాపార చెల్లింపుల లోటు పెరిగి మూడవ ప్రపంచ దేశాల్లో సంక్షోభాలు తలెత్తాయి. ఈ సంక్షోభాలను ఉపయోగించుకుని ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్ అనేక మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక మంత్రిత్వ శాఖల్లో కీలక స్థానాల్లో తమ మనుషులు నియమితులయ్యేలా చూసుకున్నాయి. ముందు ఆఫ్రికన్ దేశాలతో మొదలుపెట్టి తర్వాత తక్కిన దేశాలలోనూ ఈ పథకాన్ని అమలు చేశాయి. ఆ విధంగా ప్రభుత్వ నియంత్రణలో నడిచే ఆర్థిక వ్యవస్థలను లోపలి నుంచే దెబ్బ తీయసాగాయి. ఇండియా వరకు ఈ పథకానికి లోబడకుండా వుండేందుకు చాలాకాలం పాటు ప్రయత్నించింది. కాని చివరికి 1991లో ఇండియా కూడా ఆ పథకానికే లోబడిపోయింది.

ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ ఇక్కడ వివరించడానికి ఇది సందర్భం కాదు. కాని ఒక విషయాన్ని మాత్రం ఇక్కడ చెప్పాలి. సంపన్న దేశాల మార్కెట్లమీద ఆధారపడేలా మూడవ ప్రపంచ దేశాల ఆర్థిక విధానాలను ప్రభావితం చేసి, "అందరికీ ఒకేలా వర్తించే నియమావళి" ఆధారంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నడవాలంటూ చాలా గొప్ప గొప్ప కబుర్లు చెప్తూ వచ్చారు సామ్రాజ్యవాదులు. కాని ఇప్పుడు తమ ఆదేశాలకు తలొగ్గకపోతే సుంకాలను పెంచుతాం అంటూ మూడవ ప్రపంచ దేశాల చేతులను మెలి తిప్పుతున్నారు. వాళ్ళు చెప్పే ఆదేశాలు అమలైతే దాని పర్యవసానాలు ఇక్కడ కోట్లాదిమంది నిస్సహాయులైన పేద రైతాంగం మీద, కార్మికులమీద, ముఖ్యంగా మహిళా కార్మికుల మీద పడి వాళ్ళ జీవితాలను దుర్భరం చేస్తాయి. వాళ్ళకు ఉపాధి లేకుండా చేస్తాయి. ఇప్పటికే ఇది పత్తి రైతుల విషయంలో మనం చూస్తున్నాం. మోడీ ప్రభుత్వం మన దేశానికి దిగుమతి అవుతున్న పత్తి మీద ఇంతవరకూ ఉన్న 11 శాతం సుంకాన్ని ఇటీవల రద్దు చేసింది. అక్కడ అమెరికాలో రైతులకు భారీగా ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి నుంచి వచ్చిపడే పత్తి వలన ఇక్కడ దేశీయ మార్కెట్ లో పత్తి రేటు బాగా పడిపోతోంది. రైతుల ఆత్మహత్యలు అనివార్యం అయే పరిస్థితి ఏర్పడింది. అంతేగాక మన వస్త్రాల మీద చాలా భారీగా 50 శాతం సుంకాన్ని విధించింది అమెరికా. దానితో ఇక్కడ గార్మెంట్ పరిశ్రమలలో పని చేస్తున్న కోట్లాదిమంది రోడ్డున పడే ప్రమాదం దాపురించింది. ట్రంప్ సుంకాల బెదిరింపుల పర్యవసానం ఇదే. గాజాలో సైనిక చర్యల ద్వారా పాలస్తీనా ప్రజలమీద సాగుతున్న ఉగ్రవాద దారుణాలు ఇతర చోట్ల కూడా జరగనున్నాయి. ఐతే అవి సైనిక చర్యల ద్వారా గాక, సుంకాల ఉగ్రవాద చర్యల ద్వారా జరగబోతున్నాయి. అలా కాకూడదంటే మూడవ ప్రపంచ దేశాలు అమెరికా ఆదేశాలకు తలొగ్గి వ్యవహరించాలి. తమ పాలన నుండి విముక్తి పొందిన పూర్వపు వలస దేశాలమీద సామ్రాజ్యవాదులు ఈ సుంకాల ఉగ్రవాద చర్యలతో పగ తీర్చుకుంటున్నారు.

ఈ అనుభవాల నుండి నేర్చుకోవలసిన పాఠాలు ఏమిటి? ప్రధానంగా దేశీయ మార్కెట్ మీద ఆధారపడుతూ, స్వావలంబనను అన్నివేళలా బలపరుచుకుంటూ, ప్రభుత్వ నియంత్రణలో ఆర్థిక వ్యూహం అమలు చేయడం అనేది వలస పాలన నుండి బైటపడ్డ ప్రతీ దేశానికీ అవశ్యం. ఇండియా కాని, మరికొన్ని మూడవ ప్రపంచ దేశాలు కాని స్వాతంత్ర్యం సాధించిన తొలి సంవత్సరాల్లో అనుసరించిన వ్యూహం ఇదే. అదే "ఎగుమతులతో ప్రపంచ మార్కెట్ లోకి విస్తరించే" వ్యూహాన్ని అమలు చేయడానికి పూనుకోవడం అంటే అది మూడవ ప్రపంచ దేశాలు సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలొగ్గి నడుచుకోవడానికే దారి తీస్తుంది. ఎందుకంటే, ప్రపంచ మార్కెట్ అనేది సామ్రాజ్యవాదుల మీద ప్రధానంగా ఆధారపడివుంది.

ఆహార ధాన్యాల విషయంలో మన దేశం సాధించిన స్వావలంబనకు నీళ్ళొదిలి, అమెరికా నుండి వచ్చే ఆహార ధాన్యాలమీద ఆధారపడి బతకవలసిన పరిస్థితిని మోడీ రైతు చట్టాలు తీసుకురాబోయాయి. కాని ఏడాదికి పైగా రైతులు సాగించిన గొప్ప పోరాటం ఈ దారుణం జరగకుండా అడ్డుకోగలిగింది. ఒకవేళ అమెరికా నుండి వచ్చే ఆహార ధాన్యాలమీద ఆధారపడ వలసిన పరిస్థితే గనుక ఏర్పడి వుంటే, మన దేశం మీద అమెరికా తన పెత్తనాన్ని మరింత ధాటిగా కొనసాగించేందుకు వీలు కలిగివుండేది. గాజాలో ఏకంగా ఒక జాతినే నిర్మూలించే దుర్మార్గాన్ని బలపరచడానికి ఏ మాత్రమూ వెరపు లేని ఈ సామ్రాజ్యవాదం ఇండియా వంటి మూడవ ప్రపంచ దేశంలో ఒక కరువును సృష్టించడానికి ఎందుకు వెనకాడుతుంది? తాను ఆదేశించిన విధంగా నడుచుకోకపోతే ఆహార ధాన్యాలను పంపేది లేదన్న వైఖరి తీసుకుంటే చాలు, మన దేశంలో కరువు ఏర్పడి జనాలు ఆకలి చావుల బారిన పడతారు.

అందుచేత ఇండియా వంటి దేశం తన అభివృద్ధి వ్యూహాన్ని మార్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. అంటే దీని అర్థం మళ్ళీ పాత విధానాలకు వెనక్కి మళ్ళడం అని అనుకోరాదు. ఆర్థిక వ్యవస్థమీద ప్రభుత్వ నియంత్రణ పాత కాలంలో లాగే ఇప్పుడు కూడా అవసరమే. ఐతే ఆర్థిక వ్యూహం మాత్రం ప్రధానంగా దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసుకోవడం మీద దృష్టి పెట్టాలి. అంటే వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేయాలి (ఇది జరగాలంటే భూ సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి). శ్రామిక ప్రజల ఆదాయాలు పెరిగేలా ఆదాయాల అసమానతలను తగ్గించాలి. ప్రభుత్వం సంక్షేమ చర్యలకోసం కేటాయింపులు బాగా పెంచాలి.

ఇప్పుడు మోడీ ప్రభుత్వం ఆగస్టు 15న ప్రకటించిన జిఎస్‌టి రాయితీలు ఈ కోవకే చెందుతాయి కదా అని కొందరు అనుకోవచ్చు. కాని అది పూర్తిగా అర్థం లేనిది. జిఎస్‌టి లో ప్రకటించిన రాయితీలు శ్రామిక ప్రజానీకానికి ఊరట కలిగించేవేమీ కాదు. పైగా ఈ రాయితీల కారణంగా ప్రభుత్వానికి తగ్గే ఆదాయాన్ని భర్తీ చేసుకోడానికి మోడీ సంపన్నుల మీద ఎటువంటి అదనపు పన్నులనూ ప్రతిపాదించలేదు (రెండు వారాల క్రితం నేను రాసిన వ్యాసంలో జిఎస్‌టి రాయితీలు జిడిపిలో 0.1 శాతం మాత్రమే అని పేర్కొన్నాను. కాని అవి 0.6 శాతం అని తేలింది. ఆ రాయితీల కారణంగా ప్రభుత్వం కోల్పోయే ఆదాయం 32,000 కోట్ల రూపాయలు అని పేర్కొన్నాను. కాని అది రూ.1,95,000 కోట్లు అని తేలింది.). ఇప్పుడు కావలసింది ఇటువంటి అతి స్వల్పమైన చర్యలు కావు. ప్రభుత్వం చేపట్టవలసిన ప్రత్యామ్నాయ అభివృద్ధి వ్యూహంలో సంక్షేమ చర్యలకు జిడిపిలో కనీసం 10 శాతం కేటాయించాలి.

దానితోబాటు, ట్రంప్ సుంకాల ఫలితంగా ఉపాధి కోల్పోనున్న కార్మికుల కడగండ్లను తీర్చడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలను చేపట్టాలి. సామ్రాజ్యవాదం ఇప్పుడు సుంకాల విధింపునే ఆయుధంగా వాడుతోంది కనుక కేవలం ఎగుమతి సబ్సిడీలు ఇస్తే సరిపోదు. అలా చేస్తే అప్పుడు ట్రంప్ సుంకాలను మరింత పెంచుతాడు. ఐనప్పటికీ, ఎగుమతి సబ్సిడీలను పెంచడం గురించి కూడా ఆలోచించవచ్చు. కాని దానితోబాటు వేరే ప్రత్యామ్నాయ మార్కెట్ల కోసం ప్రయత్నించడం అవసరం. అలాగే కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం కూడా పూనుకోవాలి.

ఐతే, ఈ దిశగా మోడీ ప్రభుత్వం ఏ చర్యలూ చేపట్టడం లేదు. పైగా ఏదో విధంగా అమెరికాను సంతృప్తి పరిచేందుకు సిద్ధపడుతోంది. ఎటువంటి సుంకమూ లేకుండా దేశంలోకి నూలు దుస్తులను దిగుమతి చేసుకోడానికి తలుపులు తెరుస్తోంది. దీని ఫలితంగా మన పత్తి రైతులు దారుణంగా నష్టపోతారు. అంతే కాదు, ఇప్పుడు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించి దారిద్ర్యంలో మగ్గుతున్న కోట్లాది మందికి ఊరట కల్పించాల్సి వుండగా దానికి బదులు ఆ పథకానికి కోతలు పెడుతోంది.

(స్వేచ్ఛానుసరణ)



పెరుగుతున్న మానసిక రుగ్మతలు



యం. అడివయ్య

> **పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగు పరచకుండా, ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను పరిష్కారం చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ గురించి ఎంత మాట్లాడినా ఉపయోగం ఉండదని పాలకులు గుర్తించాలి. టెలి మానస్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలుపై దృష్టి పెట్టడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. మానసిక అనారోగ్యాన్ని అధిగమించేందుకు ప్రజల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. తగినన్ని మానసిక చికిత్స ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటిలో సౌకర్యాలు మెరుగు పరచడం, శిక్షణ పొందిన నర్సులు, సోషల్ వర్కర్లు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, ఇతర ఆరోగ్య కార్యకర్తలను నియమించడానికి ప్రభుత్వం కృషి చేయాలి.**

ప్రపంచవ్యాప్తంగా చనిపోతున్న ప్రతి వంద మందిలో ఒకరు ఆత్మహత్య చేసుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ 'వరల్డ్ మెంటల్ హెల్త్ టుడే-మెంటల్ హెల్త్ అట్లాస్ 2024' నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మంది వివిధ మానసిక ఆరోగ్య రుగ్మతలతో జీవిస్తున్నారని తెలిపింది. ఆందోళన, ఒత్తిడి వంటివి ప్రజలను వెంటాడుతున్న మానసిక రుగ్మతలలో ప్రధానమైనవని కూడా గుర్తించింది. 2011-2021 మధ్య కాలంలో మానసిక రోగుల సంఖ్య ప్రపంచ జనాభా పెరుగుదల కంటే వేగంగా పెరిగింది.

మన దేశంలో మానసిక అనారోగ్యం కలిగిన ప్రతి లక్ష మందికి 13 మంది మాత్రమే ఆరోగ్య సిబ్బంది ఉన్నారు. 2024-25 ఆర్థిక సర్వే సైతం మానసిక ఆరోగ్య సంరక్షణపై ఆందోళన వ్యక్తం చేసింది. యువత మానసిక శ్రేయస్సు దేశ ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొ ంది. పని ప్రదేశంలో ఒత్తిడి, సోషల్ మీడియా వినియోగం పెరగడం, పెరుగుతున్న సామాజిక, ఆర్థిక ఒత్తిళ్ల వలన యువత మానసిక ఆరోగ్యంపై తగినంత శ్రద్ధ పెట్టడం లేదు.

మానసిక ఆరోగ్య సేవలపై కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నది. 2024-25 బడ్జెట్లో రూ.90,659 కోట్లు కేటాయిస్తే, 2025-26 బడ్జెట్లో రూ.99,859 కోట్లు కేటాయించింది. పైగా గత ఐదు సంవత్సరాలుగా మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం కేటాయిస్తున్న నిధులలో ఎక్కువ భాగం ఖర్చు కావడం లేదనే ఆరోపణలు వున్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కేటాయింపులు చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ ఎలా సాధ్యం? మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ వంటి సంస్థలకు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నది. మరోవైపు కేటాయించిన నిధులను విడుదల చేయడం లేదు. దేశవ్యాప్తంగా మానసిక ఆరోగ్యంపై టెలి కౌన్సిలింగ్ అందించడానికి 2022లో టెలి మానస్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2025 ఫిబ్రవరి నాటికి 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 53 సెంటర్ల ద్వారా టెలి కౌన్సిలింగ్ అందించారని అంచనా. వాస్తవానికి మానసిక అనారోగ్యం కలిగిన వారందరికీ టెలి మెడిసిన్ సేవలు చేరడంలో నిర్లక్ష్యం ఉంది. నిధుల కొరత వలన అనేక రాష్ట్రాల్లో టెలి కౌన్సిలింగ్ కార్యక్రమం ముందుకు సాగడం లేదు. 1982 నుండి జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలవుతున్నది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 767 జిల్లాల్లో అమలవుతున్నది. దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం ప్రధాన ఆటంకంగా ఉంది. భారతదేశంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు మానసిక ఆరోగ్య సంరక్షణ కీలకమైంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దీన్ దయాళ్ వికలాంగుల పునరావాస పథకం, వికలాంగుల హక్కుల అమలు పథకాలకు 2025-26 బడ్జెట్లో రూ.280 కోట్లు మాత్రమే కేటాయించారు. గత ఆరు సంవత్సరాల నుండి నిధుల కేటాయింపులు క్రమంగా తగ్గుతున్నాయి. దేశంలో యువత మానసిక ఆరోగ్యం, జీవనశైలి, సోషల్ మీడియా వినియోగం, మానసిక ఆరోగ్య సంరక్షణపై బహిరంగ కార్యక్రమాలను నిర్వహించడం యువతలో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కీలకమైన అంశమని ఆర్థిక సర్వే పేర్కొంది. కానీ కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ ఆరోగ్య మిషన్ వంటి కార్యక్రమాల అమలుకు ఆటంకం ఏర్పడుతున్నది. టెలిమానస్ కార్యక్రమం ద్వారానే మానసిక ఆరోగ్య సంరక్షణ సాధించడం ఆచరణలో సాధ్యం కాదు. 2017 మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టంలో పేర్కొన్న విధంగా అట్టడుగు ప్రజలకు వైద్య సేవలు అందించడం కీలకం. పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగు పరచకుండా, ఉద్యోగ భద్రత, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలను పరిష్కారం చేయకుండా మానసిక ఆరోగ్య సంరక్షణ గురించి ఎంత మాట్లాడినా ఉపయోగం ఉండదని పాలకులు గుర్తించాలి. టెలి మానస్, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం అమలుపై దృష్టి పెట్టడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. మానసిక అనారోగ్యాన్ని అధిగమించేందుకు ప్రజల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. తగినన్ని మానసిక చికిత్స ఆసుపత్రులు ఏర్పాటు చేయడం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాటిలో సౌకర్యాలు మెరుగు పరచడం, శిక్షణ పొందిన నర్సులు, సోషల్ వర్కర్లు, సైకియాట్రిస్టులు, సైకాలజిస్టులు, కౌన్సిలర్లు, ఇతర ఆరోగ్య కార్యకర్తలను నియమించడానికి ప్రభుత్వం కృషి చేయాలి. మానసిక ఆరోగ్య సంరక్షణ ప్రభుత్వ బాధ్యత.

/ వ్యాసకర్త ఎస్.పి.ఆర్.డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 94900 98713 /




పల్నాడు జిల్లా వినుకొండ-కారంపూడి ప్రధాన రహదారిపై బైఠాయించిన అన్నదాతలు


శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో రోడ్డుపై బైఠాయించిన రైతులు

యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

- వ్యవసాయ శాఖ మంత్రి సొంత జిల్లాలోనూ తీవ్ర సమస్య

ప్రజాశక్తి - కొత్తూరు (శ్రీకాకుళం జిల్లా), ఈపూరు (పల్నాడు జిల్లా)

యూరియా కోసం అన్నదాతలు రోడ్డెక్కారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, పల్నాడు జిల్లా ఈపూరులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. యూరియ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కొత్తూరులోగల ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులోని గ్రోమోర్ కేంద్రానికి రెండు రోజుల కిందట 700 యూరియా బస్తాలు వచ్చాయి. ఆ కేంద్రం నిర్వాహకులు ఆదివారం కొంతమంది రైతులకు యూరియాను విక్రయించారు. ఈ విషయం తెలుసుకున్న మండల కేంద్రంలోని రైతులతోపాటు పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని, సీతంపేట మండలాల నుంచి రైతులు ఈ కేంద్రానికి సోమవారం పెద్ద ఎత్తున చేరుకొని బారులుదీరారు. యూరియా బస్తాలు ఉండడంతో వాటిని దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు గ్రోమోర్ కేంద్రాన్ని మూసివేశారు. దీంతో. రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆ కేంద్రం ఎదురుగా రోడ్డుపై బైఠాయించారు. యూరియా ఇచ్చే వరకు ఇక్కడ్నుంచి కదిలి వెళ్లేది లేదని భీష్మించారు. తహశీల్దార్ కె.బాలకృష్ణ, ఎడి బి.రాజగోపాల్, ఎఒ ఎస్.స్వర్ణలత, సిఐ చింతాడ ప్రసాద్, ఎస్ఐ మహమ్మద్ అమీర్ అలీ అక్కడకు చేరుకొని రైతులతో మాట్లాడారు. 1-బి, ఆధార్ కార్డు ఆధారంగా ఒక యూరియా బస్తా చొప్పున ఇస్తామని నచ్చజెప్పడంతో రైతులు ఆందోళన విరమింపజేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రైతులకు స్లిప్పులు అందజేశారు. స్లిప్పులు ఇచ్చిన రైతులకు యూరియా పంపిణీ చేశారు.

పల్నాడు జిల్లా ఈపూరులోని సొసైటీ కార్యాలయం వద్ద శని వారం మధ్యాహ్నం వరకూ రైతులను అధికారులు నిరీక్షింపజేసినా యూరియా అందించలేదు. సోమవారం రావాలని వారిని వెనక్కు పంపించేశారు. దీంతో, తెల్లవారుజాము నుండే రైతులు ఆధార్ కార్డులు పట్టుకుని భారీగా సొసైటీ వద్దకు చేరుకున్నారు. వారి నుండి ఆధార్ కార్డులను సొసైటీ సిబ్బంది తీసుకున్నారు. అయినా, పంపిణీ చేయలేదు. యూరియా వచ్చినా ఐడి నంబర్ రాలేదని, ఇది వచ్చే వరకూ వేచి ఉండాలని సిబ్బంది చెప్పారు. తమకు వెంటనే యూరియా ఇవ్వాలని రైతులు కోరినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతోపాటు రైతుల ఆధార్ కార్డులను సిబ్బంది బయటకు విసిరేశారు. దీంతో, రైతులు ఆగ్రహంతో సొసైటీ ఎదుట రహదారిపై బైఠాయించారు. యూరియా కోసం మూడ్రోజులుగా తిరుగుతున్నా ఇవ్వడం లేదంటూ మహిళా రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆందోళనతో గంటలన్నరపాటు వాహనాలు భారీగా నిలిచిపోయాయి. పోలీసులు వచ్చి రైతులకు సర్ది చెప్పి ధర్నా విరమింపజేశారు. కొద్దిసేపటికి ఎడిఎ, ఎఒ పర్యవేక్షణలో ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా పంపిణీ చేశారు.

పవన్ సినిమా టికెట్ల ధరల పెంపుపై పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

సిఎం, మంత్రులుగా ఉన్న వాళ్లు సినిమాలో యాక్ట్ చేయకూడదని ఏమీ లేదని, ఎలాంటి నిషేధం లేదని రాష్ట్రం తరుపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టుకు తెలియజేశారు. హీరో, ముఖ్యమంత్రిగా చేస్తూ ఎన్‌టిఆర్ సినిమాల్లో నటించడాన్ని దాఖలైన కేసులో హైకోర్టు ఫుల్ బెంచ్ తీర్పు కూడా చెప్పిందన్నారు. ఈ నేపధ్యంలో పవన్‌కళ్యాణ్ నటించిన సినిమా టికెట్ ధరల పెంపుపై దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేయాలని కోరారు. కోర్టు సమయాన్ని వృధా చేసినందుకు పిటిషనర్‌కు జరిమానా విధించాలన్నారు. దీనిపై పిటిషనర్ అడ్వకేట్ బాల కల్పించుకుని ఎన్‌టిఆర్ సినిమాలో నటించడంపై హైకోర్టు తీర్పును పరిశీలన చేసి వాదనలు వినిపించేందుకు గడువు కావాలని కోరారు. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ వేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరగా అందుకు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి నిరాకరించారు. డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా, వాణిజ్య కార్యక్రమాల ప్రమోట్ చేసుకునేందుకు ప్రభుత్వ నిధులు, అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారంటూ రిటైర్డ్ ఐఎఎస్ అధికారి విజయ్ కుమార్ పిటిషన్ వేశారు. పిటిషనర్ రిప్లై వాదనల నిమిత్తం విచారణను ఈ నెల 15కు వాయిదా వేస్తూ న్యాయమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అక్టోబర్‌లో భారత్, ఖతార్ ఎఫ్‌టిఎ చర్చలు పూర్తి

న్యూఢిల్లీ : భారత్, ఖతార్ దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన చర్చలు అక్టోబర్ మొదటి వారంలో ముగియనున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ అక్టోబర్ 6న ఖతార్‌కు వెళ్లి చర్చలను ఖరారు చేయనున్నారని వెల్లడించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2024-25లో భారత్ ఖతార్‌కు 1.68 బిలియన్ డాలర్ల ఎగుమతి చేయగా, భారత్ 12.47 బిలియన్ దిగుమతులు చేసుకుంది.

మరో మూడేళ్ల తరువాత మా పరిస్థితి ఏమిటి?

- రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాజధాని అమరావతి రైతుల్లో ఆనందం వ్యక్తమైనా.. కాలం గడుస్తున్న కొద్దీ క్రమంగా వారిలో ఆందోళన పెరుగుతోంది. భూములిచ్చి ఇప్పటికి 11 ఏళ్ళు గడిచిపోయింది. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తయింది. పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఇప్పటికే అనేకసార్లు రాజధాని పూర్తి చేస్తామని చెబుతున్నారు. ఏడాదిన్నర గడిచినా ఇంకా మూడేళ్లంటున్నారేమిటనే అంశంపై రైతుల్లో చర్చ నడుస్తోంది. 2015 జనవరిలో పూలింగ్ మొదలైన తరువాత మూడేళ్లలో అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇస్తామని సిఆర్‌డిఎ నిబంధనల్లో పేర్కొన్నారు. అప్పటి నుండి అభివృద్ధి జరగాలంటే కనీసం ఆరేళ్లు పడుతుందని, అప్పటి వరకూ అంటే పదేళ్లపాటు రైతులకు కౌలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ప్లాను ఎప్పటికి అలస్యం అవడం, నిర్మాణాలు జాప్యంతో 2019 నాటికి ఎన్జీఓల భవనాలు, ఎఐఎస్ అధికారుల భవనాలు నిర్మించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వం వాటి జోలికి వెళ్లకపోవడంతో పదేళ్లపాటు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. మూడోసారి పదేళ్లపాటు కౌలు ఇస్తామని నిబంధన ముగిసింది. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అదనంగా మరో ఐదేళ్లు కౌలు చెల్లించేందుకు అంగీకరించింది. ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సమయంలో ఎల్పీ పరిస్థితులలో మూడేళ్లలో ప్లాట్లు అభివృద్ధి చేసి ఇస్తామని ప్రకటించింది. ల్యాండ్ పూలింగ్ స్కీము ప్లాట్ల అభివృద్ధికి 24 ప్రాజెక్టులకుగాను రూ.23,579 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. వీటిల్లో రూ.3,135 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులు పెండింగులో ఉన్నాయి. రూ.20,444 కోట్ల విలువైన 22 ప్రాజెక్టులకు అనుమతులొచ్చాయి. వీటిల్లోనూ రూ.19,444 కోట్ల విలువైన 19 పనులకు టెండర్లు పిలవడంతోపాటు పనులూ అప్పగించారు. అయినా ప్లాట్ల అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. జిలేబిల వర్గం పడటంతోపాటు పనులూ నడిచేందుకు వీలుగా లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతోపాటు మొత్తం జంగిల్ క్లియర్ చేసే ప్లాట్ల సర్వే చేపట్టి ఎల్‌పిఎస్ కాలనీలను గుర్తించి వాటికి అనుగుణంగా రోడ్ల పనులు మొదలుపెట్టాలంటే మరో ఆరునెలలు పడుతుంది. అన్ని పనులూ పూర్తయ్యే సరికి కనీసం రెండేళ్లకుపైనే పడుతుంది. అప్పటి నుండి ప్లాట్లలో నిర్మాణాలు చేపట్టడం లేదా, అక్కడ కంపెనీలు వచ్చి కార్యకలాపాలు పూర్తి చేసేందుకు మరో మూడేళ్లు అంటే కచ్చితంగా ఆరేళ్లు పడుతుంది. ఈలోపే రైతులకు కౌలు చెల్లింపు కూడా ఆగిపోతుంది. ఇప్పటికే ప్లాట్లు అప్పగించి ఉంటే వ్యాపార లావాదేవీలు, ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకునేవారిమని రైతులు చెబుతున్నారు. కౌలు కూడా ఆపిన తరువాత ప్లాట్లు అభివృద్ధి చేసుకోవడం సవాలుగానే మారుతుందనే ఆందోళన వారిలో కనబడుతోంది. దీనిపై రైతు నాయకులు కూడా అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభిస్తే తప్ప వచ్చే నాలుగుళ్లేలో తమ ప్లాట్లు చేతికి అందవని, వెంటనే పనులు ప్రారంభిస్తే కోలుకుంటామని, లేనిపక్షంలో తీవ్ర ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర జెరూసలేంలో బస్సుపై దాడి

- ఆరుగురు మృతి, 15మందికి గాయాలు

జెరూసలేం : ఉత్తర జెరూసలేంలో రద్దీగా వుండే జంక్షన్ వద్ద ఒక బస్సుపై సాయుధులు కాల్పులు జరపడంతో ఆరుగురు మరణించగా, 15మంది గాయపడ్డారని ఇజ్రాయిల్ పోలీసులు తెలిపారు. గాయపడిన 15మందిలో ఆరుగురి పరిస్థితి విషమంగా వుందని వైద్య సిబ్బంది తెలిపారు. దాడికి పాల్పడిన ఇద్దరిని వెంటనే అదుపులోకి తీసుకున్నామని పోలీసులు చెప్పారు. వారి పరిస్థితి ఏమిటన్న వివరాలు తెలియరాలేదు. సోషల్ మీడియాలో దాడి దృశ్యాలు చూస్తుంటే బస్టాప్ నుండి డజన్ల సంఖ్యలో ప్రజలు పరుగులు పెట్టడం కనిపిస్తోంది. ఉదయం పూట రద్దీగా వుండే సమయంలో ఈ దాడి జరిగింది. విరిగిపోయిన కిటికీ అద్దాలు చెల్లాచెదురుగా పడి దాడి జరిగిన ప్రాంతమంతా గందరగోళంగా వుంది. ప్రయాణికులు గాయాలతో ఆర్తనాదాలు చేస్తూ, కొంతమంది స్పృహ లేకుండా రోడ్లపై పడి వుండడంతో అక్కడ బీభత్స వాతావరణం నెలకొంది. ఈ దాడికి పాల్పడింది ఎవరనే దానిపై ఎలాంటి సమాచారం లేదు.

మానవ హక్కులపై అంతర్జాతీయ జోక్యం వద్దు

- వ్యతిరేకించిన శ్రీలంక

కొలంబో : దేశంలోని మానవ హక్కుల పరిస్థితులపై అంతర్జాతీయ జోక్యాన్ని శ్రీలంక వ్యతిరేకించింది. జెనీవాలో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్ఆర్‌సి) సమావేశంలో ఈ అంశం ప్రస్తావనకు రావడాన్ని వ్యతిరేకిస్తూ ఇలాంటి చర్యల వల్ల దేశంలో న్యాయం కోసం జరిగే ప్రయత్నాలకు విఘాతం కలుగుతుందని స్పష్టం చేసింది. సోమవారం ప్రారంభమైన మండలి 60వ సాధారణ సమావేశంలో శ్రీలంకతో పాటూ మయన్మార్, ఆఫ్ఘనిస్తాన్, సూడాన్, పాలస్తీనా, సిరియా సహా పలు దేశాల్లో జరిగిన మానవ హక్కుల సంఘటనలపై వార్తలు, ఇతర అప్‌డేట్‌లను సమీక్షించనున్నారు. ఇటువంటి విదేశీ జోక్యం వల్ల దేశీయంగా ప్రజలకు న్యాయం జరిగేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకం కలుగుతుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మండలి తన నివేదికలో పేర్కొన్న సంస్కరణలను అమలు చేయడానికి తమకు అవకాశం ఇవ్వాల్సిందిగా కౌన్సిల్‌కు విదేశాంగ మంత్రి విజిత హెరాత్ విజ్ఞప్తి చేశారు.

ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు

సిరాజ్ నామినేట్

దుబాయ్: హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ ఐసిసి ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. ఇంగ్లండ్ పర్యటనలో సిరాజ్ తన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా ఐదో టెస్ట్‌లో టీమిండియా గెలుపుకు దోహదపడ్డాడు. ఈ గెలుపుతో టీమిండియా ఐదు మ్యాచుల సిరీస్‌ను 2-2తో సమం చేసింది.

సిరాజ్‌తో పాటు, న్యూజిలాండ్‌కు చెందిన మాట్ హెన్రీ, వెస్టిండీస్‌కు చెందిన జాడెన్ సీల్స్ ఆగస్టు నెలకు గాను ఐసిసి ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు రేసులో ఉన్నారు. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 23 వికెట్లు పడగొట్టాడు. జూన్ చివరలో ప్రారంభమైన ఈ సిరీస్ ఆగస్టు ప్రారంభంలో ముగిసింది. ఆగస్టులో సిరాజ్ ఒకే ఒక మ్యాచ్ ఆడాడని, కానీ ఆ మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్ నామినేషన్ పొందేందుకు సరిపోతుందని ఐసిసి పేర్కొంది. ఇక జింబాబ్వేలో టెస్ట్ సిరీస్ విజయంలో అత్యుత్తమ ప్రదర్శనకు పడగొట్టాడు. హెన్రీ మొదటి టెస్ట్‌లో తొమ్మిది వికెట్లు, రెండవ టెస్ట్‌లో ఏడు వికెట్లు తీసి తన జట్టు 2-0తో గెలువడంలో కీలకపాత్ర పోషించాడు. సీల్స్ అద్భుతమైన ప్రదర్శన వెస్టిండీస్ 34ఏళ్ల తర్వాత వన్డే సిరీస్‌లో పాకిస్తాన్‌ను ఓడించడంలో సహాయపడింది. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో సీల్స్ పది వికెట్లు పడగొట్టాడు. చివరి మ్యాచ్‌లో అతను 18 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు. దాంతో పాకిస్తాన్ జట్టు 295 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో 92 పరుగులకే పరిమితమైంది.

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ,
భారత ప్రభుత్వం

జాతీయ యువజన అవార్డు 2024

తేది.ఆగస్టు 25, 2025న ప్రచురించబడిన ప్రకటనకు కొనసాగింపుగా, అవార్డు కోసం దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీని సెప్టెంబర్ 30, 2025 వరకు పొడిగించారు.
వెబ్‌సైట్: https://awards.gov.in/
ప్రకటనకు సంబంధించి అన్ని ఇతర వివరాల్లో మార్పులు లేవు.

cbc 47107/11/0010/2526

ఆరు అడుగుల జాగా కోసం

5 ఏళ్లుగా నిరీక్షణ..!

- బసంపల్లిలో దళితులు చనిపోతే స్మశానవాటిక కోసం అవస్థలు



స్మశానవాటిలో కాకుండా ఇతర సస్థలంలో నారాయణప్ప మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఆరడగుల జాగా కోసం 15 ఏళ్లుగా ఆ గ్రామ దళితులు ఎదురు చూస్తున్నారు. వారికి కేటాయించిన భూమిని మరొకరు కబ్జా చేయడంతో తమ వారికి అంత్యక్రియలు నిర్వహించుకునేందుకు కాసింత జాగా లేకుండా పోయింది. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన దళిత నారాయణప్ప ఆదివారం మృతి చెందారు. అంత్యక్రియలు నిర్వహించేందుకు గ్రామంలో జాగా లేదు. అంతకు మునుపు దళితులకు కేటాయించిన సర్వే నంబరు 17-1బిలో 1.39 ఎకరాల భూమిని శంకర నారాయణ అనే వ్యక్తి కబ్జా చేసి దానిమ్మ తోటను సాగు చేస్తున్నారు. ఆ భూమిలో అంత్యక్రియలు నిర్వహించడానికి వీల్లేదని అడ్డుకున్నారు. దీంతో తాము ఎక్కడ అంత్యక్రియలు నిర్వహించుకోవాలో తెలియక నారాయణప్ప మృతదేహాన్ని సోమవారం వరకు ఇంటి వద్దనే ఉంచారు. ఈ విషయం దళిత సంఘాలకు తెలియడంతో వారు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ధర్మవరం ఆర్‌డిఒ, డిఎస్‌పి, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. దళితులకు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి వేరొక చోట అంత్యక్రియలు పూర్తి చేయాలని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి కార్యక్రమాన్ని పూర్తి చేయించారు.

15 ఏళ్లుగా అదే సమస్య

2011 నుంచి ఈ సమస్య కొనసాగుతోంది. అప్పట్లో పొట్ల గంగన్న అనే వ్యక్తి చనిపోయారు. అంత్యక్రియలకు వెళ్తే ఈ భూమి తమదంటూ అడ్డుకోవడంతో మూడు రోజులపాటు అంత్యక్రియలు నిర్వహించలేదు. అధికారులు జోక్యం చేసుకుని అంత్యక్రియలను పూర్తి చేయించారు. గతేడాది అక్టోబర్‌లో మాల నరసింహులు అనే వ్యక్తి చనిపోయినప్పుడు మరలా ఇదే సమస్య పునరావృతమైంది. రెండు రోజులపాటు ఆందోళన చేస్తే అధికారులు వచ్చి స్మశాన వాటికలోనే అంత్యక్రియలు పూర్తి చేయించారు.

2011 ఖాళీ భూమి.. ఇప్పుడు దానిమ్మతోటగా మార్పు

దళితుల సమాధులను 2011లో తీసివేసి భూమిని ఆక్రమించుకుంటున్నారని దళిత సంఘాల ఆధ్వర్యంలో అప్పట్లో నిరసనలు చేపట్టారు. అది దళిత స్మశానవాటికనే అధికారులు కూడా స్పష్టం చేశారు. ఆ భూమిలో తరువాత శంకరనారాయణ అనే వ్యక్తి దానిమ్మతోటను సాగు చేశారు. మొక్కలు నాటే సమయంలోనూ అధికారులకు దళిత సంఘాల నాయకులు విన్నవించుకున్నా చర్యలు తీసుకోలేదు. ఆ తరువాత భూమిని ఆక్రమించుకున్న వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు.

వెంటనే చర్యలు తీసుకోవాలి : కెవిపిఎస్

దళిత స్మశాన వాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని, స్థల కేటాయింపులు జరపాలని కెవిపిఎస్ సత్యసాయి జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బసంపల్లి గ్రామంలో చనిపోయిన నారాయణప్ప కుటుంబాన్ని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రామయ్య, కార్యదర్శి ఎంవి.రమణ, ఉపాధ్యక్షులు రామాంజినేయులు పరామర్శించారు. అనంతరం దళిత స్మశాన వాటిక సమస్యను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి, జెఎసి నాయకులు సాకే హరి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని ధర్నా

ప్రజాశక్తి - మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురంలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మార్కాపురం సబ్‌కలెక్టరేట్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సిపిఎం మార్కాపురం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డికెఎం రఫి మాట్లాడుతూ మెడికల్ కళాశాలను పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు అప్పగించడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగితేనే పేద ప్రజలకు వైద్యం అందుతుందన్నారు. మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న మార్కాపురం సర్వజన ఆస్పత్రి వైద్యులను బదిలీ చేయడాన్ని తప్పుబట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు పి.రూబెన్, మల్లికార్జున, జి విక్టర్, ఏనుగుల సురేష్ కుమార్ పాల్గొన్నారు.

భారత ఫుట్‌బాల్ జట్టు సంచలనం

- ఒమన్‌పై గెలుపుతో మూడో స్థానం

న్యూఢిల్లీ: సిఎఎఫ్ఎ నేషన్స్ కప్-2025లో భారత ఫుట్‌బాల్ జట్టు సంచలనం సృష్టించింది. చరిత్రలో తొలిసారి తనకంటే మెరుగైన ర్యాంక్‌లో ఉన్న ఒమన్ జట్టును ఓడించింది. హిస్సార్ సెంట్రల్ స్టేడియంలో సోమవారం జరిగిన కాంస్య పతక హోరాహోరీ పోరులో భారతజట్టు 3-2 గోల్స్ తేడాతో ఒమన్‌పై సంచలన విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. ఆ అర్ధభాగంలో ఇరుజట్లకు పలుమార్లు గోల్ చేసే అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయాయి. ఈ క్రమంలో 56వ నిమిషంలో ఒమన్ తరఫున అల్‌కాబి కొట్టిన కార్నర్ షాట్‌ను అల్ అహ్మదీ భారత గోల్‌పోస్ట్‌లోకి పంపి ఒమన్‌ను 1-0 ఆధిక్యతలో నిలిపాడు. దీంతో 133వ ర్యాంక్‌లో ఉన్న భారతజట్టు ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై ఎదురుదాడులకు దిగింది. మరోవైపు భారత గోల్‌కీపర్ గుర్‌ప్రీత్ సింగ్ సంధు ఒమన్ ఆటగాళ్లు కొట్టిన మూడు నిర్ణయాత్మక గోల్ టార్గెట్స్‌ను అడ్డుకొన్నాడు. భారత్ తరపున లల్లింజుల్లా, రాహుల్ బేకె, జితిన్ ఎంఎస్ ఒక్కో గోల్ కొట్టారు. రెండో అర్ధభాగంలో ఒమన్ ఆటగాడు రెడ్‌కార్డుకు గురి కావడంతో 10మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. ఇది భారత్‌కు కలిసి రావడంతో భారతజట్టు మూడు గోల్స్ చేసింది. ముఖ్యంగా పెనాల్టీలను గోల్‌గా మలచడంలో భారత ఆటగాళ్లు సఫలమయ్యాయి. సిఎఎఫ్ఎ నేషన్స్ కప్-2025 ఫైనల్‌కు ఉజ్బెకిస్తాన్, తజకిస్తాన్ జట్టు చేరగా.. సెమీస్‌లో ఓడిన భారత్, ఒమన్ జట్ల మధ్య మూడో స్థానానికి తలపడ్డాయి. 2023 ఎడిషన్‌లో ఒమన్ జట్టు మూడోస్థానంలో నిలువగా.. ఈసారి భారతజట్టు మూడో స్థానంలో నిలిచిన సంచలనం సృష్టించింది. గ్రూప్-బిలో ఉన్న భారత్.. ఒక విజయం, ఒక ఓటమి, మరో డ్రాతో 2వ స్థానంలో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించగా... సెమీస్‌లో తజకిస్తాన్ చేతిలో 2-1గోల్స్‌తో ఓటమిపాలైంది.

ప్రయోగాత్మక అభ్యాసం పెంపొందించాలి

- ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలల్లో ప్రయోగాత్మక అభ్యాసం పెంపొందించాలని ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్ కార్యదర్శి వి ప్రసన్న వెంకటేష్.. ఉపాధ్యాయులకు సూచించారు. తాడేపల్లిలోని సంస్థ కార్యాలయంలో గురు పూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రేరణ కల్పిస్తూ, స్వీయ అభ్యాసానికి ప్రోత్సాహం ఇస్తూ ఉత్సుకతతో కూడిన బోధన చేయాలన్నారు. అన్ని సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో సైన్స్ క్లబ్, మ్యాథ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు టి రాంబాబు, కె శ్రీదేవి, పివి కరుణాకరరావు, ఎన్ ఫణి జ్యోతి, పి సుజాతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అదనపు కార్యదర్శి కె సునీల్ రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బెంగళూరు, పట్నా గెలుపు

- ప్రొ కబడ్డీ సీజన్-12

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్-12 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో సోమవారం జరిగిన లీగ్ పోటీల్లో బెంగళూరు బుల్స్, పట్నా పైరెట్స్ విజయాలను నమోదు చేసుకున్నాయి. బెంగళూరు జట్టు హర్యానా స్టీలర్స్‌ను, పట్నా పైరెట్స్, పుణేరి పల్టన్స్‌ను ఓడించాయి. బెంగళూరు-హర్యానా స్టీలర్స్ మధ్య జరిగిన తొలి కూత హోరాహోరీగా సాగింది. బుల్స్ ఆల్‌రౌండర్ అలీరేజా(12పాయింట్లు) సత్తా చాటగా.. రైడ్స్‌లో ఆశీశ్, డిఫెన్స్‌లో యోగేశ్ రాణించారు. ఇక హర్యానా జట్టులో శివమ్(7), మయాంక్(6)కి తోడు డిఫెండర్ జయసూరియన(5) మెరిసారు. ఇక పట్నా పైరెట్ జట్టు పుణేరిపై తొలినుంచే ఆధిక్యతను సంపాదించింది. చివరి 5నిమిషాల్లోనే పుణేరి జట్టు పుంజుకుంది. పట్నా రైడర్ అయాన్ ఏకంగా 21 పాయింట్లు సాధించి విజయంగా కీలక పాత్ర పోషించగా.. మరో రైడర్ మిలన్(5) ఫర్వాలేదనిపించాడు. ఈ ఓటమితో పుణేరి పల్టన్స్ టాప్‌నుంచి 2వ స్థానానికి పడిపోయింది. మరోవైపు పట్నా 9వ స్థానంలో, బెంగళూరు బుల్స్ 7వ స్థానానికి ఎగబాకాయి.

ప్రొ కబడ్డీలో నేడు...

దబాంగ్ ఢిల్లీ × బెంగాల్ వారియర్స్(రాత్రి 8.00గం॥లకు)
గుజరాత్ జెయింట్స్ × జైపూర్ పింక్ ప్యాంథర్స్(రాత్రి 9.00గం॥లకు)

రూ.400 కోట్ల విలువైన ఆలయ భూములపై టిడిపి నేతల కన్ను

- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోట్ల రూపాయల విలువైన ఆలయ భూములపై టిడిపి నేతల కన్ను పడిందని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్, గోల్ఫ్ క్లబ్ పేరుతో రూ.400 కోట్ల దేవాదాయ భూమిని కాజేసేందుకు విజయవాడ ఎంపి కేశినేని చిన్ని ఆధ్వర్యాన కుట్ర జరుగుతోందన్నారు. బందరులోని గొడుగుపేట వెంకటేశ్వరస్వామికి చెందిన భూమి విజయవాడ సమీపంలో ఉందని తెలిపారు. దీనిపై ఎంపి కన్ను పడిందని అన్నారు. వెంటనే ఎగ్జిబిషన్ సొసైటీ, గోల్ఫ్‌క్లబ్ పేరుతో కాజేసేందుకు కుట్ర పన్నారన్నారు. అనుకున్నదే తడవుగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా దేవాదాయశాఖకు లేఖ రాశారని అన్నారు. ఎంపి కన్నుసన్నల్లో ఆయన పనిచేస్తున్నట్లుందని విమర్శించారు. బిజెపి అధ్యక్షులు మాధవ్ ఎందుకు ప్రభుత్వాన్ని నిలదీయడం లేదని ప్రశ్నించారు. దేవాదాయశాఖకు కలెక్టరు లేఖ రాసిందే తడవుగా ఎటువంటి అనుమతులూ రాకుండానే కూటమి నేతలు చదునుచేసే పని మొదలుపెట్టారని విమర్శించారు.

అన్నదాత పోరు డైవర్షన్‌కే సూపర్ సిక్స్ విజయోత్సవం : ఎమ్మెల్సీ తూమాటి

ఎరువుల కోసం రైతులు గగ్గోలు పెడుతుంటే.. కూటమి విజయోత్సవం జరుపుతోందని వైసిపి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు పేర్కొన్నారు. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీలు ఒక్కటైనా అమలు చేశారా? ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

పాలనలో విఫలమైన ప్రభుత్వం : సుధాకర్‌బాబు

పాలనలో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజల్లో అవి చర్చకు రాకుండా తెరపైకి అక్రమ మద్యం కేసు తీసుకొస్తున్నారని మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు తెలిపారు. ఎంతమందిని అరెస్టు చేసినా పోరాటం ఆగదని అన్నారు. మద్యం కేసు చంద్రబాబు అల్లిన కట్టుకథ అన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) వారి కార్యాలయము, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

Ref: B1/60/2025 — **ఫారం నెం.VI (ఎ)** — **ది. 08-09-2025**

(2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్ (19), సబ్ రూల్(1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్‌లో చూపబడిన ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, జీలుగుమిల్లి గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద కూనవరం మండలం కొండ్రరాజుపేట గ్రామంలోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పున:స్థాపనల క్రింద వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు శ్రీ సబ్ కలెక్టర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్, ఏటపాక యూనిట్, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పున:స్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనల ననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందుమూలముగా నోటీసు జారీ చేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25-10-2005 ప్రకారం జారీ చేయబడినది. చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పున:స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10-05-2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం. 42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు. ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏవిధమైన అమ్మకం/ కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏవిధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది. పై చట్టంలో సెక్షన్-15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు/ ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి/ వ్యక్తులు ఈ ప్రకటనలు ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలక్టరు /ప్రత్యేక కలక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూలు

జిల్లా: ఏలూరు — మండలం: జీలుగుమిల్లి — గ్రామం: జీలుగుమిల్లి

వరుస సంఖ్య	సర్వే నెంబరు	భూమి తరగతి	మొత్తం విస్తీర్ణం	భూ సేకరణ విస్తీర్ణం	రైతుపేరు (తండ్రి/భర్తపేరు)	హద్దులు: తూర్పు	పడమర	ఉత్తరం	దక్షిణం	చెట్లు, నిర్మాణాలు మొదలైనవివిపైనా ఉంటే వాటివివరాలు.
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)
1	8-1భాగం	పుంజ	6.00	6.00	యాండ్రరాజేంద్రబాబు (తండ్రి) భూపతిరావు	8-2	8-1p	survy no 3	09 surveya no	పామాయిల్ప్లంట, కొబ్బరిచెట్లు, బోర్-1, డ్రిప్, షెడ్డు, సీతాఫలంచెట్లు, మామిడిచెట్లు, టేకుచెట్లు
2	8-2భాగం	పుంజ	4.50	4.50	యాండ్రసుందరి (భర్త) రాజేంద్రబాబు	236	8-1p	8-2p and 5 surveya no	8-2p	
3	17-1A1	పుంజ	1.02	1.02	అదిశ్రీలక్ష్మి భర్త. కృష్ణానందా రావు	17 p and 19 rs no	16	17 part	17 part And, rs no :19	ఖాళీభూమి
4	17-1B	పుంజ	1.00	1.00	మాగంటి బలరామకృష్ణ తండ్రి.నాగేశ్వరరావు	17 p and 19 rs no	16	17	17 part And, rs no :19	వరి పంట
5	17-3	పుంజ	0.96	0.96	అది రాధిక భర్త.రాఘువేంద్ర రావు	17 p and 19 rs no	16	17 part	17 part And, rs no :19	వరి పంట
6	17-6G	పుంజ	0.65	0.65	చప్పిడిశేషారత్నం భర్త.మహేశ్వరరావు	17 p and 19 rs no	17 P,16	17 part	17 part And, rs no 18	వరి పంట
7	17-6H	పుంజ	0.65	0.65	చప్పిడి హరికృష్ణ తండ్రి. మహేశ్వరరావు	17 p and 19 rs no	17 P,16	17 part	17 part And, rs no 18	వరి పొలం
8	17-6F	సర్కారు నంజ	1.00	1.00	బుగ్గల వెంకన్న తండ్రి.సుబ్బారావు	17 p and 19 rs no	17 P,16	17 part	17 part And, rs no 18	జాడు చేను
9	17-9	పుంజ	2.09	2.09	సోమరౌతురాధ భర్త. సాంభశివరావు	17 p and 19 rs no	17 P,16	17part	17 part And, rs no 18	వరిపొలం, వేపచెట్లు
10	19-2B	పుంజ	1.00	1.00		17 p and 19 rs no	17 P,16	17part	17 part And, rs no 18	
11	17-8	పుంజ	2.19	2.19	ముమ్ముడివీరకుమారి భర్త. వెంకటేశ్వరరావు	17 p and 19 rs no	17 P,16	17part	17 part And, rs no 18	వరిపొలం, వేపచెట్లు
12	19-2B	పుంజ	0.40	0.40		21	17	Telengana	20	
13	19-1	పుంజ	4.14	4.14	మాసేలక్ష్మి కుమారి భర్త.నాగేశ్వరరావు	21	17	Telengana	20	పామాయిల్తోట, డ్రిప్, బోర్-1,టేకు, మామిడిచెట్లు,
14	19-1	పుంజ	4.12	4.12	మాసే వెంకటేష్ తండ్రి.నాగేశ్వరరావు	21	19 part, 17	19 part, Telengana	19 part, 20	
15	19-2	పుంజ	4.94	4.94	అది శ్రీలక్ష్మి భర్త. కృష్ణానందా రావు	19-Part	17	19-part	20	పుచ్చపాదులు, బ్యారన్-1, రావిచెట్టు-1, కొబ్బరిచెట్లు, సీతాఫలంచెట్లు, తాడిచెట్లు, సిమెంట్స్తంభాలు, ఫెన్సింగ్
16	19-3	పుంజ	2.94	2.94	అదిరాధిక భర్త.రాఘువేంద్రరావు	19-Part	17	19-part	20	పుచ్చపాదులు, కొబ్బరిచెట్లు, సీతాఫలంచెట్లు, తాడిచెట్లు, గానుగచెట్లు, సిమెంట్స్తంభాలఫెన్సింగ్, వేపచెట్లు.
17	31-1B	పుంజ	3.17	3.17	చాట్రాతిలీలానాగప్రసాద్ తండ్రి. వెంకటరామారావు	96	31-1A	30	32	పామాయిల్మరియుకోకోతోట, కొబ్బరిచెట్లు, బోర్-1, షెడ్-1, డ్రిప్, నీటితొట్టె-1, గేట్1, సిమెంట్స్తంభాల ఫెన్సింగ్
18	31-2B	పుంజ	2.69	2.69		96	31-1A	31-1B,30	31-2B,32	
19	29-1A	పుంజ	2.50	2.50	చాట్రాతిసరోజినీ భర్త. లీలానాగప్రసాద్	22	27	29-part	31	
20	31-2A	పుంజ	1.25	1.25		22	31-1A	31-1B	31	
21	38-1B2	పుంజ	1.42	1.42	సోమవరపువేంకటేశ్వర రావు తండ్రి. వెంకట స్వామి	35	39	28	38-1	పొగాకుపంట, బోర్-1,వేప-1
22	38-1B1	పుంజ	1.00	1.00	చక్రపు జగదాంబ భర్త. వెంకటేశ్వరరావు	37	39	38-2	86	పొగాకు పంట
23	86-A	పుంజ	1.86	1.86	సోమవరపువేంకటేశ్వరరావు తండ్రి. వెంకటస్వామి	95	85	38	86p	పొగాకు పంట
24	86-A1	పుంజ	0.50	0.50	సోమవరపుమాణిక్యం తండ్రి. వెంకటస్వామి	95	85	38	86p	పొగాకుపంట
25	86-A2	పుంజ	0.50	0.50	సిరిసోల్లరామలక్ష్మి భర్త.సుబ్బారావు	95	85	38	87	పొగాకు పంట
26	86-1	పుంజ	0.25	0.25	సోమవరపు లక్ష్మి నాగ వీరవెంకట సత్యనారాయణ తండ్రి. వెంకటాచలం	95	85	86p	85	పొగాకు పంట
27	87-1	పుంజ	2.95	2.95	సోమవరపు పూర్ణ వీరవెంకట శ్రీనివాస్ తండ్రి. వెంకటాచలం	92	86	95	87p	పొగాకు పంట, తాడి-8, CCరోడ్డు
28	87-6A	పుంజ	1.00	1.00	ఉలవులవేంకటేశ్వరరావు తండ్రి. పుల్లయ్య	92	85	95	87p	ఖాళీస్థలం, తాడి-2
29	92-2	పుంజ	11.23	11.23	చిట్టిబొమ్మవెంకటేశ్వరరావు తండ్రి.వీరాస్వామి	91	87	95	90	పొగాకుపంట
30	92-3	పుంజ	0.13	0.13		87	92-2	92-1	90	
31	94	పుంజ	0.87	0.87		133	93	95	91	
32	117	పుంజ	9.02	9.02	కక్కిరాలవెంకటసుబ్బారావు (తండ్రి) కొమరేశ్వరరావు	forest	126	116	118	ఖాళీస్థలం
33	118-1	పుంజ	0.52	0.52		118-2	126	117	120	
34	118-1A	పుంజ	2.00	2.00		118-2	126	118-1P	120	
35	126	పుంజ	5.00	5.00	కక్కిరాలవెంకట సుబ్బయ్య	118	12 P And 130,129	128	120	ఖాళీస్థలం
36	126-4	పుంజ	1.50	1.50	కక్కిరాల రామదండు	118	12 P And 130,	128	126 part	ఖాళీ స్థలం
37	126-1b	పుంజ	1.50	1.50	కక్కిరాల పురుషోత్తము రావు (తండ్రి) భీమేశ్వరరావు	118	12 P And 130,	128	126 part	పొగాకు, తాడి-8
మొత్తంవిస్తీర్ణం			88.46	88.46						

సం/- **డి.చంద్రశేఖర్**
స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూ.సే), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-1, చింతూరు

సం/- **యస్.సరళావందనం,** భూసేకరణాధికారి మరియు స్పెషల్ కలెక్టరు (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

MANAPPURAM HOME FINANCE LTD.

మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్
CIN: U65923K12010PIC039179, యూనిట్ నెం.301-315, మూడవ అంతస్తు, ఎ వింగ్, కనకియా వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400093

డిమాండ్ నోటీసు

ఏదైతే, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, మా రిజిస్టర్డు ఆఫీసు: 4/470ఏ (పాతది) డబ్ల్యు/368ఏ (కొత్తది), మణప్పురం హౌస్, వలపాడ్, త్రిస్సూర్, కేరళ-680567 కలిగియుండి మరియు ఇండియాలోని వివిధ ప్రదేశాలలో శాఖలు (ఇకపై "MAHOFIN"గా పేర్కొనబడును) అనేది కంపెనీల చట్టం, 1956 క్రింద నమోదైన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్(ఇకపై చట్టంగా సూచిస్తారు)లోని సెక్షన్ 2 యొక్క ఉప-సెక్షన్ 1 యొక్క క్లాజు(4) అర్థంలోపు ఫైనాన్సియల్ ఇన్‌స్టిట్యూషన్‌గా నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ.3466 (ఇ), తేదీ.18 డిసెంబర్, 2015తో చదవగల భారత ప్రభుత్వం, ఆర్థికసేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, నిర్మాణం మరియు /లేదా నివాస యూనిట్ల కొనుగోలు కోసం అడ్వాన్సింగ్ లోన్ల వ్యాపారాన్ని కొనసాగించడం మరియు దిగువ కాలమ్ నెం.2లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత /సహ-రుణగ్రహీతలు పేర్కొన్న చార్ట్ MAHOFIN నుండి రుణం పొందింది మరియు అయితే SARFAESI, చట్టం కింద రుణదాత, మరియు పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(2) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించడం ద్వారా సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట) రూల్స్ 2002లోని రూల్ 2తో చదవగల, దిగువ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలను నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు తదుపరి వడ్డీతో నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీచేయబడినది కానీ వివిధ కారణాల వలన వారిలో కొందరికి నోటీసులు అందజేయబడలేదు. దానితో పాటుక్రింద పేర్కొనబడిన రుణగ్రహీతల సమాచారం ప్రయోజనాల కోసం, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతోంది.

క్ర. సం	రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత పేరు/ లాన్/ బ్రాంచ్	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ	ఎన్‌పిఏ తేది	నోటీసు పంపిన తేదీ & బాకీపడిన మొత్తం
1	పండిపాటి వాణి, పండిపాటి ప్రసాద్ బాబు /MHL00310015 596/ విజయవాడ	కృష్ణా జిల్లా, వుయ్యూరు సబ్ రిజిస్ట్రీ, తోట్లవల్లూరు మండలం, కుమ్మమూరు గ్రామపంచాయతీ ప్రాంతం, ఆర్ఎస్ నెం.21/2, డోర్ నెం.3-19, అసిస్ట్ నెం.413, ఆంధ్రప్రదేశ్-521165, విస్తీర్ణం 158చ.గ.లు. తూర్పు: వల్లూరు ప్రసాద రావు ఆస్తి, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం: గురివిందపల్లి కమలా రత్నం ఆస్తి, ఉత్తరం: కొడాలి మల్లి ఆస్తి మరియు పంచాయతీ రోడ్డు.	17-08-2025	18-08-2024 & RS.426532/-
2	ప్రత్తిపాటి దివేనా, ప్రత్తిపాటి దావీదు / MHL0031003 4849/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్టర్, జి. కొండూరు మండలం, వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధి, వెంకటాపురం గ్రామం, ఆర్.ఎస్. నెం.150-2ఏ, డోర్ నెం. 2-143, అసిస్ట్ నెం.339, విస్తీర్ణం 96.8 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్: 521229, తూర్పు:ప్రత్తిపాటి రామారావు ఆస్తి, పడమర: రోడ్డు, దక్షిణం: ప్రత్తిపాటి సురేష్ బాబు ఆస్తి, ఉత్తరం: రోడ్డు	15-08-2025	18-08-2025 & RS.427124/-
3	పాతపాటి అనురాధ, పాతపాటి వెంకటేశ్వర / MHL00310026093/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ, మైలవరం సబ్ రిజిస్ట్రీ, జి.కొండూరు మండలం, వెల్లటూరు గ్రామ పంచాయతీ ప్రాంతం, వెల్లటూరు గ్రామం, ఆర్ఎస్ నెం.332, డోర్ నెం.7-9, అసిస్ట్ నెం. 781, విస్తీర్ణం 185.5 చ.గ.లు, ఆంధ్ర ప్రదేశ్, పిన్ కోడ్: 521229. తూర్పు: పంచాయితీ రోడ్డు, పడమర: పాలపర్ల పరిశుద్దరావు ఆస్తి, దక్షిణం: నిమ్మగడ్డ లాజరు ఆస్తి, ఉత్తరం: పాతపాటి మరియన్న ఆస్తి	15-08-2025	18-08-2025 & RS.533204/-
4	బైర్ల చెన్నయ్య, బైర్ల బేబీ, మైలమల పవన్ / O90COLONS00000 5008619/విజయవాడ	ఆర్‌సిఎస్ నెం.229లోని ఆర్‌సిసి రూఫ్ బిల్డింగ్‌తో 152 చ.గ.లవిస్తీర్ణపు స్థలం,అసిస్ట్ నెం.499, డోర్ నెం. 6-6/ఏ, రుద్రవరం గ్రామ పంచాయతీ, రెడ్డిగూడెం మండలం, మైలవరం సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521226. తూర్పు:బయ్యర్ల యోహాన్ సైట్, పడమర: పంచాయతీ రోడ్డు, దక్షిణం:బయ్యర్ల యోహాన్ సైట్, ఉత్తరం: మేడిపల్లి వారయ్య సైట్.	15-08-2025	18-08-2025 & RS.625994/-
5	వాడిత్య నందిని, వాడిత్య చంటి/ MHL0031002 8857/విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, విస్సన్న పేట సబ్‌రిజిస్ట్రీ, విస్సన్నపేట్ మండలం, వేమిరెడ్డి పల్లి గ్రామ పంచాయతీ ప్రాంతం, వేమిరెడ్డి పల్లి గ్రామం, ఆర్ఎస్ నెం.196/8,డోర్‌నెం.4-108, అసిస్ట్ నెం.708, విస్తీర్ణం 338.8 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521215. తూర్పు: అజమీర భాస్కరరావు ఇల్లు మరియు స్థలం, పడమర: బాణవతు నాగేశ్వరరావు ఇల్లు మరియు స్థలం, దక్షిణం: పంచాయతీ రోడ్డు, ఉత్తరం: దర్మసోతు శ్రీను ఆస్తి.	15-08-2025	18-08-2025 & RS.641183/-
6	తిరివీధి పుష్పలీల, తిరివీధి సాల్మన్రాజు/ MHL00310021702/ విజయవాడ	కృష్ణా జిల్లా, విజయవాడ తూర్పు జిల్లా రిజిస్ట్రీ, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, గన్నవరం గ్రామ పంచాయతీ ప్రాంతం, గన్నవరం గ్రామం, ఆర్ఎస్ నెం.417, డోర్ నెం.15-47, అసిస్ట్ నెం.4597, విస్తీర్ణం మొత్తం విస్తీర్ణంలో 236.62 చ.గ.లలో దక్షిణ వైపున 79.07 చ.గ.లు, ఆంధ్రప్రదేశ్, పిన్ కోడ్: 521101. తూర్పు: 4 అడుగుల వెడల్పు ఉమ్మడి మార్గం, పడమర: తిరివీధి ముని సైట్, దక్షిణం: పంచాయత్ రోడ్, ఉత్తరం: తిరివీధి కుమార్ బాబు ఆస్తి	15-08-2025	18-08-2025 & RS.685438/-
7	నంద్రు పాపారావు, ముల్లంగి స్పందన ప్రియ, మాదుగుల రాంబాబు / NHL00310029325/ విజయవాడ	ఎన్టీఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ, వీరులపాడు మండలం, పొన్నవరం గ్రామ పంచాయతీ పరిధి, పొన్నవరం గ్రామం, ఆర్.ఎస్. నెం.50, డోర్ నెం.3-98, అసిస్టెంట్ నెం.300, ఆంధ్రప్రదేశ్-521180లోని 96.8 చదరపు గజాల విస్తీర్ణం, తూర్పు: గంధం అహరోను ఇల్లు, పడమర: పంచాయతీ సిమెంట్ రోడ్డు, దక్షిణం: పంచాయతీ సిమెంట్ రోడ్డు, ఉత్తరం: ఈమన అప్పారావు ఇల్లు	15-08-2025	18-08-2025 & RS.874993/-
8	నక్కబోయిన దుర్గా, నక్కబోయిన నాగయ్య, నక్కబోయిన వినోద్ కుమార్ /MLAP0031005416/ విజయవాడ	కృష్ణా జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, జి.కొండూరు మండలం, పినపాక గ్రామ పంచాయతీ ప్రాంతం, పినపాక గ్రామం, ఆర్.ఎస్.నెం.53/3ఎ, డోర్ నెం.1-80, అసిస్టెంట్ నెం.80, విస్తీర్ణం 149 చగ...ల నివాస స్థలం ఆర్‌సిసి రూఫ్ డాబా, పి.ఓ. పినపాక, కృష్ణ, ఆంధ్ర ప్రదేశ్, పిన్: 521228. తూర్పు: పంచాయితీ రోడ్డు, పడమర: నక్కబోయిన రామారావు ఆస్తి, దక్షిణం: పజ్జూరు జమలయ్య ఆస్తి, ఉత్తరం: నక్కబోయిన జమలయ్య ఆస్తి, ఉత్తరం: నక్కబోనయ్య రామారావు & నక్కొబోయిన శివ దరిగంగాధర రావు ఉమ్మడి దారి.	16-08-2025	18-08-2025 & RS.349220/-
9	దేవరపల్లి జానకి, దేవరపల్లి బాబు / MLAP0031006100/ విజయవాడ	కృష్ణా జిల్లా, గన్నవరం, సబ్ రిజిస్ట్రీ, ఉంగుటూరు మండలం, ఆత్కూరు గ్రామ పంచాయతీ, ఆత్కూరు గ్రామం, ఆర్ఎస్ నెం.630/1, డోర్ నెం.7-146, విస్తీర్ణం 242 చ.గ.ల విస్తీర్ణపు ఆర్‌సిసి దాబాతో కూడిన నివాస స్థలం, ఆంధ్రప్రదేశ్, పిన్: 521286. తూర్పు: పాల్ ఆస్తి, పడమర: దేవరపల్లి సునీల్ ఆస్తి, దక్షిణం: ముల్పూరి జెర్మియా ఆస్తి, ఉత్తరం: 3 గజాల వెడల్పు సొంత మార్గం.	16-08-2025	18-08-2025 & RS.458390/-
10	గొల్లపల్లి నిర్మల, గొల్లపల్లి సందీప్ / MHL00310 009223/ విజయవాడ	కృష్ణా జిల్లా, గుడివాడ సబ్‌రిజిస్ట్రీ, గుడివాడ మున్సిపాలిటీ ఏరియా, నాగవరప్పాడు గ్రామం, ఆర్ఎస్ నెం.48/3, డోర్ నెం.1-435-ఎ, విస్తీర్ణం 96.8 చదరపు గజాల నివాస స్థలం, ఏసిసి షీట్ షెడ్, ఆంధ్రప్రదేశ్, పిన్ 521301. తూర్పు: మున్సిపల్ రోడ్, పడమర: మున్సిపల్ రోడ్, దక్షిణం: దొండపాటి సుబ్బారావు ఆస్తి, ఉత్తరం: దొండపాటి మనోహర్ ఆస్తి	16-08-2025	18-08-2025 & RS.509994/-
11	బెల్లంకొండ సూరమ్మ, బెల్లం కొండ కోటేశ్వర రావు/ MLAP0031004806/ విజయవాడ	ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రీ మైలవరం సబ్ రిజిస్ట్రీ మైలవరం మండలం, మైలవరం గ్రామం, పంచాయతీ ప్రాంతం, మైలవరం గ్రామం, ఆర్ఎస్ నెం.166-1, డోర్ నెం.8-69, అసిస్ట్ నెం.1752, విస్తీర్ణం 312 చ.గ.ల వాస స్థలంతో కూడిన ఏసిసి షీట్ షెడ్, ఆంధ్రప్రదేశ్, పిన్ 521230. తూర్పు: పంచాయితీ రోడ్, పడమర: వలిపి వెంకటేశ్వరరావు స్థలం, దక్షిణం: బెల్లంకొండ జమలయ్య స్థలం, ఉత్తరం: దేరంగుల స్థలం గంగయ్య.	16-08-2025	18-08-2025 & RS.605919/-

కాబట్టి, పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు సంబంధిత రుణగ్రహీత / సహ-రుణగ్రహీతకు ఎదురుగా పేర్కొన్న ఇక్కడ చూపిన మొత్తం బకాయిమొత్తాన్ని చెల్లించవలసిందిగా వారిని కోరడమైనది. సంబంధిత రుణగ్రహీత/సహ-రుణగ్రహీత తదుపరి వడ్డీతో పాటు మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ కోసం 13(4)ని తీసుకోవలసి ఉంటుంది. చట్టం మరియు ఇక్కడ రూపొందించిన నియమాల క్రింద సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు సేవ కోసం తీసుకోబడింది. పబ్లిక్ వేలం లేదా ప్రైవేట్ ఒప్పందం ద్వారా బదిలీ కోసం నోటీసును ప్రచురించే తేదీకి ముందు ఏ సమయంలోనైనా MAHOFIN ద్వారా అయ్యే ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖా రీడీమ్ చేయబడుతుందని మీరు గమనించాలి. విక్రయం, SARFAESI చట్టంలోని సెక్షన్ 13(8)లో వివరించబడింది.
SARFAESI చట్టంలోని సెక్షన్-13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డు ఆస్తులను అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలో అయినా బదిలీ చేయకుండా మరియు/లేదా వ్యవహరించకుండా నిరోధించబడ్డారని గుర్తుంచుకోండి.

తేది: 09-09-2025, ప్రదేశం: విజయవాడ — సం/- అధీకృత అధికారి, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

లాంచనప్రాయ స్వాధీనతా ప్రకటన

ICICI Home Finance

రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051.
కార్పొరేట్ ఆఫీసు: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంధేరి-కుర్ల రోడ్, అంధేరి ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి ఆఫీసు: సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డోర్ నం.5-37-155, 4/15, బ్రోడీపేట్, గుంటూరు, ఆం.ప్ర-522002

ఏదైతే,
క్రింది సంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలును, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **లాంఛనప్రాయంగా స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్‌కు చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్స్ విడిపించుకొనుటకు, అందుబాటులో గల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీత శ్రద్ధ వహించబడుచున్నది.

క్ర. సం.	రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	పులివర్తి ప్రేమ్ బాబు (రుణగ్రహీత), పులివర్తి ఝాన్సి (సహ-రుణగ్రహీత), LHGTR00001387912	వాయిల్‌వేరు గ్రామపంచాయతి, చుండూరు మండలం, గుంటూరు, ఆం.ప్ర-522211 వద్దదల ఎక.0.09సెంట్లు లేదా 95చ.గ.లు లేదా 79.42చ.మీ.ల విస్తీర్ణపు ఓపెన్ సైటు కొరకు డివిజన్ నం.1-12/9, డోర్ నం.4-243 యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: 18అ.ల ఉమ్మడి దారి, పడమర: యు. సుబ్బారెడ్డి ఆస్తి 18అ.లు, ఉత్తరం: డి-షెడ్యూలు ఆస్తి 47.06', దక్షిణం: బి-షెడ్యూలు ఆస్తిలో 1వ ఐటెం. స్వాధీనతా తేది: 05 సెప్టెంబర్-2025.	25-06-2025 Rs. 9,52,923/-	గుంటూరు
2.	ముకర యేసుపాదం (రుణగ్రహీత), ముకర రామకృష్ణ (సహ-రుణగ్రహీత), LHGTR00001407101	అంగల కూదూరు, తెనాలి, పంచాయతి ఆఫీసు దగ్గర, గుంటూరు, ఆం.ప్ర-522213 వద్దగల ఎక.0.19సెంట్లు లేదా 919.6చ.గ.లకుగాను 183.26చ.గ.లు లేదా 153.22చ.మీ.ల విస్తీర్ణంతో ప్లాట్ నం.3, డివిజన్ నం.285-4 యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: తూర్పు: బడుగు బాల కోటయ్యకు చెందిన ఆస్తి-33.0అ.లు, పడమర: 15అ.ల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నం.4 యొక్క ప్రహరీ, దక్షిణం: ముకర వీరయ్య యొక్క ప్లాట్ నం.2 యొక్క సరిహద్దు/ స్వాధీనతా తేది: 05 సెప్టెంబర్ 2025.	25-06-2025 Rs. 10,36,819/-	గుంటూరు

పై పేర్కొనబడిన రుణగ్రహీతలు/ హామీదారులును బకాయి పడిన మొత్తాలను 30 రోజుల్లోగా, తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది, లేని పిమ్మట తాకట్టుపెట్టబడిన ఆస్తులను సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన వెంటనే విక్రయించబడుతాయి.

తేది: సెప్టెంబర్ 09, 2025 ప్రదేశం: గుంటూరు. — అధీకృత అధికారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్



కుటుంబ సభ్యులతో బాధితుడు

ముస్లిం వీధి వ్యాపారిపై కత్తులతో దాడి

- జై శ్రీరామ్ నినాదాలు చేయలేదంటూ బెంగాల్‌లో హింస

పునిసోల్ (పశ్చిమబెంగాల్) : ఒక 60 ఏళ్ల ముస్లిం వీధి వ్యాపారిపై పశ్చిమ బెంగాల్‌లోని బంకురా జిల్లాలో కొందరు హిందూ మతతత్వ గూండాలు కత్తితో దాడి చేశారు. జైశ్రీరామ్ అని నినాదాలు చేయాలంటూ దుర్భాషలాడారు. రద్దీగా ఉండే రహదారిపై పట్టపగలు ఈ దాడి జరుగుతున్నా ఎవరూ జోక్యం చేసుకోలేదు. జిల్లాలోని ఓండా పోలీస్ స్టేషన్ పరిధిలోని కంటకలో బెనర్జీ డయాగ్నస్టిక్ సెంటర్‌కు సమీపంలో ఈ దాడి జరిగింది. బాధితుడ్ని జిల్లాలోని పునిసోల్ గ్రామానికి చెందిన మైమూర్ అలీ మండల్‌గా గుర్తించారు. వీధి వ్యాపారి అయిన మండల్ తన వస్తువులతో సైకిల్ మీద వస్తుండగా ఎదురుగా వస్తున్న ఒక ఇ రిక్షా అతన్ని ఢీకొంది. రిక్షాలో ఉన్న వ్యక్తులు కిందకు దిగి డబ్బులు డిమాండ్ చేశారు. అతను నిరాకరించడంతో జైశ్రీరామ్ అని నినాదాలు చేయాలని ఆదేశించారు. రక్తం కారుతూ మండల్ కిందకు పడిపోయాడు. చికిత్స కోసం సమీపంలోని బంకురా వైద్య కళాశాల, ఆసుపత్రికి వెళితే మండల్‌ను చంపేస్తామని బెదిరించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో ఆసుపత్రికి వెళ్లాడు. చికిత్స చేయించుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల్‌పై దాడితో అతని కుటుంబం భయంతో వణికిపోతోంది. తమ కుటుంబానికి మండలే జీవనాధారమని, అతను ఇప్పుడు ఏ పనీ చేయలేడని, తాము ఎలా బతకాలని ఆయన భార్య హసిపున్ బీబీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దాడి మతపరమైనది కాదని బంకురా జిల్లా ఎసిపి సిద్ధార్థ్ దోర్జి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



జిఎస్‌టి ప్రయోజనాలను వినియోగదారులకు చేర్చాల్సిందే

- మంత్రి పియూష్ గోయల్

న్యూఢిల్లీ : వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) తగ్గింపు ప్రయోజనాలను తప్పనిసరిగా వినియోగదారులకు చేర్చాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఇపిసి ఇండియా ప్లాటినం జూబ్లీ వేడుకలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఐటి మంత్రి జితిన్ ప్రసాద, మంత్రి పియూష్ గోయల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పియూష్ మాట్లాడుతూ.. జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు పరిశ్రమలు, వాణిజ్యాన్ని బలోపేతం చేస్తుందని అన్నారు. జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు చాలా విస్తృతమైందని అభివర్ణించారు. సరళీకరణ, రేటు తగ్గింపులతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత ముందుకు సాగుతుందన్నారు. కొత్త ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ప్రజలు ఎక్కువ ఖర్చు చేస్తారని, జిఎస్‌టి రేటు తగ్గింపుల ప్రయోజనాలు వినియోగదారులకు చేరేలా చూడాలన్నారు. జిఎస్‌టి శ్లాబులను 5 శాతం, 18 శాతానికి కుదించిన విషయం తెలిసిందే.

12వ గుర్తింపు పత్రంగా ఆధార్‌ను ఆమోదించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చట్టంలోని నిబంధన ప్రకారం ఆధార్‌ను నివాస పత్రంగా పేర్కొన్నారని జస్టిస్ బాగ్చి తెలిపారు. జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు మినహా ఇసి పేర్కొన్న 11 పత్రాల జాబితాలోని ఇతర డాక్యుమెంట్లు పౌరసత్వ పత్రాలు కాదని చెప్పారు. అందువల్ల ఆధార్‌ను 12వ పత్రంగా గుర్తించాల్సిందేనని బెంచ్ స్పష్టం చేస్తోందన్నారు

టారిఫ్‌లతో జిడిపికి ప్రమాదమే

- వృద్ధి 0.6 శాతం వరకు తగ్గొచ్చు
- దీర్ఘకాలం కొనసాగితే మరింత కష్టమే
- సిఇఎ అనంత నాగేశ్వరన్ వెల్లడి



న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత్‌పై విధించిన అధిక టారిఫ్‌లు దేశ వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నాయని ప్రభుత్వ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ట్రంప్ టారిఫ్‌లు దేశ జిడిపిని 0.5 శాతం ఉంచి 0.6 శాతం వరకు తగ్గించవచ్చని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి అనంత నాగేశ్వరన్ అన్నారు. ఈ అదనపు టారిఫ్‌లు తాత్కాలికమైనవి అని భావిస్తున్నానని చెప్పారు. సోమవారం బ్లూమ్‌బర్గ్ టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో నాగేశ్వరన్ మాట్లాడుతూ.. ఈ టారిఫ్‌లు ఎంతకాలం కొనసాగుతాయనే దానిపై ఆధారపడి జిడిపిలో మార్పులు ఉండొచ్చన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జిడిపిపై 0.5 శాతం నుంచి 0.6 శాతం వరకు ప్రభావం పడొచ్చన్నారు.

తదుపరి ఆర్థిక సంవత్సరంలోనూ ఈ టారిఫ్‌ల అనిశ్చితి కొనసాగితే ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుందని నాగేశ్వరన్ హెచ్చరించారు. భారత్‌కు తీవ్ర ప్రమాదంగా మారవచ్చని అన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును సాకుగా చూపి భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాలను విధిస్తున్న విషయం తెలిసిందే. ఈ టారిఫ్‌లతో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి పోటీదారులతోనూ భారత ఉత్పత్తులు పోటీ పడలేని పరిస్థితి నెలకొంది.

గడిచిన జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జిడిపి 7.8 శాతం వృద్ధిని సాధించిన నేపథ్యంలో 2025-26లో జిడిపి 6.3-6.8 శాతంగా ఉండొచ్చని నాగేశ్వరన్ అంచనా వేశారు. ఇది గతేడాది కంటే ఎక్కువ వృద్ధి అన్నారు. జిడిపి శ్లాబుల్లో కోతలు, ఎనిమిదేళ్లలో అత్యల్ప ద్రవ్యోల్బణం వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థకు సానుకూల అంశాలుగా ఉన్నాయన్నారు. ఇవి ప్రజల ఆదాయాల మెరుగుదలకు మద్దతును ఇవ్వడంతో పాటుగా ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతాయన్నారు. రోజువారీ వినియోగ వస్తువులపై జిఎస్‌టి రేట్లను తగ్గించడం ద్వారా డిమాండ్‌ను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు జిడిపిని 0.2 శాతం నుంచి 0.3 శాతం మేర పెంచవచ్చన్నారు.

పరీక్షల వ్యవస్థనే నాశనం చేస్తున్నారు

- ఒకరికి బదులు మరొకరు సిటిఇటి రాయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : పబ్లిక్ ఎగ్జామ్స్‌లో ఒకరికి బదులుగా మరొకరు పరీక్ష రాయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వ్యక్తులు మొత్తం పబ్లిక్ ఎగ్జామ్స్ వ్యవస్థనే నాశనం చేస్తున్నారని వ్యాఖ్యానించింది. వీరివల్ల మిగిలిన అనేకమంది అభ్యర్థులు బాధపడుతున్నారని తెలిపింది. 2003లో వచ్చిన బాలీవుడ్ సూపర్‌హిట్ చిత్రం 'మున్నాభాయ్ ఎంబిబిఎస్'ను ప్రస్తావిస్తూ... ఆ చిత్రంలో మున్నాభాయ్ తరపున మరొకరు పరీక్ష రాస్తారని, అలాంటి 'మున్నాభాయ్ లోపలే ఉండాలి' అని పేర్కొంది. గతేడాది డిసెంబరు 15న ఉత్తరప్రదేశ్‌లోని ఒక పాఠశాలలో నిర్వహించిన సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటి టెస్టు (సిటిఇటి)లో ఒక అభ్యర్థికి బదులుగా మరొక వ్యక్తి పరీక్ష రాసాడని కేసు నమోదైంది. అభ్యర్థి సందీప్ సింగ్ పటేల్ స్థానంలో మరొక వ్యక్తి నకిలీ అడ్మిట్ కార్డు ఉపయోగించి పరీక్షకు హాజరైనట్లు పాఠశాల అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో సందీప్ సింగ్‌కు బెయిల్ ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు నిరాకరించింది. దీంతో సందీప్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం పిటిషనర్ సందీప్‌నే చివాట్లు పెట్టింది. ఈ పిటిషన్‌పై స్పందన కోరుతూ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. విచారణను నాలుగు వారాల తరువాతకు వాయిదా వేసింది.

ఉగ్రవాద కుట్ర కేసు

22 ప్రాంతాల్లో ఎన్‌ఐఎ సోదాలు

న్యూఢిల్లీ : ఉగ్రవాద కుట్రకు సంబంధించిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) సోమవారం 22 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకాశ్మీర్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో ఈ సోదాలు జరిపింది. సోమవారం ఉదయం ప్రారంభమైన ఈ సోదాలు రాత్రి వరకూ కూడా కొనసాగాయి. జమ్మూకాశ్మీర్‌లోని బారాముల్లా, కుల్గాం, అనంత్‌నాగ్, పుల్వామా జిల్లాలో ఈ సోదాలు జరిగినట్లు ఎన్‌ఐఎ అధికారులు తెలిపారు. ఈ సోదాలు గురించి మరిన్ని వివరాలు వెల్లడించడానికి నిరాకరించారు.

జమ్ముకాశ్మీర్‌లో ఆప్ ఎమ్మెల్యే అరెస్టు

- పిఎస్‌ఎ పేరుతో ఈడ్చుకెళ్లి వ్యాన్‌లో ఎక్కించిన పోలీసులు
- ఖండించిన రాజకీయ పార్టీలు



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లో ఏకైక ఆప్ ఎమ్మెల్యే మెహ్రాజ్- ఉద్- దిన్ మాలిక్‌ను ప్రజా భద్రతా చట్టం (పిఎస్‌ఎ) కింద పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడం చర్చనీయాంశమైంది. మాలిక్‌ను పోలీసులు ఈడ్చుకుంటూ తీసుకెళ్లి వ్యాన్‌లో బంధిస్తున్న వీడియో వైరల్‌గా మారింది. మాలిక్ గత ఏడాది జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో దోడా తూర్పు నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఆయన ఆప్ జమ్ముకాశ్మీర్ యూనిట్ అధ్యక్షుడుగా ఉన్నారు. శాంతిభద్రతలకు మాలిక్ తీవ్ర ముప్పుగా ఉన్నందు వల్లే పిఎస్‌ఎ కింద కేసు నమోదు చేసినట్లు జమ్మూకాశ్మీర్ స్పీకర్‌కు పంపిన లేఖలో దోడా డిప్యూటీ పోలీస్ కమిషనర్ హర్విందర్ సింగ్ పేర్కొన్నారు. 2019 తరువాత పిఎస్‌ఎ కింద ప్రజా ప్రతినిధి అరెస్టు చేయడం ఇదే మొదటిసారి. ఆర్టికల్ 370ను రద్దు చేయడానికి ముందు ఫరూక్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ వంటి మాజీ ముఖ్యమంత్రులతో పాటు, కొంత మంది ఎమ్మెల్యేలను, న్యాయవాదులను, వ్యాపారవేత్తలను పిఎస్‌ఎ కింద అరెస్టు చేసి, నెలల తరబడి జైల్లో నిర్బంధించారు. థాత్రి బ్లాక్‌లోని కెంచా గ్రామంలో మెడికల్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు దోడా పోలీసులు మాలిక్, మరో ఐదుగురు వ్యక్తులపై బిఎన్‌ఎస్ సెక్షన్లు 221 (ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం), 329(3) (నేరపూరిత ప్రవర్తన), 351(2) (నేరపూరిత బెదిరింపు), 305(ఇ) (దొంగతనం) కింద కేసు నమోదు చేశారు. ఈ నెల 5 నుంచి కెంచా గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఒక భవనం నుంచి మరొక భవనంలోకి మార్చడంపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలోనే ఈ అరెస్టు జరిగింది. మాలిక్ అరెస్టును అధికార నేషనల్ కాన్ఫరెన్స్‌తో పాటు పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి), పీపుల్స్ కాన్ఫరెన్స్, ఇతరులు ఖండించారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ చైర్మన్ సజాద్ లోన్ మాట్లాడుతూ జమ్మూకాశ్మీర్ ప్రజాస్వామ్య వ్యవస్థపై మరో దాడి అని విమర్శించారు. అసమ్మతిని అణచివేయడానికి ఇటువంటి క్రూరమైన చట్టాలను ఆయుధాలుగా ఉపయోగిస్తున్నారని పిడిపి ఎమ్మెల్యే వహీద్ పారా అన్నారు. ఎన్‌సి ఎమ్మెల్యే సల్మాన్ అలీ సాగర్ ఈ అరెస్టును ప్రజాస్వామ్యాన్ని అణచివేయడమేనని విమర్శించారు.

అర్జెంటీనా ప్రాంతీయ ఎన్నికల్లో వామపక్ష పార్టీ గెలుపు

- అధికార పార్టీకి భారీ ఓటమి
- జాతీయ ఎన్నికలపై ప్రభావం



బూనస్ ఎయిర్స్ ప్రావిన్స్ ఎన్నికల్లో విజయం సాధించిన వామపక్ష పెరోనిస్టు పార్టీ కార్యకర్తల ఆనందం

బూనస్ ఎయిర్స్ : అర్జెంటీనా ప్రాంతీయ ఎన్నికల్లో వామపక్ష పెరోనిస్టు పార్టీ గెలుపొందింది. దేశ రాజధాని బూనస్ ఎయిర్స్ ప్రావిన్స్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధికార పార్టీ భారీ తేడాతో ఓడిపోయింది. ఈ ఫలితాలు వచ్చే నెల జరగనున్న శాసనసభ ఎన్నికలపై ప్రభావం పడుతుందని ఆ పార్టీ శ్రేణులు కలవరపడుతున్నాయి.. ప్రస్తుత అధ్యక్షుడు జేవియర్ మిలేయి పార్టీకి (లా లిబర్టాడ్ అవాన్జా) బూనస్ ఎయిర్స్ ప్రావిన్స్ ఎన్నికల్లో 34% ఓట్లు మాత్రమే వచ్చాయి. మాజీ అధ్యక్షురాలు క్రిస్టినా ఫెర్నాండెజ్ నేతృత్వంలోని వామపక్ష పెరోనిస్ట్ ప్రతిపక్ష పార్టీకి 47% ఓట్లు వచ్చాయి. దీంతో మిలేయికి భారీ ఓటమి తప్పలేదు, ఆయన ఓటమిని అంగీకరించారు. తన మద్దతుదారులను ఉద్దేశించి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఎవరైనా దేశ పునర్నిర్మాణానికి ముందుకు వెళ్లాలనుకుంటే, మొదట వారు ఫలితాలను అంగీకరించాలన్నారు, ఓటమి తర్వాత కూడా తన ఉదారవాద సంస్కరణలను వేగవంతం చేస్తానని మిలేయి పునరుద్ఘాటించారు.. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన 54 ఏళ్ల మిలేయి పొదుపు చర్యల పేరుతో పెద్ద ఎత్తున సంక్షేమానికి కోత పెట్టారు. వ్యయాలను తగ్గించి, వేలాదిమంది ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. అర్జెంటీనా ఆర్థిక సంక్షోభం నుండి బయటపడాలంటే ఉదారవాద విధానాలే పరిష్కారమని, వచ్చే నెల జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో గెలుపొందాలని, కాంగ్రెస్‌లో తన పార్టీ మెజార్టీని పెంచుకోవాలని మిలేయి భావిస్తున్నారని ఆ దేశ మీడియా తెలిపింది. ప్రస్తుతం పెరోనిస్టులు (వామపక్ష వాదులు) అర్జెంటీనా కాంగ్రెస్‌లో పెద్ద సంఖ్యలో ఉన్నారు. వారు మిలేయి ప్రయత్నాలను అడ్డుకుంటున్నారు. మాజీ అధ్యక్షురాలు క్రిస్టినా ఫెర్నాండేజ్‌పై రాజకీయ కుట్ర చేసి అవినీతి కేసులో దోషిని చేసి అక్రమంగా గృహనిర్బంధం విధించింది మిలేయి ప్రభుత్వం. దీనికి వ్యతిరేకంగా భారీ నిరసనలు వెల్లువెత్తాయి. ఆమెకు మద్దతుగా అన్ని తరగతుల ప్రజలు, ఆ పార్టీ శ్రేణులు నిలిచాయి. ఆమె గృహనిర్బంధంలో ఉన్నా ప్రావిన్స్ ఎన్నికల్లో గెలవడం గమనార్హం.

వరద బాధితులను ఆదుకోండి

- విరాళాలు సేకరించాల్సిందిగా పార్టీ శాఖలకు సిపిఎం పిలుపు

న్యూఢిల్లీ : అసాధారణ రుతుపవనాలు, దానికి తోడైన మానవ తప్పిదాల ఫలితంగా ఈసారి వాయవ్య భారతంలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించాయి. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ కాశ్మీర్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల్లో కుంభవృష్టి కురిసింది. కొద్ది రోజులుగా కుండపోతగా కురిసిన వర్షాలకు వరదలు సంభవించడంతో పాటూ పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఆయా రాష్ట్రాల్లోని ప్రజలు అత్యవసర సాయానికై ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారని సిపిఎం పేర్కొంది. ఇటువంటి సంక్షోభ పరిస్థితుల్లో అవసరంలో వున్న వారికి సాయమందించేందుకు గానూ విరాళాలను సేకరించాల్సిందిగా పార్టీ అన్ని శాఖలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ఒక ప్రకటన విడుదల చేశారు. వసూలు చేసిన నిధులను ఈ దిగువన గల అకౌంట్ నెంబరుకు పంపితే, బాధిత రాష్ట్రాలకు ముఖ్యంగా బాధితుల సహాయ, పునరావాస చర్యలకు ఆ మొత్తాన్ని పంపడానికి వీలు వుంటుందని బేబీ తెలిపారు.

అకౌంట్ పేరు : కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)
అకౌంట్ నెంబరు : 07621000432853
ఐఎఫ్ఎస్ కోడ్ : పిఎస్ఐబి0000762
పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, గోల్ మార్కెట్, న్యూఢిల్లీ

విరాళాలను బదిలీ చేసినపుడు వెంటనే కేంద్ర కమిటీ కార్యాలయానికి తెలియచేసిన పక్షంలో సక్రమంగా ఖాతాలు నిర్వహించడానికి వీలు వుంటుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ సభ్యులందరికీ స్వాగతం పలకగా, రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేష్ ఓటింగ్ విధానం గురించి వివరించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎన్‌సిపి అగ్రనేత శరద్ పవార్, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, సిపిఎం నేతలు జాన్ బ్రిట్టాస్, రాధాకృష్ణన్, అమ్రారామ్, డిఎంకె నేత టిఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

మ్యాజిక్ ఫిగర్ 391

లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిపి మొత్తం 788 మంది ఉన్నారు. అందులో రాజ్యసభ నుండి 245 మంది, లోక్‌సభ నుండి 543 మంది ఉన్నారు. అలాగే రాజ్యసభకు నామినేట్ అయిన 12 మంది సభ్యులు కూడా ఓటు వేసేందుకు అర్హులే. రాజ్యసభలో ఆరు సీట్లు, లోక్‌సభలో ఒక సీటు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజీ 781 ఓట్లు ఉన్నాయి. అయితే ఉప రాష్ట్రపతి అభ్యర్థి గెలుపొందాలంటే.. మ్యాజిక్ ఫిగర్ కనీసం 391 ఓట్లు అవసరం. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ అభ్యర్థికి మొత్తం 425 మంది సభ్యులు మద్దతు ఇస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థికి 324 మంది ఎంపిల మద్దతు ఉంది. అలాగే ఎన్‌డిఎ అభ్యర్థికి బయటి నుంచి వైసిపి మద్దతు ఇస్తుంది. రాజ్యసభ, లోక్‌సభలో వారికి 11 మంది సభ్యులున్నారు.

బిఆర్ఎస్, బిజెడి దూరం

ఈ ఎన్నికకు తెలంగాణకు చెందిన కెసిఆర్ నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్), ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజు జనతాదళ్ (బిజెడి) రెండూ ప్రాంతీయ పార్టీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇందులో బిజెడికి ఉభయ సభల్లో కలిపి ఏడుగురు ఎంపిలున్నారు. బిఆర్ఎస్‌కు కేవలం నలుగురు రాజ్యసభ సభ్యులు మాత్రమే ఉన్నారు. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. అలాగే ఆప్ నుంచి బహిష్కరణకు గురైన స్వాతి మాలివాల్ రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. ఆమె ఓటు ఎవరికి వేస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. అలాగే కొంత మంది స్వతంత్రులు ఉన్నారు. వీరు ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తి నెలకొంది.

ఎవరేమన్నారు....?

- 'ఉప రాష్ట్రపతి ఎన్నిక సాధారణంగా చాలా బోరింగ్‌గా ఉంటుంది కానీ ఈసారి అది భిన్నంగా ఉంది' అని రాజకీయ విశ్లేషకులు నీర్జా చౌదరి పేర్కొన్నారు. ఎన్‌డిఎ అభ్యర్థి గెలుపునకు ఢోకా లేకపోయినప్పటికీ క్రాస్ ఓటింగ్ జరిగితే కేంద్ర ప్రభుత్వ బలాబలాల గురించి సందేహాలు చెలరేగుతాయని ఆమె అభిప్రాయ పడ్డారు. 'ఇండియా ఫోరం సంస్థాగత శక్తికి అది నిదర్శనమవుతుంది' అని ఆమె చెప్పారు.
- 'అభ్యర్థులందరూ దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారు. దీంతో అక్కడి ఎంపిలు ఎలా వ్యవహరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీలకు కట్టుబడుతారా లేదా అన్నది చూడాల్సిఉంది. ' అని సీనియర్ జర్నలిస్టు విజయ్ త్రివేది పేర్కొన్నారు.
- 'ఈ ఎన్నికల్లో పార్టీలు విప్ జారీ చేయలేవు. 1969లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి ఓడిపోయారు. ఇందిరాగాంధీ మద్దతుతో వివి గిరి గెలిచి రాష్ట్రపతి అయ్యారు.' అని మరో సీనియర్ జర్నలిస్టు అనంత్ మిశ్రా గుర్తుచేశారు.



కడపలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి హామీ చట్టం కింద పని చేసిన వేతనదారులకు కనీసం రూ.600 వేతనం ఇవ్వాలనే అంశంపై జాతీయ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. కేరళ ప్రభుత్వం ఆ రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికీ రూ.7.50 లక్షల చొప్పున ఐదు లక్షల మందికి ఇళ్లు కట్టించి ఇచ్చిందన్నారు. ఎపిలో పి-4 పథకం కింద పేదలను ధనికులకు దత్తత ఇచ్చి చేతులు దులుపుకోవాలని చంద్రబాబు చూస్తున్నారని, బాధ్యత నుంచి టిడిపి కూటమి ప్రభుత్వం తప్పుకోవాలని చూస్తోందని విమర్శించారు. అమెరికా మనదేశ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించడం, అమెరికా నుంచి దిగుమతి అయ్యే వాటిపై ఎటువంటి సుంకాలూ చేయవద్దని ట్రంప్ ఆంక్షలు విధించడం, దీనిపై కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం శోచనీయమన్నారు. మోడీ, ట్రంప్ విధానాలను తిప్పికొట్టగల సత్తా ఎర్రజెండాకే ఉందని తెలిపారు. రాజ్యసభ సభ్యులు వి.శివదాసన్ మాట్లాడుతూ చంద్రబాబు, వైఎస్.జగన్ ఇద్దరూ బిజెపికి తొత్తులేనని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల జీవన ప్రమాణాల మెరుగుదలకు పోరాడుతున్నామని తెలిపారు. అఖిల భారత కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్ మాట్లాడుతూ 11 ఏళ్ల బిజెపి పాలనలో ఐదు లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు.

మహిళా వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కన్వీనర్ లలితాబాలన్ మాట్లాడుతూ కేరళలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఆరు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, ఎపిలో ఎంతమందికి ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ హార్టికల్చర్ హబ్ అని, ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని అబద్దాలు చెప్పడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. కేంద్ర నిధులకు ఆశపడి రాష్ట్రానికి యూరియా కోటాను తగ్గించుకోవడం దారుణమని తెలిపారు. సోలార్ పరిశ్రమల పేరుతో పంట పొలాలను లాక్కోవడం ఏమిటని ప్రశ్నించారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులకు డబ్బుల్లేవు కానీ, గోదావరి-బనకచర్ల కడతామనడం ఏమిటని నిలదీశారు.

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసిపి హయాంలో బెంగళూరు, హైదరాబాద్, ముంబయి ప్రాంతాల పెత్తందారులు లక్ష ఎకరాలను ఆక్రమించుకున్నారని, తాము అధికారంలోకి వస్తే ఈ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు ఏమైందని ప్రశ్నించారు. కేరళ వెల్ఫేర్ బోర్డు తరహాలో వ్యవసాయ కార్మికులకు భూమి, పరిహారం చెల్లిస్తామన్న హామీ ఏమైందో చెప్పాలన్నారు. మోడీ హయాంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నా పవన్ కల్యాణ్ నోరెందుకు మెదపడం లేదని ప్రశ్నించారు. వేదికపైకి అతిథులను వ్యకాస జిల్లా అధ్యక్షులు శివకుమార్ ఆహ్వానించారు. అనంతరం కడపలోని హరితా హోటల్‌లో జాతీయ సమావేశం ప్రారంభమైంది.

(మొదటి పేజీ తరువాయి)

పడ్డారు. ఫలితంగా దేశవ్యాప్తంగా అశాంతి నెలకొంది. గాయపడిన వారందరూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో దాదాపు 50మంది పరిస్థితి విషమంగా వున్నట్లు తెలుస్తోంది. గాయపడిన వారిలో జర్నలిస్టులు కూడా వున్నారు. పలు ఆస్పత్రుల్లో ఎమర్జన్సీ వార్డులు కూడా నిండిపోయాయి. ఆస్పత్రుల అధికారులు అందించిన సమాచారం ప్రకారం ఖాట్మండులోని వివిధ ఆస్పత్రుల్లోనే 17మంది మృతి చెందారు. సున్సారిలో ఇద్దరు ఆందోళనకారులు కాల్పుల్లో చనిపోయారు. వివిధ ఆస్పత్రుల్లో 347మంది గాయపడినవారు చికిత్స పొందుతున్నారు.

నైతిక బాధ్యత వహిస్తూ హోం మంత్రి రాజీనామా

దేశంలో తలెత్తిన హింసాత్మక పరిస్థితుల నేపథ్యంలో ఎదురైన ఒత్తిడికి తలొగ్గుతూ నేపాల్ హోం మంత్రి రమేష్ లేఖక్ సోమవారం సాయంత్రం రాజీనామా చేశారు. యువతపై అణచివేత చర్యలకు పాల్పడినందుకు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ప్రకటించారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన రాజీనామా లేఖ అందచేశారు. సెప్టెంబర్ 4వ తేదీన నేపాల్ ప్రధాని కె.పి.శర్మ ఓలి ప్రభుత్వం మొత్తంగా దేశంలో సోషల్ మీడియాను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్, స్నాప్‌చాట్ వంటి వేదికలతో సహా విస్తృతంగా ఉపయోగించే యాప్‌లను, రిజిస్టర్ చేసుకోని మరికొన్ని సామాజిక మాధ్యమాలను నేపాల్ ప్రభుత్వం నిషేధించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యపై ప్రజాగ్రహం పెల్లుబికింది.

అదుపు తప్పిన పరిస్థితులు

సోషల్ మీడియా మద్దతుదారులు, సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నేటి తరం యువత నేపాల్ ప్రభుత్వ

భగ్గుమన్న నేపాల్!

చర్యలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చారు, ఆందోళనలు చేపట్టారు. సోషల్ మీడియాలో ఇచ్చిన పిలుపు మేరకే యువత వీదుల్లోకి వచ్చింది. కానీ కాసేపటికే పరిస్థితి అదుపు తప్పింది. సోమవారం లాయించౌర్‌లోని అధ్యక్షుని నివాసం (శీతల్ నివాస్), మహారాజ్‌గంజ్‌లోని ఉపాధ్యక్షుని నివాసం, బలూవతార్‌లోని ప్రధాని నివాసం సింహా దర్బార్‌లను అన్నివైపుల నుండి ఆందోళనకారులు చుట్టుముట్టారు. దీంతో ఖాట్మండు జిల్లా యంత్రాంగం కర్ఫ్యూ విధించింది. మరికొన్ని జోన్లలో కూడా రాత్రి పది గంటల వరకు కర్ఫ్యూను విధించారు. .అయినా పరిస్థితుల్లో మార్పు లేదు. ఆందోళన కారులు శాంతించలేదు. ప్రధాని నివాసంపై రాళ్లు రువ్వారు.

రంగంలోకి దిగిన సైన్యం

నిరసనలు ఉధృతమవుతుండడంతో సైన్యం రంగంలోకి దిగింది. పరిస్థితులను అదుపు చేయడానికి చర్యలు తీసుకుంటోంది. బారికేడ్లను భద్రతా బలగాలు ఏర్పాటు చేయగా, ఆందోళనకారులు వాటిని కూడా విరగ్గొట్టి మరీ పోలీసు వలయాన్ని ఛేదించుకుని పార్లమెంట్ ఆవరణలోకి ప్రవేశించారు. ప్రధాని కె.పి.శర్మ ఓలితో సహా నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తక్షణమే ప్రధాని దేశాన్ని వీడాలని వారు డిమాండ్ చేశారు. టిక్‌టాక్ వంటి కొన్ని సోషల్ మీడియాసైట్‌లు పనిచేస్తుండడంతో కొన్ని ఫోటోలు బయటకు వచ్చాయి. రక్తమోడుతూ యూనిఫారాల్లో వున్న విద్యార్థులు, ఆందోళనకారులను సమీప ఆస్పతులకు తీసుకెళుతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

పోలీసులు అతిగా వ్యవహరించారు : మానవ హక్కుల కమిషన్ విమర్శ

ఆందోళనకారులపై పోలీసులు అతిగా వ్యవహరించారని నేపాల్ మానవ హక్కుల కమిషన్ విమర్శించింది. నూతన తరం వాణిని కూడా ప్రభుత్వం గమనంలోకి తీసుకోవాలని, తక్షణమే ఆందోళనకారులపై బల ప్రయోగాన్ని ఆపాలని కోరింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. అటు భద్రతా బలగాలు ఇటు ఆందోళన కారులు సంయమనం వహించాల్సిందిగా విజ్ఞప్తి చేసింది.

సినీ నటుల మద్దతు

యువత చేపట్టిన నిరసనలు, ఆందోళనలకు నేపాలీ సినీ నటులు మద్దతు తెలిపారు. ఓలి ప్రభుత్వం పెద్దఎత్తున అవినీతిలో కూరుకుపోయింది, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం తీసుకునే చర్యలు దేశంలో ప్రతి పౌరుడినీ నిరాశపరుస్తున్నాయి. ఈనాటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. దేశం కన్న కలలను వారు నెరవేరుస్తారు. అందుకే జెనరేషన్ జెడ్ పేరుతో తలెత్తిన ఈ నిరసనలు, ఆందోళనలు చూసి వారి గొంతును వినాలని సినీ నటులు పిలుపునిచ్చారు. అవినీతి అధికారులను జవాబుదారీ చేయాలని, ప్రజల అవసరాలను అర్థం చేసుకునే నేతలు అధి కారంలో వుండాలని, దేశ ఆకాంక్షలను నెరవేర్చాలి అని గాయకుడు, నటుడు అయిన ప్రకాష్ సపుత్ వ్యాఖ్యానించారు. పాపులర్ ర్యాపర్ ఓఎంజి స్పార్క్ ఒక దశలో ఆందోళనకారులకు మద్దతుగా సంగీత ప్రదర్శన ఇచ్చారు.

విచారణ కమిటీ ఏర్పాటు

చెలరేగిన అల్లర్లపై దర్యాప్తు కోసం ఒక విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని నేపాల్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి నివాసం బాలువతార్‌లో సోమవారం సాయంత్రం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దర్యాప్తు చేయడానికి, నివేదిక సమర్పించడానికి కమిటీకి 15 రోజుల గడువు ఇచ్చారు.

క్యాన్సర్ వ్యాక్సిన్ సిద్ధం : రష్యా

మాస్కో : రష్యా కొత్తగా తయారుచేసిన క్యాన్సర్ వ్యాక్సిన్ ప్రి క్లినికల్ ట్రయల్స్‌లో అధిక ప్రభావం చూపించిందని, ఉపయోగానికి సిద్ధమైందని ఫెడరల్ మెడికల్ బయోలాజికల్ ఏజెన్సీ అధిపతి వెరోనికా స్క్వోర్ట్‌సోవా తెలిపారు. ఈ వ్యాక్సిన్‌కు రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అనుమతి కోసం వేచిచూస్తోందన్నారు. వ్లాదివోస్తోక్‌లో జరిగిన ఈస్టర్న్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ, మూడేళ్ల ప్రిక్లినికల్ ట్రయల్స్‌లో వ్యాక్సిన్ అద్భుతమైన ఫలితాలు చూపిందని తెలిపారు. ట్రయల్స్‌లో వ్యాక్సిన్ యొక్క భద్రతను నిరూపించాయి, దానిని పదేపదే వాడటంతో పాటు దాని అధిక సామర్థ్యాన్ని కూడా రుజువుచేశాయి. ఇది ట్యూమర్ పరిమాణం తగ్గడం, పెరుగుదల నెమ్మదించడంతో సంబంధం ఉంది," అని స్క్వోర్ట్‌సోవా అన్నారు. కొన్ని క్యాన్సర్లలో ఈ ప్రభావం 60-80% వరకు చేరిందని ఆమె తెలిపారు. వేసవి చివరిలో క్లినికల్ వాడుకకు అనుమతి పొందేందుకు ఆరోగ్య మంత్రిత్వ శాఖకు సమర్పించాం. వ్యాక్సిన్ వాడుకకు సిద్ధంగా ఉంది, మేము అనుమతి కోసం వేచిచూస్తున్నాం." వ్యాక్సిన్ గమలేయా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎపిడెమియాలజీ అండ్ మైక్రోబయాలజీ తయారు చేసింది. ఇదే ఇన్‌స్టిట్యూట్ రష్యా స్పుత్నిక్ కోవిడ్-19 వ్యాక్సిన్‌ను కూడా అభివృద్ధి చేసింది

జీవన సౌరభం


మన స్థాయిని పెంచేది మన ప్రవర్తన తప్ప ఎదుటి వారి పొగడ్త కాదు.

మీ కోసం

మొక్కజొన్న పొత్తులను ఉడికించే నీటితో కొద్దిగా పంచదార వేస్తే చాలా రుచిగా ఉంటాయి.



ఫలించిన ఉపాయం



ఒక చిట్టడవిలో ఉండే జింక తన కుందేలు నేస్తం కనబడక పోయేసరికి వెతుకుతూ చాలా దూరం ప్రయాణించింది. దారి తప్పిపోయి పెద్ద అడవిలోకి అడుగు పెట్టింది. అప్పుడే ఆ వైపుకి నక్క రావడం చూసిన ఓ కోతి పరుగున వచ్చి జింక చెవిలో ఉపాయం చెప్పింది. ఇంతలో నక్క, జింక వద్దకు రానేవచ్చింది.

'ఈ అడవికి నువ్వు కొత్తగా వచ్చినట్టున్నావు?' అంది నక్క. 'అవును.. కొత్తగానే వచ్చాను. అయితే ఒక్కదాన్నే రాలేదు. పులినే గడ గడలాడించిన తోడేలు నేస్తంతో వచ్చాను' అంది జింక ఎంతో ధైర్యంగా.

'తోడేలా..ఏది కనబడదే?' అంది నక్క. 'నాకు ఆకలిగా ఉందంటే అదిగో ఆ పొదల పక్కన ఉన్న ఆకుల కొమ్మను తేవడానికి వెళ్లింది' అని పొదను చూపించింది. పొద ఊగడం నక్క గమనించింది. అది చూసి నక్క భయంతో వెనక్కి పరుగెత్తింది.

'నక్క బావా! నక్క బావా! ఏంటి వెళ్లిపోతున్నావు? కాసేపు ఆగు. నా నేస్తం తోడేలును పరిచయం చేస్తాను' అంది వెనకాలే పరుగెడుతూ జింక. అయితే నక్క వెనక్కి తిరిగి చూడకుండానే, 'నాకు కాస్త పనుంది. వెళ్లి వస్తాను' అని పరుగు తీసింది.


నక్క వెళ్ళడం గమనించిన కోతి, పొదల నుండి జింక వద్దకు వచ్చింది. 'కోతి బావా! సమయానికి మంచి ఉపాయం చెప్పి నక్క నుండి నన్ను కాపాడినందుకు కృతజ్ఞతలు' అంది జింక.

'వేటాడడం చేతకాని ముసలి పులికి ఆ నక్క మంత్రిగా పనిచేస్తోంది. కనిపించిన సాధుజంతువులకు మాయమాటలు చెప్పి పులి గుహ వద్దకు తీసుకెళ్తుంది. అమాయకంగా నువ్వు ఆ నక్క మాయలో పడిపోతావేమోనని అలా చెప్పాను' అంది కోతి. అప్పుడే జింక స్నేహితుడు కుందేలు నోటినిండా క్యారెటు మొక్కలతో ఆయాసపడుతూ అటువైపు పరుగెడుతూ వచ్చింది. కుందేలుని చూసిన జింక సంతోషంతో అక్కడి నుండి వెనుదిరిగింది.

– యు.విజయశేఖర రెడ్డి,
హైదరాబాద్.

అంకెలు కలపండి

పిల్లలూ, కింద ఇచ్చిన అంకెలను వరుసగా కలిపి చూడండి.



నేను గీసిన బొమ్మ





కె.దుర్గాప్రసాద్,
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల,
మెప్పవలస గ్రామం,
లావేరు మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నిపుణులైన వైద్యులను తయారుచేస్తున్నాం...

'మారుతున్న నేటి సమాజంలో మనిషి జీవన శైలిలో వచ్చిన అనూహ్య మార్పులతో కొత్త రోగాలు, వైరస్‌లు వంటివి వస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల నుంచి ప్రజలను రోగ విముక్తులు చేయాలంటే నిపుణులైన వైద్యులు అత్యాధునిక వైద్య సేవలు అందించాలి. అందుకే ఆ దిశగా మేము నిరంతరం భావి భారత నిపుణులైన వైద్యులను తయారుచేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం' అని విజయవాడలోని డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం యూనివర్శిటీ 27,28వ స్నాతకోత్సవం జరగనున్న సందర్భంగా ఆయన ప్రజాశక్తితో సంభాషించారు. వివరాలు ఆయన మాటల్లోనే...



డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దేశంలో వైద్య విశ్వ విద్యాలయాల్లో మొట్టమొదటిది. అతి పెద్దది కూడానూ. ప్రపంచవ్యాప్తంగా నిరంతరం వైద్య రంగంలో వస్తున్న మార్పులను అన్వయించుకుంటూ నాణ్యమైన, పారదర్శకమైన, సృజనాత్మక వైద్య వైద్యను అందిస్తున్నాం. యూనివర్శిటీ పరిధిలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బిఎస్‌సి) మూడేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడికల్ సైన్సెస్ (బిఎఎంస్) 5 ఏళ్లు, బ్యాచిలర్ ఆఫ్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ (బియుఎంఎస్) మూడేళ్లు, మాస్టర్ ఆఫ్ సర్జరీ (ఎంఎస్) రెండేళ్లు, ఎంబిబిఎస్ ఐదేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ (బి.ఆప్టమ్) నాలుగేళ్లు, బ్యాచిలర్ ఆఫ్ డెంటల్ సైన్స్ (బిడిఎస్) నాలుగేళ్లు, మాస్టర్ ఆఫ్ డెంటల్ సైన్స్ (ఎండిఎస్) కోర్సులు కొనసాగుతున్నాయి. యూనివర్శిటీ పరిధిలో 356 వరకూ అనుబంధ కళాశాలలు కూడా ఉన్నాయి. వీటిలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్, డాక్టోరల్, సూపర్ స్పెషాలిటీ, డెంటిస్టిటీ, పిహెచ్‌డి వంటి 129 వరకూ కోర్సులు ఉన్నాయి. యుజిసి గుర్తింపుతోపాటుగా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ (ఐఎన్‌సి), సెంట్రల్ కౌన్సిలర్ ఆఫ్ హోమియోపతి (సిసిహెచ్), సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ (సిసిఎం)తోపాటుగా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) ద్వారా గుర్తింపు పొందిన యూనివర్శిటీ. ఆయా సంస్థల మంచి ర్యాంకింగ్ కూడా ఇచ్చాయి.

సేవా దృక్పథాన్ని పెంపొందిస్తున్నాం

'వైద్యో నారాయణ హరి' అని పెద్దలు అంటారు. ఎందుకంటే అనారోగ్యంతో బాధపడే రోగులకు సాంత్వన చేకూర్చి మెరుగైన ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు కృషిచేసేది డాక్టర్లే. యూనివర్శిటీ ద్వారా అలాంటి వైద్యులను తయారుచేసే కృషిలో నిరంతరం భాగస్వాములు కావటం ఎంతో సంతోషంగా ఉంది. డాక్టర్లకు వైద్య వృత్తి పట్ల నిబద్ధత, సేవానిరతి, నిరాడంబరత, నిజాయితీ అద్వితీయమైనవి. అలాంటి సుగుణాలు కూడా పెంపొందించేందుకు కృషిచేస్తున్నాం. రోగి, వైద్యుని బంధం సహృద్భావంతో ఉండాలి. ఈ తరహాలో చాలామంది ప్రముఖులు పనిచేసి ఆదర్శప్రాయులుగా నిలిచారు. ఇలాంటి వైద్యులను ఆదర్శంగా తీసుకుని వైద్య వృత్తిని సేవాదృక్పథం, నిబద్ధత, అంకితభావంతో నిర్వర్తించటానికి కృషి చేయాలని ప్రోత్సహిస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైద్య విధానాలకు అనుగుణంగా, వైద్య విద్య పద్ధతులను అవలంభిస్తున్నాం. జాతీయ, అంతర్జాతీయ వైద్య ఆరోగ్య దినోత్సవాల రోజుల్లో ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు, వివిధ రకాల వైద్య సేవల నిమిత్తం ఉచిత వైద్య శిబిరాలు వంటివి ఏర్పాటుచేస్తున్నాం. ఆరోగ్య పరిరక్షణ పట్ల ఆధునిక సమాజంలో చైతన్యం పెరుగుతోంది. అయితే ఇంకా పెరగాల్సిన అవసరం కూడా ఉంది. అందుకే వైద్య విద్యార్థులు కోర్సులోనూ, పూర్తయ్యాక కూడా వైద్య చికిత్సల్లో నిపుణత సాధించేందుకు కృషి చేస్తున్నాం. గాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేషన్‌లోనూ, రీసెర్చర్లకు కూడా ఇతే తరహాలో నాణ్యమైన వైద్యం నేర్చుకోవటం, నేర్చుకున్న పద్ధతులను రోగుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు కృషిచేసేలా ప్రోత్సహిస్తున్నాం.



ఆధునాతన వైద్యానికి ప్రాధాన్యత

మారుతున్న టెక్నాలజీని అన్వయించుకుని యూనివర్శిటీ పరిధిలోని కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో వైద్య విద్యలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నాం. గడిచిన 19 ఏళ్ల యూనివర్శిటీ వైద్య విద్యా ప్రయాణంలో అనేక అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. ఈ యూనివర్శిటీ ద్వారా వైద్య పట్టాలు పొందిన డాక్టర్లు నేడు దేశ విదేశాల్లో చాలా పెద్ద డాక్టర్లుగానూ, అత్యుత్తములుగానూ నిలుస్తున్నారు. యూనివర్శిటీలో చదువుకొని పురోగమనంలో వేలాది డాక్టర్లు నేడు సమాజంలో ప్రభుత్వ, ప్రయివేటు, కార్పొరేట్ రంగాల్లో వైద్య సేవలు అందిస్తుండటం ఎంతో శుభపరిణామం. రాబోయేకాలంలోనూ ఇలాంటి కృషిని కొనసాగిస్తూనే ఉంటాం.



సుదీర్ఘ ప్రయాణం

విజయవాడ కేంద్రంగా డాక్టర్ నందమూరి తారక రామారావు పేరుతో ఆరోగ్యశాస్త్ర విశ్వవిద్యాలయం 1986లో ఏర్పాటైంది. 1998 ఫిబ్రవరి 2వ తేదీ నుండి డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌గా పనిచేస్తోంది. అన్ని కోర్సుల్లో పరిశోధన, ఏకరీతి పాఠ్యప్రణాళికను అమలు చేయడంతో సహా వైద్య విద్య ప్రమాణాలను మెరుగుపర్చటం విశ్వవిద్యాలయం ప్రధాన లక్ష్యాలుగా ముందుకు సాగుతోంది. కార్యాలయ క్యాంపస్ సిద్ధార్థ మెడికల్ కాలేజీ భవనంలో మార్చి 2002 వరకూ ఉంది. ఆ తర్వాత ఏప్రిల్ 2002 నుంచి ప్రస్తుత భవనంలోకి మారింది.

నేడు 27,28వ స్నాతకోత్సవం

డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం 27, 28 వ స్నాతకోత్సవం మంగళవారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కానుంది. రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయ కులపతి జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అధ్యక్షత వహించనున్నారు. డిల్లీలోని నేషనల్ హార్ట్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అండ్ చీఫ్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ ఒపి యాదవ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రధానం చేయబోతున్నాం. వచ్చే ఏడాది నుంచి ఏటేటా స్నాతకోత్సవం నిర్వహిస్తాం. యూనివర్శిటీలో రీసెర్చ్ యాక్టివిటీస్ కోసం రూ.75 లక్షల గ్రాంట్ ఇచ్చాం. 2021, 2022 సంవత్సరాలకు సంబంధించిన 27వ, 28 వ స్నాతకోత్సవాలను ఒకేసారి నిర్వహిస్తున్నాం. 21వ స్నాతకోత్సవానికి సంబంధించి 53 మంది విద్యార్థులకు 72 మెడళ్లు (55 గోల్డ్, 17 సిల్వర్), 18 క్యాష్ ప్రైజ్‌లు, 28 వ స్నాతకోత్సవానికి సంబంధించి 67 మంది విద్యార్థులకు 84 మెడళ్లు (60 గోల్డ్, 24 సిల్వర్), 20 క్యాష్ ప్రైజ్‌లు అందించనున్నాం. ఐదుగురికి పీహెచ్ డీ పట్టాలు, సూపర్ స్పెషాలిటీలో ఒకరికి డిగ్రీ అందించబోతున్నాం. మెడళ్లకు ఎంపికైన వారికి ఇప్పటికే సమాచారాన్ని అందించాం. వారందరికీ వేదికపైన అతిథుల చేతులమీదుగా బహుమతులు, పట్టాలు అందించబోతున్నాం. విశ్వవిద్యాలయానికి కొత్త కార్యనిర్వాహక మండలి కూడా ఏర్పాటైంది. అందరినీ సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలో వైద్య విద్యను మరింత ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్లటానికి నిరంతరం కృషిచేస్తున్నాం.

–సంభాషణ : యడవల్లి శ్రీనివాసరావు



ఎపి కౌలురైతు సంఘానికి నూతన పతాకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి కౌలురైతు సంఘం నూతన పతాకాన్ని సోమవారం ఆవిష్కరించారు. విజయవాడలోని ఃఎంబివికెలో ఈ కార్యక్రమం జరిగింది. పల్నాడుజిల్లా చిలకలూరిపేటలో జరిగిన ఆ సంఘ రాష్ట్ర మూడవ మహాసభలో నూతన పతాకాన్ని రూపొందించాలని నిర్ణయించారు. ఆ మేరకు అనేక నమూనాలను పరిశీలించి నూతన జెండాను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, పంచకర్ల రంగారావు, యు.రామాంజనేయులు, పి.సుధాకర్ పాల్గొన్నారు.



చరిత్ర సృష్టించిన భారత ఆర్చర్లు

హాంగ్జౌ(చైనా): 2025 ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్ల పురుషుల జట్టు చరిత్ర సృష్టించింది. అమన్ సైనీ, రిషబ్ యాదవ్, ప్రథమేశ్ బాల్‌చంద్రలతో కూడిన భారత బృందం సోమవారం జరిగిన ఫైనల్లో డెన్మార్క్‌పై 148-148పాయింట్లతో తొలుత సమంగా నిలిచి, షూట్‌ఆఫ్‌లో 10-9తో సంచలన విజయం సాధించింది. టోర్నీ చరిత్రలో కాంపౌండ్ పురుషుల టీమ్‌కు బంగారు పతకం దక్కడం ఇదే తొలిసారి.

14 గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో



నాగార్జునసాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో సోమవారం కూడా 14 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 1,66,789 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. సాగర్ జలాశయం నుంచి అంతే మొత్తంలో వదులుతున్నారు. ప్రస్తుతం సాగర్ జలాశయంలో నీటిమట్టం 589.20 అడుగులుగా ఉంది. కుడి కాలువ ద్వారా 9700 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 9076 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 33089 క్యూసెక్కులు, ఎస్‌ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, 14 క్రస్ట్ గేట్ల ద్వారా 1,45,313 క్యూసెక్కులు.. మొత్తంగా 1,66,789 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలానికి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పడుతుంది. సోమవారం సాయంత్రానికి శ్రీశైలానికి ఎగువ నుంచి 83950 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుకుంటుండగా.. ప్రస్తుతం శ్రీశైలంలో 884.20 అడుగులుగా ఉంది.

డీఫాల్ట్ బెయిల్ మంజూరుపై కీలక ఉత్తర్వులు

- ఆఫీస్ మెమోరాండం అమలును నిలిపేస్తూ హైకోర్టు స్టే

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో బాలాజీ గోవిందప్ప, కాల్వ ధనంజయరెడ్డి, పెళ్లకూరు కృష్ణమోహన్ రెడ్డికి విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయడంపై హైకోర్టు సోమవారం కీలక ఉత్తర్వులిచ్చింది. సిట్ వేసిన ఛార్జిషీట్‌లో లోపాలను ఎసిబి కోర్టు ఎత్తిచూపింది. ఈ మేరకు గత నెల 23న ఇచ్చిన ఆఫీస్ మెమోరాండం అమలును నిలిపివేస్తూ హైకోర్టు స్టే విధించింది. ఆ మెమోరాండంను ఆధారంగా వెలువరించిన తీర్పులోని పలు అంశాలపై కూడా స్టే విధించింది. బెయిల్‌పై బయటకొచ్చిన ఆ ముగ్గురి వాదనలు వినాల్సి వుందని పేర్కొంటూ నోటీసులు జారీ చేసింది. మరో నిందితుడు బూనే చాణక్యకు డీఫాల్ట్ బెయిల్ ఇవ్వకుండా ఎసిబి కోర్టును నిరోధించాలని కోరుతూ సిట్ వేసిన పిటిషన్‌ను కూడా విచారించింది. చాణక్యకు కూడా నోటీసులిచ్చింది. ఈ నలుగురికి సిట్ వ్యక్తిగతంగా నోటీసులిచ్చేందుకు అనుమతినిచ్చింది. విచారణను ఈ నెల 11కు వాయిదా వేస్తూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ప్రకటించారు.

తొలి ముగ్గురికీ ఎసిబి కోర్టు ఈ నెల 6న డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేస్తూ ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని సిట్ హైకోర్టులో పిటిషన్ వేసింది. తమ ఛార్జిషీట్‌లో లోపాలను ఎసిబి కోర్టు ఎత్తిచూపడాన్ని సవాల్ చేసింది. తీర్పు వెలువడే వరకు ఎసిబి కోర్టు తీర్పుపై స్టే విధించాలని కోరింది. ఆఫీస్ మెమోరాండంపై కూడా స్టే విధించాలంది. బూనేటి చాణక్యకు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేయకుండా ఎసిబి కోర్టుకు ఆదేశాలివ్వాలని కోరింది. సకాలంలో ఛార్జిషీట్ వేసినప్పటికీ ఎసిబి కోర్టు డీఫాల్ట్ బెయిల్ ఇచ్చిందని సిట్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్, పిపి మెండ లక్ష్మీనారాయణ వాదించారు.

అలాగే మద్యం కేసులో నిందితుడు పైలా దిలీప్‌కు విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు బెయిల్ ఇవ్వడాన్ని సిట్ హైకోర్టులో సవాల్ చేసింది. బెయిల్ ఉత్తర్వులను రద్దు చేయాలంటూ సోమవారం హైకోర్టును ఆశ్రయించింది. దిలీప్ వేసిన రెండు బెయిల్ పిటిషన్లను కొట్టేసిన తర్వాత పరిస్థితుల్లో మార్పులు ఏమీ లేకపోయినప్పటికీ బెయిల్ మంజూరైందని తప్పుపట్టింది. దీనిని హైకోర్టు విచారణ చేయనుంది.

ఆసియాకప్ సంగ్రామం నేటినుంచే..

- తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌తో హాంకాంగ్ ఢీ
- రాత్రి 8.00గం॥ల నుంచి



దుబాయ్: ఆసియాకప్ పురుషుల క్రికెట్ టోర్నమెంట్‌కు రంగం సిద్ధమైంది. ఎనిమిది జట్ల మధ్య జరిగే క్రికెట్ టోర్నీ ఈనెల 28న దుబాయ్ వేదికగా జరిగే ఫైనల్‌తో ముగియనుంది. టి20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నమెంట్‌లో ఆడే 8జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. రెండు గ్రూపుల్లో టాప్-2లో నిలిచిన రెండేసి జట్లు సూపర్-4లోకి ప్రవేశించనున్నాయి. ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ జట్ల మధ్య మంగళవారం జరిగే తొలి మ్యాచ్‌లో మెగా టోర్నీ ప్రారంభం కానుండగా.. గ్రూప్ స్టేజ్ మ్యాచులు 20వరకు ఆ తర్వాత 21నుంచి సూపర్-4 మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. సూపర్-4లో టాప్-2 స్థానాల్లో నిలిచిన రెండుజట్లు ఫైనల్లో టైటిల్ కోసం తలపడతాయి. దుబాయ్, అబుదాబి వేదికలుగా మొత్తం 19మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐసిసి టి20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న టీమిండియా టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారతజట్టు దుర్భేధ్యఫామ్‌లో ఉంది. గ్రూప్-ఎలో భారత్, పాకిస్తాన్, యుఎఇ, ఒమన్, గ్రూప్-బిలో ఆఫ్ఘనిస్తాన్, హాంకాంగ్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. ఈ క్రమంలో భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ జట్లు సూపర్-4లోకి ప్రవేశించే ఛాన్స్ ఉంది. సంచలనాల ఆఫ్ఘనిస్తాన్, ఆతిథ్య యుఎఇలను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

యుఎస్ ఓపెన్ విజేత అల్కరాజ్

- ఫైనల్లో టాప్‌సీడ్ సిన్నర్‌పై గెలుపు



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్ టైటిల్‌ను స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ చేజిక్కించుకున్నాడు. సోమవారం జరిగిన ఫైనల్లో అల్కరాజ్ టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్‌ను చిత్తుచేశాడు. నాలుగుసెట్ల హోరాహోరీ ఫైనల్లో అల్కరాజ్ 6-2, 3-6, 6-1, 6-4 తేడాతో విజయం సాధించాడు. దీంతో అల్కరాజ్ మళ్లీ ప్రపంచ నంబర్ 1 స్థానానికి ఎగబాకాడు. ఫైనల్ మ్యాచ్ సుమారు రెండుగంటల 45 నిమిషాలపాటు సాగింది. తొలిసెట్‌ను సునాయాసంగా నెగ్గిన అల్కరాస్.. రెండో సెట్‌ను సిన్నర్‌కు కోల్పోయాడు. మళ్లీ తేరుకున్న 22ఏళ్ల స్పెయిన్ సంచలనం మూడో సెట్‌లో విజృంభించి 6-1 తేడాతో 24ఏళ్ల ఇటలీ స్టార్‌ను మట్టికరిపించాడు. కీలక నాలుగో సెట్‌లో కూడా 6-2తో పైచేయి సాధించిన అల్కరాజ్ విజేతగా నిలిచాడు. దీంతో రెండోసారి యుఎస్ ఓపెన్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. అల్కరాజ్ కెరీర్‌లో ఇది ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2022లో తొలిసారిగా యుఎస్ ఓపెన్‌ను దక్కించుకున్న అల్కరాజ్.. మళ్లీ మూడేళ్ల తర్వాత ఈ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్ ఫైనల్లోనూ తలపడ్డ వీరిద్దరూ ముచ్చటగా మూడోసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో పోటీపడ్డారు. ఫ్రెంచ్ ఓపెన్‌ను అల్కరాజ్ గెలుచుకోగా, వింబుల్డన్‌ను సిన్నర్ సొంతం చేసుకున్నాడు. టైటిల్ విజేతగా నిలిచిన అల్కరాజ్‌కు భారత కరెన్సీలో రూ.44కోట్లు, రన్నరప్ సిన్నర్‌కు రూ.22కోట్లు ప్రైజ్ మనీ లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68